PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 9 | విజయవాడ, శుక్రవారం 9 ఆగస్టు 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Friday 9 August 2024 | Rs



నీరజ్ చోప్రాకు రజతం

8



బుద్ధదేవ్ కన్నుమూత

రాష్ట్రపతి, ప్రధాని నివాళి

సిపిఎం దిగ్భ్రాంతి

కోల్‌కతా : బెంగాల్ కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో ఒక అధ్యాయం ముగిసింది. ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, సిపిఎం సీనియర్ నేత బుద్ధదేవ్ భట్టాచార్య (80) కన్నుమూశారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గురువారం ఉదయం 8.20 గంటలకు కోల్‌కత్తాలోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. ఆయన కొన్ని సంవత్సరాలుగా వృద్ధాప్య సంబంధమైన ఆరోగ్య సమస్యలతో, శ్వాసకోశ ఇబ్బందులతో బాధపడుతున్నారు. అనేకసార్లు ఆస్పత్రిలో చేరి చికిత్స పొందారు. రెండుసార్లు కోవిడ్ మహమ్మారి బారిన పడ్డారు. అనారోగ్యం కారణంగానే కొంతకాలంగా ప్రజా జీవితానికి దూరంగా ఉండిపోయారు. బుద్ధదేవ్‌కు భార్య మీరా, కుమార్తె సుచేతన ఉన్నారు. బుద్ధదేవ్ మరణ వార్తను సిపిఎం బెంగాల్ రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ సలీం ధ్రువీకరించారు. ఈ విషయం తెలియడంతో పెద్ద సంఖ్యలో ప్రజలు ఆయన నివాసానికి తరలివచ్చి నివాళులర్పించారు. సిపిఎం పొలిట్ బ్యూరో విప్లవాంజలి ఘటించింది. పార్టీ కోసం, ప్రజల కోసం ఆయన అంకితభావంతో కృషి చేశారని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పేర్కొన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్రమోడీతో పాటు పలువురు ప్రముఖులు ఘన నివాళి అర్పించారు. ఆయన మృతికి సంతాప సూచకంగా బెంగాల్ ప్రభుత్వం గురువారం సెలవు ప్రకటించింది. బుద్ధదేవ్ భౌతికకాయాన్ని పామ్ అవెన్యూలోని ఆయన నివాసం నుండి పీస్ వరల్డ్‌కు తరలించారు. శుక్రవారం ఉదయం 10.30 గంటలకు పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ప్రజల సందర్శనార్థం ఉంచుతారు. అనంతరం పరిశోధనల నిమిత్తం ఆయన కోరిక మేరకు రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే ఎన్ఆర్ఎస్ వైద్య కళాశాల ఆస్పత్రికి అందజేస్తారు.ఐదు దశాబ్దాలకు పైగా రాజకీయ జీవితాన్ని గడిపి, 11 సంవత్సరాల పాటు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా పనిచేసిన బుద్ధదేవ్ తుది వరకు అత్యంత నిరాడంబర జీవితాన్ని గడిపారు.



కాంస్య పతక పోటీలో స్పెయిన్‌పై గెలుపుతో సంబరాలు చేసుకుంటున్న హాకీజట్టు ఆటగాళ్లు.

హాకీలో అదరహో...

వరుసగా రెండో ఒలింపిక్స్‌లోనూ కాంస్యం

ఉత్కంఠ పోరులో స్పెయిన్‌పై 2-1 గోల్స్‌తో భారత్ గెలుపు

8

వక్ఫ్ బిల్లు రాజ్యాంగ విరుద్ధం

- ప్రతిపక్షాల ఆందోళనతో స్టాండింగ్ కమిటీకి నివేదన
- తీవ్రంగా వ్యతిరేకించిన ఇండియా ఫోరం, వైసిపి
- మద్దతు ఇస్తామన్న టిడిపి, జెడియు


ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ప్రతిపక్షాల తీవ్రంగా వ్యతిరేకించడంతో వక్ఫ్‌బిల్లును పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీకి పంపుతున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. లోక్‌సభలో ప్రతిపక్షాల ఆందోళన మధ్య గ కేంద్ర మైనార్టీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు గురువారం వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు, మిగతా 5లో

బిల్లును వెనక్కి తీసుకోండి

- సిపిఎం ఎంపి కె.రాధాకృష్ణన్

సిపిఎం ఎంపి కె. రాధాకృష్ణన్ మాట్లాడుతూ ఈ బిల్లు భిన్నత్వంలో ఏకత్వానికి వ్యతిరేకంగా ఉందని అన్నారు. రాజ్యాంగం కల్పించిన మత హక్కుకు వ్యతిరేకమైనదని చెప్పారుజ రాజ్యాంగంలోని ఆర్టికల్ 25, 26, 27, 28,29, 30కి విరుద్ధంగా బిల్లు ఉందన్నారు. ఈ బిల్లు ప్రకారం వక్ఫ్ బోర్డు నామినేటెడ్ బోర్డు కాబోతోందని అన్నారు. ఈ బిల్లు తీసుకురాకముందు ప్రభుత్వం భాగస్వామ్య పక్షాలతో ఎటువంటి సంప్రదింపులు చేయలేదని విమర్శించారు. ఈ బిల్లును ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని, స్టాండింగ్ కమిటీకి పంపాలని డిమాండ్ చేశారు.



రెజ్లింగ్‌కు వినేశ్ గుడ్‌బై

8

త్వరలో జన్మభూమి-2

- టిడిపి పొలిట్‌బ్యూరో సమావేశంలో చంద్రబాబు

5

ఇసెట్‌లో 21,023 సీట్లు ఖాళీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇసెట్‌లో 21,023 సీట్లు ఖాళీగా ఉన్నాయి. ఇంజినీరింగ్ కోర్సు రెండో సంవత్సరం ప్రవేశాలకు సంబంధించిన ఇసెట్-2024 తుదిదశ కౌన్సెలింగ్ గురువారంతో ముగిసింది. సీట్ల కేటాయింపు ఆర్డర్లను సెట్ కన్వీనర్ గుమ్మల గణేష్ గురువారం విడుదల చేశారు. మొత్తం 240 కళాశాలల్లో 41,992 సీట్లు ఉన్నాయని తెలిపారు. వీటిల్లో 20,969 భర్తీ అయ్యాయని పేర్కొన్నారు. 19 యూనివర్సిటీ కళాశాలల్లో 2,181 సీట్లు అందుబాటులో ఉండగా, 1,823 భర్తీ అయ్యాయని తెలిపారు. 221 ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల్లో 39,741 సీట్లకు 19,146 సీట్లు భర్తీ చేశామని వివరించారు. ఈ నెల 9 నుంచి 13వ తేదీలోపు విద్యార్థులు కళాశాలల్లో ఆన్‌లైన్ రిపోర్టింగ్‌తోపాటు కళాశాలల్లో కూడా నమోదు కావాల్సి ఉందన్నారు. ఈ నెల 14వ తేదీలోపు భర్తీ అయిన సీట్లు, విద్యార్థుల వివరాలను కళాశాలల యాజమాన్యాలు తమకు అందించాలని వెల్లడించారు.

అన్ని ఫిర్యాదులనూ పరిష్కరిస్తాం

- గ్రీవెన్స్‌లో మంత్రులు, టిడిపి నేతలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తమ వద్దకు వచ్చిన అన్ని ఫిర్యాదులనూ పరిశీలించి పరిష్కరిస్తామని మంత్రులు, టిడిపి నేతలు తెలిపారు. టిడిపి కార్యాలయంలో గ్రీవెన్స్ కార్యక్రమం గురువారం కొనసాగింది. రోడ్లు, భవనాలశాఖ మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్.. చినబాబు ప్రజల నుంచి వచ్చిన వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు. అర్జీదారుల నుంచి వచ్చిన వినతిపత్రాలు, సమస్యలను వారు క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. కొన్ని సమస్యలకు సంబంధితశాఖ అధికారులకు పంపారు.

టిడిపి పోటీ అనైతికం

- వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విశాఖపట్నం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలో మెజార్టీ లేకున్నా తెలుగుదేశం పార్టీ అనైతికంగా పోటీ చేస్తోందని వైసిపి అధినేత జగన్ మోహన్ రెడ్డి అన్నారు. తాడేపల్లిలోని తన నివాసంలో గురువారం ఆయన నర్సీపట్నం, పెందుర్తి, పాయకరావుపేట నియోజకవర్గాలకు చెందిన స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులతో సమావేశమైనారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చంద్రబాబునాయుడి కుట్రలను, కుతంత్రాలను అధిగమించి వైసిపి అభ్యర్థి బొత్స సత్యనారాయణను గెలిపించాలని కోరారు. ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి ప్రజాస్వామ్యాన్ని కాపాడేలా వుండాలన్నారు. కాని చంద్రబాబునాయుడు అలాంటి సాంప్రదాయాలను గాలికి వదిలి అక్రమాలతోనైనా విశాఖపట్నంలో గెలవాలని చూస్తున్నారని అన్నారు. చేసిన వాగ్దానాలపై 2014లో మాట తప్పినట్లే ఇప్పుడు కూడా మాటతప్పుతున్నారని అన్నారు. ఇప్పటికే ప్రజలకు అర్థమైందన్నారు. కష్టకాలంలో మనం ఎలా ఉంటున్నామనేది ప్రజలు చూస్తారని ఎవరూ అధైర్య పడవద్దని చెప్పారు. చీకటి తర్వాత వెలుగు రాక మానదని భవిష్యత్ వైసిపిదేనని అన్నారు.

విశాఖపట్నం స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో అన్యాయంగా వ్యవహరించారని అన్నారు. ధనబలం, అధికార బలంతో గెలవాలనుకున్న చంద్రబాబుకు తగిన విధంగా బుద్ధిచెప్పే అవకాశం మీకు వచ్చిందన్నారు.

బెంగాల్ ప్రజల్లో చెరగని ముద్ర

బుద్ధదేవ్‌కు నివాళిలో ఎం.ఎ.గఫూర్



బుద్ధదేవ్ భట్టాచార్యకు నివాళులర్పించిన అనంతరం జరిగిన సభలో ప్రసంగిస్తున్న ఎంఎ గఫూర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

బెంగాల్ కమ్యూనిస్టు ఉద్యమంలో బుద్ధదేవ్ భట్టాచార్య పాత్ర ఎంతో విలువైందని, జ్యోతిబసు తరువాత ప్రజలు అభిమానించే నాయకుడిగా ఆయన ఎదిగారని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్ అన్నారు. బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్యకు నివాళి కార్యక్రమం గురువారం సాయంత్రం విజయవాడలోని సిపిఎం రాష్ట్ర కార్యాలయంలో జరిగింది. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత బుద్ధదేవ్ చిత్రపటానికి గఫూర్ పూలమాలవేసి నివాళులర్పించారు. సంతాప సూచకంగా రెండు నిముషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా గఫూర్ మాట్లాడుతూ బుద్ధదేవ్ భట్టాచార్య ప్రజా ఉద్యమంతోపాటు రచయితగా సాంస్కృతిక ఉద్యమంతో ఆయన జీవితం ముడిపడి ఉందని తెలిపారు. బెంగాల్‌ను ఆధునీకరించి యువతకు ఉపాధి కల్పించే కార్యక్రమం తృణమూల్ అరాచక ప్రవర్తన వల్ల మధ్యలోనే ఆగిపోయిందని చెప్పారు. . ఉపాధి కల్పన చాలా ముఖ్యమైన అంశంగా ఆయన పరిగణించారని పేర్కొన్నారు. బెంగాల్లో కమ్యూనిస్టు చరిత్ర మహోన్నతమైందని వివరించారు. బుద్ధదేవ్ లేనిలోటును ఉద్యమం అధిగమించగలుగుతుందనే విశ్వాసాన్ని గఫూర్ వ్యక్తం చేశారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం మాట్లాడుతూ బుద్ధదేవ్ పార్టీలో కీలకనేతగా ఉంటూనే, బెంగాలీ సృజనాత్మక సాహిత్యంలో ప్రముఖులని, భావుకుడైన కవని పేర్కొన్నారు. సమయం దొరికితే సాహితీ కార్యక్రమాల్లో పాల్గొనేవారని తెలిపారు. ప్రపంచ పరిణామాలను ఎప్పటికప్పుడు పరిశీలించి బెంగాల్ భాషలోకి అనువదించి ప్రజలకు అందించారని పేర్కొన్నారు.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బుద్ధదేవ్‌ది బెంగాల్ పార్టీ ఉద్యమంలో కీలకపాత్రని, 35 సంవత్సరాల పాటు మంత్రిగా పనిచేశారని తెలిపారు. సెమీ ఫాసిస్టు టెర్రరిజం వచ్చిన సమయంలో విద్యార్థి ఉద్యమంలో అనిల్ బిశ్వాస్‌తో కలిసి అత్యంత కీలకంగా వ్యవహరించారని తెలిపారు.. చనిపోయే వరకూ రెండుగదుల ఇంట్లోనే నివసిస్తూ నిరాడంబర జీవితం గడిపారని అన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే బుద్ధదేవ్‌కు అర్పించే ఘన నివాళని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు, సిహెచ్.బాబూరావు, వి.వెంకటేశ్వర్లు, కె.ప్రభాకరరెడ్డి, బి.తులసీదాసు తదితరులు పాల్గొన్నారు.

కందిపప్పు కేటాయించండి

- రూ.1,187 కోట్ల పెండింగ్ నిధులను విడుదల చేయండి
- కేంద్ర మంత్రులకు మంత్రి నాదెండ్ల వినతి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్రానికి సరిపడా కందిపప్పు కేటాయించాలని రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కోరారు. ఈ మేరకు గురువారం నాడిక్కడ కేంద్ర ఆహార, ప్రజా పంపిణీశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి, కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరీని మంత్రి నాదెండ్ల మనోహర్ కలిశారు. ఈ మేరకు ఆయన వివిధ అంశాలపై కేంద్ర మంత్రులకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎపి భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ.. రాష్ట్రానికి కందిపప్పు కేటాయింపులు చేయాలని కోరినట్లు తెలిపారు. ఎపిలో ప్రస్తుతం ఉన్న ఎన్‌ఎఫ్‌ఎస్‌ఎ కవరేజీ కాకుండా లబ్ధిదారుల కవరేజీని మరింత పెంచాలని కోరినట్లు చెప్పారు. రాష్ట్రంలో మరో ఎనిమిది ప్రెస్ రిపోర్టింగ్ కేంద్రాలను పెంచేందుకు అనుమతినివ్వాలని విజ్ఞప్తి చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో ధరల స్థిరీకరణకు రూ.532 కోట్ల ధరల స్థిరీకరణ నిధులను కేటాయించాలని కోరినట్లు చెప్పారు. రాష్ట్రానికి రావాల్సిన రూ.1,187 కోట్ల పెండింగ్ నిధులను వీలైనంత త్వరగా విడుదల చేయాలని డిమాండ్ చేసినట్లు చెప్పారు. రాష్ట్రంలో 11 సిలో గోడౌన్ల నిర్మాణానికి అనుమతి మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. పార్లమెంటు సమావేశాలు ముగిసిన తరువాత ఒక ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి ఈ అంశాలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారని మంత్రి మనోహర్ తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న 60 లక్షల దీపం కనెక్షన్లను పిఎంయువై పథకం కింద వచ్చేలా మార్చాలని కేంద్ర పెట్రోలియం మంత్రిని కోరినట్లు చెప్పారు. సిఎం చంద్రబాబు రాసిన లేఖను కేంద్ర మంత్రికి అందజేశానని అన్నారు. ఈ అంశాన్ని పరిశీలించి, చర్యలు తీసుకుంటామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారని మంత్రి మనోహర్ పేర్కొన్నారు.

రెజ్లర్ వినేష్ ఫోగట్‌కు అంతా అండగా నిలవాలి

- ఒలింపిక్ కమిటికీ కేంద్రం నిరసన తెలపాలి
- ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పారిస్‌లో జరుగుతున్న ఒలంపిక్స్‌లో భారత రెజ్లర్ వినేష్ ఫోగట్‌కు జరిగిన అన్యాయంపై కేంద్ర ప్రభుత్వం ఒలింపిక్ కమిటీకి నిరసనను తెలపాలని డివైఎఫ్‌ఐ డిమాండ్ చేసింది. వినేష్ ఫోగట్‌కు సంఘీభావంగా గురువారం విజయవాడలోని పలు విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులతో కలిసి ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శులు కె ప్రసన్నకుమార్, జి రామన్న మాట్లాడారు. ఒలింపిక్స్‌లో రెజ్లర్ వెంట వెళ్లిన వారిపై సర్వత్రా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని తెలిపారు. క్రీడాకారుల వెంట వుండి వారిని పర్యవేక్షించడంలో వారు విఫలమయ్యారని అన్నారు. ఫైనల్స్ వరకు వచ్చిన వినేష్ ఫోగట్‌ను 100 గ్రాముల బరువు ఎక్కువ అని డిస్క్వాలిఫై చేయడం తగదని అన్నారు. తక్షణం కేంద్రం జోక్యం చేసుకుని వినేష్ ఫోగట్‌కు అండగా నిలిచి అంతర్జాతీయ ఒలింపిక్ సంఘం ముందు నిరసన వ్యక్తం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు వై రాము, నాయకులు కృష్ణ, శివ, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు కుమారస్వామి, ప్రణీత, ప్రవళ్లిక తదితరులు పాల్గొన్నారు.

అధికార లాంఛనాలతో అంతిమ యాత్ర

- అవయవదాతలకు కల్పించాలని ప్రభుతం ఉత్తర్వులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బ్రెయిన్‌డెడ్‌తో మరణించి అవయవదానంతో పలువురికి జీవదాతలుగా నిలిచిన వారి భౌతికకాయాలకు గౌరవప్రదమైన వీడ్కోలు పలకాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మృతుల కుటుంబాలకు రూ.10 వేలు పారితోషికాన్ని అందజేయాలని వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎమ్‌టి కృష్ణబాబు గురువారం జిఓ 95 విడుదల చేశారు. బ్రెయిన్‌డెడ్ వ్యక్తి భౌతిక శరీరం నుంచి అవయవాలను జిల్లా ప్రభుత్వాస్పత్రి లేదా సంబంధిత ప్రైవేట్ ఆస్పత్రి ప్రధానాధికారి ద్వారా సేకరించిన తరువాత జిల్లా కలెక్టరు కుటుంబ సభ్యులకు సమాచారాన్ని అందించాలని తెలిపారు. దాత భౌతిక దేహానికి రాష్ట్ర ప్రభుత్వం అధికార లాంఛనాలతో అంతిమ సంస్కారాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టరు హాజరు కావాలని తెలిపారు. ముందుగా నిర్ణయించిన అధికారిక కార్యక్రమాల వల్ల కలెక్టరు హాజరుకాకపోతే జిల్లా స్థాయి సీనియర్ అధికారిని పంపాలని సూచించారు. అవయవదాతల కుటుంబ సభ్యుల్ని గౌరవిస్తూ వారిని శాలువా, ప్రశంసాపత్రం, పుష్పగుచ్ఛాలతో సత్కరించాలని తెలిపారు.

విత్తనాల కొరత రాకూడదు

- అధికారులకు సిఎం ఆదేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో రైతులకు ఎక్కడా విత్తనాల కొరత రాకుండా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో వ్యవసాయ అనుబంధ రంగాలపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్ వ్యవసాయశాఖకు సంబంధించిన అంశాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వరించారు. అనంతరం సిఎం మాట్లాడుతూ జూలైలో కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంటలు వేసుకునేందుకు వీలుగా రూ.36 కోట్లను ఇన్‌పుట్ సబ్సిడీ కింద విడుదల చేయాలని ఆర్థికశాఖ అధికారులను ఆదేశించారు.

రాష్ట్రంలో వందశాతం ఇ క్రాప్ నమోదు చేయాలని చెప్పారు. పెట్టుబడి వ్యయాన్ని తగ్గించి రైతులకు నికర ఆదాయం పెరిగేలా వ్యవసాయంలో తగిన మార్పులు తీసుకురావాల్సి ఉందని, ఆ దిశలో ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. అలాగే నికర ఆదాయాన్ని పెంచేలా సాంకేతికతను వినియోగించాలని, దీనికోసం సమగ్ర విధానం రూపొందించాలని అన్నారు. పంట పొలాల్లో పురుగులమందులు పిచికారి వంటివాటికి డ్రోన్ల వినియోగాన్ని పెంచాలని సూచించారు. కేంద్ర పౌర విమానయానశాఖతో మాట్లాడి రాష్ట్రంలో డ్రోన్ టెస్టింగ్ కేంద్రం ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. నేలలో తేమను గుర్తించేందుకు శాటిలైట్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అన్నదాత పథకానికి సంబంధించిన మార్గదర్శకాలు త్వరలో విడుదల చేస్తామని తెలిపారు. రానున్న రోజుల్లో ఉద్యాన పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. గతంలో అమలు చేసిన ఉద్యానపంటల విధివిధానాలను పూర్తిగా అనుసరించాలని స్పష్టం చేశారు. 15 శాతం జిఎస్‌డిపిని సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అయిల్‌పామ్, కొబ్బరి, కోకో వంటి పంటల్లో మెరుగైన ఉత్పత్తి సాధించేందుకు సమగ్ర విధానాలను అనుసరించాలని సూచించారు. ఫుడ్ ప్రాసెసింగ్‌కు సంబంధించి ఉత్తమ విధానాలను అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో మంత్రి అచ్చెన్నాయుడు, సహకారశాఖ కమిషనర్ ఏ.బాబు తదితరులు పాల్గొన్నారు.

బుద్ధదేవ్ మృతిపట్ల సిపిఎం రాష్ట్ర కమిటీ దిగ్భ్రాంతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పశ్చిమబెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య మృతిపట్ల సిపిఎం రాష్ట్ర కమిటీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ఈ మేరకు రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు గురువారం ప్రకటన విడుదల చేశారు. పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులుగా, 2000 నుండి 2011 వరకూ పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రిగా పనిచేసిన బుద్ధదేవ్ మృతిపట్ల ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. విద్యార్థి ఉద్యమంలో రాజకీయ ప్రస్తానాన్ని ప్రారంభించిన ఆయన 1966లో డివైఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారని తెలిపారు. 1966లో సిపిఎంలో చేరి అంచెలంచెలుగా పొలిట్‌బ్యూరో స్థాయికి ఎదిగారని పేర్కొన్నారు. ఆయన స్వయంగా రచయిత, బెంగాలీ సాహిత్యం మరియు సాంస్కృతిక రంగాల్లో విశేష కృషి చేశారని పేర్కొన్నారు. దాదాపు మూడు దశాబ్దాల బెంగాల్ లెఫ్ట్‌ఫ్రంట్ ప్రభుత్వంలో విశేషమైన కృషి చేశారని, ఆయన మరణంతో బెంగాల్ వామపక్ష ఉద్యమంలో ఒక అధ్యాయం ముగిసిందని పేర్కొన్నారు. ఎపి రాష్ట్ర కమిటీ ఆయనకు నివాళులర్పిస్తూ, ఆయన భార్య, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపింది.

ప్రజాసేవకు అంకితమైన మహామనిషి

- బుద్ధదేవ్ మృతిపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

దశాబ్దాలకుపైగా ప్రజసేవకు అంకితమైన మహామనిషి బుద్ధదేవ్ భట్టాచార్య అని ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. ఈ మేరకు గురువారం 'ఎక్స్‌లో పోస్టు' చేశారు. బెంగాల్ ఆధునిక చరిత్ర రూపొందించడంలో భట్టాచార్య కీలకపాత్ర పోషించారని పేర్కొన్నారు. ఆయన మరణవార్త దిగ్భ్రాంతిని కలిగించిందని, ప్రజాసేవ పట్ల ఆయనకున్న అంకితభావం, సరళతను మెచ్చుకోకుండా ఉండలేమని వివరించారు. బుద్ధదేవ్ కుటుంబానికి, మద్దతుదారులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న అయోధ్యరామ్


స్టీల్‌ప్లాంట్‌కు ముడిసరుకు అందించాలి

- పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు సరిపడా ముడిసరుకు అందించాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కో-కన్వీనర్ జె.అయోధ్యరామ్ డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు గురువారానికి 1274వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో సిఐటియు కార్యకర్తలు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ.. ఇప్పటి వరకూ సుమారు రూ.54 వేల కోట్లను స్టీల్‌ప్లాంట్ కార్మికులు పన్నుల రూపంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెల్లించారని తెలిపారు. రూ.ఐదు వేల కోట్ల పెట్టుబడితో కర్మాగారాన్ని పెట్టగా దాన్ని లక్షల కోట్ల రూపాయలకు విస్తరించారన్నారు. కార్మిక శక్తితో ప్లాంట్‌ను విస్తరించి విశాఖ అభివృద్ధికి దోహదపడ్డారన్నారు. అటువంటి కర్మాగారాన్ని రక్షించుకునేందుకు కార్మికులు పెద్ద ఎత్తున పోరాడుతుంటే కేంద్ర ప్రభుత్వం చలించకపోవడం దుర్మార్గమన్నారు. ఉధృత పోరాటాలతో మోడీ సర్కారు మెడలు వంచుతామని అన్నారు. దీక్షల్లో పోరాట కమిటీ నాయకులు యు.రామస్వామి, పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు.

టిడిపి మాజీ ఎంపి కెంబూరి మృతి



ప్రజాశక్తి-చీపురుపల్లి (విజయనగరం జిల్లా)

విజయనగరం జిల్లా చీపురుపల్లి మాజీ ఎమ్మెల్యే, బొబ్బిలి మాజీ ఎంపి కెంబూరి రామ్మోహనరావు (75) గురువారం ఉదయం కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన విశాఖలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. కెంబూరి అంత్యక్రియలు గురువారం సాయంత్రం ఆయన స్వగ్రామమైన చీపురుపల్లిలో నిర్వహించారు. ఆయనకు భార్య రుషేంద్రమణి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మాజీ మంత్రి కిమిడి మృణాళిని కెంబూరి రామ్మోహనరావుకు సోదరి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కెంబూరి కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించి సంతాపం తెలిపారు. ఓ మంచి నేతను కోల్పోయామని విచారం వ్యక్తం చేశారు. టిడిపి నుంచి 1985లో చీపురుపల్లి ఎమ్మెల్యేగా, 1989లో బొబ్బిలి ఎంపిగా గెలుపొందారు. ఆయన మృతదేహాన్ని రాష్ట్ర ఎంఎస్‌ఎంఇ, సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాలశాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు. కెంబూరి మరణవార్త తెలిసిన వెంటనే చీపురుపల్లి చేరుకొని నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. మంత్రి వెంట టిడిపి జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జున, ఇతర నాయకులు ఉన్నారు. కెంబూరి మృతికి రాష్ట్ర ఎస్‌టి కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకర్రావు సంతాపం తెలిపారు.

28 మంది డిఎస్‌పిల బదిలీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో మరోమారు డిఎస్‌పిల బదిలీలు జరిగాయి. గత వారంలో ఒకేసారి 96 మంది డిఎస్‌పిలను బదిలీ చేసిన ప్రభుత్వం ఇపుడు తాజాగా మరో 28 మందిని బదిలీ చేసింది. ఈ మేరకు డిజిపి ద్వారకా తిరుమలరావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో ఏడుగురిని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో రిపోర్ట్ చేయాలని పేర్కొనగా, మిగిలిన 21 మందికి పోస్టింగులు ఇచ్చారు. అమలాపురం డిఎస్‌పి ఎం మహేశ్వరరావు, పోలవరం ఎన్ సురేష్‌కుమార్‌రెడ్డి, చిత్తూరు ఎం రాజగోపాల్‌రెడ్డి, అనంతపురం రూరల్ బి వెంకట శివారెడ్డి, ఆదోని జె శివనారాయణస్వామి, పత్తికొండ పి శ్రీనివాసరెడ్డి, నెల్లూరు ఆత్మకూరు డిఎస్‌పి ఎన్ కోటారెడ్డిని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో రిపోర్టు చేసుకోవాలని ఉత్తర్వులిచ్చారు. అలాగే కొత్తపేట డిఎస్‌పి కెవి రమణను సిఐడికి, ఇంటెలిజెన్స్ డిఎస్‌పి ఎం వెంకటేశ్వరరావును పోలవరానికి, ప్రకాశం దిశ డిఎస్‌పి సిహెచ్ శ్రీనివాసరావును గన్నవరానికి, గుంటూరు పశ్చిమ డిఎస్‌పి కెవి మహేష్‌ను హిందూపురానికి, వెయిటింగ్‌లో వున్న జి రామాంజనేయులును బాపట్లకు, అక్కడున్న డిఎస్‌పి సిహెచ్ మురళీకృష్ణ సిఐడికి, శ్రీకాకుళం దిశ డిఎస్‌పి రాయపాటి శ్రీనివాస్‌ను ఒంగోలుకు, ఎస్‌టిఎఫ్ డిఎస్‌పి జి చెంచుబాబును నాయుడుపేటకు, వెయిటింగ్‌లో వున్న కె విజయశేఖర్‌ను తిరుమలకు, ఎస్ఐబి డిఎస్‌పి జె వెంకటనారాయణను తిరుపతికి, తిరుపతి ఎస్‌బిలో వున్న ఎం వెంకటాద్రిని రేణిగుంటకు, రేణిగుంట డిఎస్‌పి భవ్య కిశోర్‌ను రాజమండ్రి సౌత్‌జోన్‌కు, ఇంటెలిజెన్స్ డిఎస్‌పి జె రవిబాబును కళ్యాణదుర్గానికి, సిఐడిలో వున్న డి సోమన్నను ఆదోనికి, వెయిటింగ్‌లో వున్న ఎన్ యుగంధర్ బాబును నంద్యాలకు, ఎస్‌టిఎఫ్ డిఎస్‌పి జి రవికుమార్‌ను పుత్తూర్‌కు, అక్కడున్న డిఎస్‌పి వై శ్రీనివాసరావును సిఐడికి, ఇంటెలిజెన్స్‌లో వున్న జి రాజేంద్రప్రసాద్‌ను మైదుకూర్‌కు, వెయిటింగ్‌లో వున్న జి దేవకుమార్‌ను కొవ్వూరుకు, సిఐడిలో వున్న వివి రమణకుమార్‌ను గూడూరుకు, కె వేణుగోపాల్‌ను నెల్లూరు ఆత్మకూరుకు బదిలీ చేశారు.

జిఓ 3పై స్పష్టత ఇవ్వండి

మొదటిపేజీ తరువాయి

రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి ప్రకటనా చేయలేదన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన జనరల్ డిఎస్‌సిలో స్థానిక ఆదివాసీలకు అన్యాయం జరుగుతోందన్నారు. గురుకులం నిబంధనలను తుంగలో తొక్కి జనరల్ రిక్రూట్‌మెంట్ చేయడం వల్ల ఇప్పటికే విధులు నిర్వహిస్తున్న ఆదివాసీ గెస్ట్ టీచర్లు, అధ్యాపకులు గురుకులాల నుంచి నెట్టివేయబడతారన్నారు. రాష్ట్రంలోని 28 ఏకలవ్య పాఠశాలల్లో ఒక్క ఎస్‌టికి కూడా ఉద్యోగం రాలేదని, హిందీ రాష్ట్రాల నుంచి వచ్చి విద్యా బోధన చేయడంతో విద్యార్థుల్లో డ్రాపౌట్స్ సంఖ్య మొదలైందని, ఇది ఇలానే కొనసాగితే ఏకలవ్య మోడల్ పాఠశాలల లక్ష్యం నెరవేరదని అన్నారు. ఆదివాసీ యువతకు న్యాయం చేసేలా గిరిజన ప్రత్యేక డిఎస్‌సిపైనా సిఎం స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆరు శాతమైతే నేటికీ విద్యా, ఉద్యోగ, ఉపాధ్యాయ రంగాలలో 3.5 శాతానికి మించి ఆదివాసీలు పొందలేకపోతున్నారని తెలిపారు. మరోపక్క గిరిజనేతరులను, బోయ/వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేర్చడానికి రాజకీయ ప్రయోజనాల కోసం పాలకులు చేస్తున్న కుట్రను తిప్పికొట్టాలని కోరారు. సదస్సులో సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు పి.అప్పలనర్స, ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోరాబు సత్యనారాయణ, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.ధర్మన్న పడాల్, పి.బాలదేవ్, నాయకులు చిన్నం నాయుడు, బిసిహెచ్.పడాల్, కుమారి పాల్గొన్నారు.

వైసిపి కార్యకర్త కిడ్నాప్, హత్యకు పన్నాగం

- భగ్నం చేసిన పోలీసులు



నాగరాజు, అతని కుటుంబీకులపై దాడి చేస్తున్న నిందితులు

ప్రజాశక్తి - వినుకొండ (పల్నాడు జిల్లా)

పల్నాడు జిల్లాలో టిడిపి, వైసిపి మధ్య రాజకీయ కక్షలు కొనసాగుతున్నాయి. ఆటోలో వెళ్తున్న వైసిపి కార్యకర్తను ప్రత్యర్థులు కారుతో అడ్డగించి దాడి చేసి కిడ్నాప్‌కు యత్నించారు. పోలీసులు కిడ్నాప్‌ను భగ్నం చేశారు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. దుర్గి మండలం జంగమేశ్వరపాడుకు చెందిన వైసిపి కార్యకర్త ఒంటేరు నాగరాజు కుటుంబం.. ఎన్నికల అనంతరం వినుకొండలోని బంధువుల వద్ద ఆశ్రయం పొందుతున్నాడు. హనుమన్‌నగర్‌లో ఉంటూ కూరగాయలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. గురువారం హనుమన్‌నగర్ నుంచి బొల్లాపల్లి మండలం వెల్లటూరు గ్రామంలో కూరగాయాలు విక్రయించేందుకు నాగరాజు తన తల్లి అంకమ్మ, సోదరి, బావతో కలిసి ఆటోలో వెళ్తున్నాడు. మార్గమధ్యలో వెంకుపాలెం వద్దకు చేరుకోగానే ఆయన ప్రత్యర్థులు బొలెరో వాహనంలో వచ్చి ఆటోను అడ్డుకున్నారు. తమ వెంట తెచ్చుకున్న కత్తులతో నాగరాజుపై దాడి చేశారు. అనంతరం నాగరాజును బలవంతంగా కారులో ఎక్కించుకుని తీసుకెళ్లారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని సేకరించి వివరాలు సేకరించారు. బొల్లాపల్లి మండలం మద్రిపాలెం నుండి దుర్గి వైపు కిడ్నాపర్లు వెళ్తుండగా పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు.

నడిరోడ్డుపై హత్యలు, కిడ్నాపులు : అంబటి రాంబాబు

నాగరాజుకు హాని జరిగితే తీవ్ర పరిణామాలు ఉంటాయని మాజీ మంత్రి అంబటి రాంబాబు పేర్కొన్నారు. ఈ కిడ్నాప్ ఘటనకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. నడిరోడ్డు మీద హత్యలు, కిడ్నాప్‌లు జరుగుతున్నాయని తెలిపారు.

రాష్ట్రానికి కుంకీ ఏనుగులు

- ఇచ్చేందుకు కర్ణాటక అంగీకారం
- ఆ రాష్ట్ర మంత్రితో ఉపముఖ్యమంత్రి పవన్ భేటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రానికి కుంకీ ఏనుగులను పంపించేందుకు కర్ణాటక ప్రభుత్వం అంగీకరించింది. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కర్ణాటక పర్యటనలో ఈ మేరకు ఒప్పందం కుదిరింది. కర్ణాటక అటవీశాఖ మంత్రి ఈశ్వర్ బి కండ్రేతో కలిసి ఇరు రాష్ట్రాలకు చెందిన పలు అంశాలపై బెంగళూరు విధాన సభలో ఒప్పందాలు కుదుర్చుకున్నారు. అనంతరం పవన్ కల్యాణ్ మీడియాతో మాట్లాడుతూ.. చిత్తూరు గ్రామాలతో పాటు పార్వతీపురం మన్యం ప్రాంతంలో ఏనుగుల సమస్య తీవ్రంగా ఉందని తెలిపారు. వీటిని దారిమళ్లించేందుకు కుంకీ ఏనుగులు కర్ణాటక అటవీశాఖ వద్ద ఉన్నాయని, రాష్ట్రానికి పంపేందుకు కర్ణాటక ప్రభుత్వం అంగీకరించిందని పేర్కొన్నారు. రాష్ట్రం నుంచి అక్రమంగా రవాణా అవుతున్న ఎర్రచందనంపై కర్ణాటక అధికారులు కూడా దృష్టి సారించాలని కోరామన్నారు. అక్రమంగా రవాణా అవుతున్న రూ.140 కోట్ల ఎర్రచందనాన్ని కర్ణాటక అధికారులు పట్టుకున్నట్లు తెలిపారు. దీనిని రాష్ట్రానికి ఎలా తీసుకురావాలో అనే అంశంపై మరోసారి చర్చించి ముందుకెళ్తామన్నారు. అటవీ ఉత్పత్తులు పక్కదారి పట్టకుండా సాంకేతికతను పూర్తిస్థాయిలో ఉపయోగించుకునేలా కార్యాచరణ సిద్ధం చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఎకోటూరిజం అభివృద్ధికి రెండు రాష్ట్రాల్లో ఉన్న అవకాశాలను చర్చించామన్నారు. సినిమాల్లో అడవులు కొట్టేవారు హీరోగా కనిపిస్తున్నారని వ్యాఖ్యానించారు. అడవుల రక్షణకు సామాజిక చైతన్యం కూడా చాలా అవసరమని చెప్పారు. కర్ణాటక నుంచి శ్రీశైలం, తిరుమలకు వచ్చే యాత్రికుల కోసం సదన్ నిర్మాణం కోసం భూమి కేటాయించాలని కర్ణాటక ప్రభుత్వం కోరిందని తెలిపారు. ముఖ్యమంత్రితోపాటు మంత్రివర్గం దృష్టికి తీసుకెళ్లి స్థలాలు కేటాయించేలా చొరవ తీసుకుంటానని వెల్లడించారు. కర్ణాటక మంత్రి ఈశ్వర్ మాట్లాడుతూ.. ఎపి ప్రభుత్వం కోరిక మేరకు 8 కుంకీ ఏనుగులను ఇచ్చేందుకు అంగీకరించామని చెప్పారు. భవిష్యత్తులో రెండు రాష్ట్రాల మధ్య సహాయక సహకారాలు ఇలానే ఉండాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో కర్ణాటక జలవనరులశాఖ మంత్రి ఎన్ఎస్ బోసురాజు, ఇరు రాష్ట్రాల అటవీశాఖ ఉన్నతాధికారులు బ్రిజేష్ కుమార్ దీక్షిత్, చిరంజీవి చౌదరి, మంజునాథ్ ప్రసాద్, అనంతరాము తదితరులు పాల్గొన్నారు. సమావేశానికి ముందు కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను ఆయన క్యాంపు కార్యాలయంలో పవన్ కల్యాణ్ మర్యాదపూర్వకంగా కలిశారు.

ఉచిత ప్రయాణంతో రవాణా వ్యవస్థ బలోపేతం

- కొత్త బస్సులు కొనుగోలు చేయాలి
- మంత్రికి ఎస్‌డబ్ల్యుఎఫ్ అధ్యయన నివేదిక అందజేత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మహిళలందరికీ ఆర్‌టిసిలో ఉచిత ప్రయాణాన్ని అమలు చేస్తామన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఎపిపిటిడి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ స్వాగతించింది. ఈ మేరకు ఉచిత ప్రయాణంపై ఎస్‌డబ్ల్యుఎఫ్ వివిధ రాష్ట్రాల్లో పర్యటించి అధ్యయనం చేసి రూపొందించిన నివేదికను గురువారం రాష్ట్ర రవాణాశాఖ మంత్రి ఎం రామ్‌ప్రసాద్‌రెడ్డికి అందజేశారు. ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎస్‌కె జిలాని బాషా, రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ సుందరయ్య, ప్రధాన కార్యదర్శి ఎం అయ్యపరెడ్డి, నాయకులు దొర.. రవాణాశాఖ మంత్రిని కలిసి నివేదిక అందజేశారు. మహిళలకు ఉచిత ప్రయాణం వారి ఉపాధి అవకాశాలకు, అభ్యున్నతికి దోహదం చేస్తుందని తెలిపారు. అలాగే ఉచిత ప్రయాణ వసతి మూలంగా రవాణా వ్యవస్థ బలోపేతం అవుతుందని అన్నారు. ప్రస్తుతం దేశంలో ఏడు రాష్ట్రాల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అమలులో వుందని, మరికొన్ని రాష్ట్రాల్లో 50 శాతం రాయితీ ఇస్తున్నారని తెలిపారు. ప్రపంచంలో 48 దేశాల్లోనూ ఉచిత రవాణా సౌకర్యం వుందన్నారు.

ఉచిత ప్రయాణం అమలైతే రద్దీకి తగ్గ సంఖ్యలో ఆర్‌టిసి సొంత బస్సులను సమకూర్చుకోవాలని కోరారు. అలాగే బస్సుల సంఖ్యకు అనుగుణంగా సిబ్బంది నియామకాలను పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆర్‌టిసి ఉద్యోగులు ప్రభుత్వంలో విలీనం తర్వాత సమస్యలు పెరిగిపోయాయని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగులను చిన్నచిన్న కారణాలతో క్రమశిక్షణ చర్యలతో ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాటి నుండి రక్షణ కల్పించాలన్నారు. అలాగే దేశవ్యాప్తంగా రవాణారంగంలోని ఉద్యోగులతో జరిగే క్రీడలను రాష్ట్రంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి నెలలో కనీసం 15 రోజులు క్షేత్రస్థాయిలో డిపోలలో పర్యటించి అన్ని సమస్యలకూ పరిష్కారం చూపుతామని ఈ సందర్భంగా రవాణాశాఖ మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకులకు హామీ ఇచ్చారు.

కుదేలవుతున్న గార్మెంట్ పరిశ్రమ

- రాయదుర్గంలో 300 యూనిట్స్ మూత
- టెక్స్‌టైల్ పార్కులో ఐదు...
- ఉపాధికి దూరమవుతున్న కార్మికులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

జీన్స్ గార్మెంట్స్ పరిశ్రమలకు అనంతపురం జిల్లా రాయదుర్గం ప్రసిద్ధి. ఈ ప్రాంతం నుంచి దక్షిణాది రాష్ట్రాలంతటికీ జీన్స్ ఫ్యాంట్స్ సరఫరా అవుతాయి. ఈ రంగంపై ఆధారపడి సుమారు 50 వేల మంది ఉపాధి పొందుతున్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు, కరోనా చేసిన గాయాల వల్ల ఇప్పుడు ఈ రంగంలోని యూనిట్లు ఒక్కొక్కటిగా మూతపడుతున్నాయి. దీంతో ఈ రంగంలో పనిచేసే కార్మికులు ఉపాధికి దూరమవుతున్నారు.



జీన్స్ ఫ్యాట్లను తయారు చేస్తున్న కార్మికులు

మూత పడిన 300 యూనిట్స్

రాయదుర్గం ప్రాంతంలో పెద్ద యూనిట్స్ సుమారు 200 వరకు ఉన్నాయి. వీటితో పాటు టెక్స్‌టైల్స్ పార్కులో ఎనిమిది యూనిట్స్ ఉన్నాయి. ఇవి కాకుండా గార్మెంట్ దుస్తుల తయారీలో కట్టింగ్, స్టిచ్చింగ్, డైయింగ్, ఐరన్, ప్యాకింగ్ ఇలా వివిధ విభాగాలుంటాయి. ఇవన్నీ కలిపి ఒకేచోట ఉన్న పెద్ద పరిశ్రమలూ, ఏ విభాగానికి ఆ విభాగం విడివిడిగా ఉన్న యూనిట్స్ ఉన్నాయి. ప్రధానంగా స్టిచ్చింగ్‌లో రాయదుర్గం పట్టణంలోనే సుమారు 600 యూనిట్స్ ఉన్నాయి. ఇందులో సుమారు 18 వేల మంది వరకు కార్మికులు పనిచేస్తున్నారు. ఇప్పుడు ఈ సిట్టిచ్చింగ్ యూనిట్స్ వరకు చూస్తే సుమారు 50 శాతం అంటే సుమారు 300లకుపైగా యూనిట్స్ మూతపడ్డాయి. ఉన్న యూనిట్స్‌లోనూ గతంలో మాదిరి అంత పనిలేదని యజమానులు చెబుతున్నారు. మొత్తం ఒకేచోట ఉన్న పెద్ద పరిశ్రమలు టెక్స్‌టైల్ పార్కులో ఎనిమిది ఉండగా అందులో ఐదు మూతపడ్డాయి. కేవలం మూడు మాత్రమే ప్రస్తుతం నడుస్తున్నాయి.

కేంద్రప్రభుత్వ విధానాలు ... డిమాండ్ తగ్గిపోవడం..!

ఇంతలా ఈ పరిశ్రమ దెబ్బతినడానికి కేంద్ర ప్రభుత్వ విధానాలతోపాటు, కోవిడ్ చేసిన గాయం ఇప్పటికీ మానడం లేదు. 2017లో తీసుకొచ్చిన నోట్ల రద్దు... ఆ తరువాత తీసుకొచ్చిన జిఎస్‌టి... గార్మెంట్ పరిశ్రమను దెబ్బతీశాయని యూనిట్ నిర్వాహకులు చెబుతున్నారు. ఈ మూడింటి కారణంగా వ్యాపారాల్లో ఒక్కసారిగా మందగమనం ప్రారంభమైంది. అప్పటి నుంచి ఇప్పటికీ ఈ మందగమనం నుంచి తేరుకుని సాధారణ స్థితికి వ్యాపారం రావడం లేదని రాయదుర్గం గార్మెంట్ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు చెబుతున్నారు.

ఈ రంగం నుంచి తప్పుకున్నా

20 సంవత్సరాలుగా గార్మెంట్‌లో స్టిచ్చింగ్ విభాగంలో పనిచేస్తున్నాను. స్వయంగా నేను కుట్టడమే కాకుండా నాతోపాటు మరో 30 మంది చేత స్టిచ్చింగ్ చేయించేవాడిని.

గడిచిన రెండేళ్లుగా అనుకున్నంతగా ఆర్డర్లు రావడం లేదు. సాధారణంగా వినాయకచవితి సమయంలో వారానికి మూడు వేల వరకు ఫ్యాంట్లు కుట్టడానికి ఆర్డరు వచ్చేవి. ఇప్పుడు కనీసం వెయ్యి కూడా రావడం లేదు. ఇక నేను ఏమి తినాలి. నాతోపాటున్న వారికి ఏమివ్వాలి. అందుకే గిట్టుబాటు కాక స్టిచ్చింగ్ యూనిట్‌ను మూసివేశాను. వేరే పని కోసం వెతుక్కుంటూ ఉన్నాను.

సురేష్, సిట్టిచింగ్ కార్మికుడు.

కోవిడ్ గాయాలు వెంటాడుతున్నాయి



రాయదుర్గంలోని టెక్స్‌లైట్స్ పార్కులోనున్న తన యూనిట్‌లో వంద మందికిపైగా కార్మికులు పనిచేసేవారు. మొదట జిఎస్‌టి వచ్చాక దాన్ని అవగాహన చేసుకోవడానికి ఒకటిన్నర సంవత్సరం సమయం పట్టింది. అది సరిచేసుకునే లోపు కోవిడ్‌తో లాక్‌డౌన్ వచ్చింది. దీంతో ఆ ఏడాది అంతా పనిలేకుండా పోయింది. అయితే పరిశ్రమ ఏర్పాటు కోసం చేసిన బ్యాంకు రుణ భారం తలకు మించిన భారమైంది. ఇంకోవైపు ప్రభుత్వమిస్తామన్న ప్రోత్సహకమూ సకాలంలో ఇవ్వలేదు. ఇక కోవిడ్ కారణంగా మార్కెట్‌లో సరుకుకు అంత డిమాండ్ లేకుండాపోయింది. అప్పటి నుంచి ఈ-కామర్స్ వ్యాపారం పెరిగింది. ఈ-కామర్స్ వ్యాపారం చేయాలంటే ఆ కంపెనీలకు తగ్గట్టు సరుకు పెద్దఎత్తున ఉత్పత్తి చేయాల్సి ఉంటుంది. అది సాధ్యపడని పరిస్థితుల్లో పరిశ్రమలను మూసుకోవాల్సి వచ్చింది.

ఖలీల్ ,
మూతపడ్డ పరిశ్రమ యజమాని.

ఉపాధి ఉసురు తీసేందుకే జాబ్‌కార్డుల తగ్గింపు

- సిపిఎం రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఉపాధి ఉసురు తీసేందుకే జాబ్ కార్డులను తొలగించారని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ద్వారా పనిచేయడానికి పొందిన జాబ్‌కార్డులను ఏకంగా 35 లక్షలు తొలగించినట్లు పార్లమెంటులో కేంద్ర మంత్రి ప్రకటించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనిచేసేవారి సంఖ్య తగ్గిందని చెప్పి బడ్జెట్లో కోత పెట్టడానికి కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని తెలిపారు. గ్రామీణ ప్రాంతంలో పనిచేసే ప్రతి ఒక్కరూ (జమ్మూ అండ్ కాశ్మీర్ మినహా) జాబుకార్డు తీసుకోవచ్చని అన్నారు. తక్షణమే జాబ్‌కార్డు రద్దును ఉపసంహరించుకోవాలని కోరారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం వచ్చినప్పటి నుంచి విభజిత ఆంధ్రప్రదేశ్‌లో 80 లక్షలు జాబుకార్డులు ప్రభుత్వాలు మంజూరు చేశాయని పేర్కొన్నారు. ఇందులో ఏ సంవత్సరమూ 60 నుండి 70 శాతానికి మించి పనులు కల్పించలేదని పేర్కొన్నారు. పనికోసం అర్జీలు పెట్టుకున్నా పనిచూపడం లేదని, పని చూపకపోతే వేతనంలో 50 శాతం నిరుద్యోగ భృతి చెల్లించాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకూ ఒక్కరికీ నిరుద్యోగ భృతి చెల్లించలేదని తెలిపారు. గడిచిన పదేళ్లలో గ్రామీణ పేదల కుటుంబాల్లో పిల్లలు పెద్దవారై పెళ్లి చేసుకుని విడిగా ఉంటున్నా పాత జాబుకార్డుతోనే పనిచేస్తున్నారని తెలిపారు. గతంలో ఒక జాబ్‌కార్డుపై ఇద్దరు పనిచేస్తే ప్రస్తుతం నలుగురు పనిచేయడంతో 100 రోజులు పూర్తవుతున్నాయని, 16 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరికీ జాబ్‌కార్డులు ఇవ్వాలని చట్టంలోనే ఉందని తెలిపారు. ఈ చట్టాన్ని పక్కకు పెట్టి పేదలకిచ్చే నిధులకు కోత పెట్టడానికి కార్డులు తగ్గించారన్నారు. కార్డులను కుదించడాన్ని సిపిఎం రాష్ట్ర కమిటీ తరపున తీవ్రంగా ఖండించారు.

ఎయిమ్స్‌లో ఖాళీలు భర్తీ చేయాలి

మంగళగిరి ఎయిమ్స్‌లో బోధనా సిబ్బంది ఖాళీలు 48 శాతం, బోధనేతర సిబ్బంది ఖాళీలు 32.5 శాతం వెంటనే భర్తీ చేయాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. 38 మంది డాక్టర్లు రాజీనామా చేయడంపై కేంద్ర ప్రభుత్వం తగు చర్యలు చేపట్టాలని కోరారు. రాష్ట్ర విభజన తరువాత అమరావతి రాజధానికి కేంద్ర ప్రభుత్వం ఎయిమ్స్‌ను కేటాయించిందని తెలిపారు. సామాన్య ప్రజలకు ఎయిమ్స్ వైద్యం అందుబాటులోనూ, ఉపయోగకరంగానూ ఉందని తెలిపారు. బోధనా సిబ్బంది, బోధనేతర సిబ్బంది, డాక్టర్లు, ఖాళీలు భర్తీ చేస్తే సామాన్య ప్రజలకు మేలు చేకూరుతుందని పేర్కొన్నారు. వెంటనే ఖాళీలను భర్తీ చేయాలని, దీనికోసం కేంద్రంపై ఒత్తిడి చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేట్‌పరం చేయడం తగదు

మాజీ మంత్రి మేరుగ నాగార్జున

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరం చేసేలా కూటమి ప్రభుత్వం చర్యలుతీసుకుంటోందని, అదే జరిగితే ప్రతిఘటిస్తామని మాజీ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. గురువారం తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ బాబు రాష్ట్రంలో తన హయాంలో ఏనాడు ప్రభుత్వ మెడికల్ కాలేజీని తీసుకురాలేదని అన్నారు. ఇప్పుడు వున్న కాలేజీలను కూడా ప్రైవేట్‌వారి చేతుల్లో పెట్టేలా క్యాబినెట్ నిర్ణయం తీసుకున్నారని విమర్శించారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రికార్డు స్థాయిలో 17 మెడికల్ కాలేజీల నిర్మాణాలను చేపట్టి, ఐదు మెడికల్ కాలేజీలలో అడ్మిషన్‌లు కూడా ప్రారంభించారని అన్నారు. వైద్య విద్యను ఇప్పుడు మొత్తం ప్రైవేటుపరం చేసేందుకు గుజరాత్ మోడల్ అంటున్నారని విమర్శించారు.

నిండుకుండలా ప్రకాశం బ్యారేజీ



ప్రజాశక్తి - యంత్రాంగం

ప్రకాశం బ్యారేజీకి వరద ఉధృతి కొనసాగుతుంది. మొత్తం 70 గేట్లలో పది గేట్లను ఎనిమిది అడుగులు, 60 గేట్లను ఏడు అడుగుల మేర ఎత్తి దిగువకు 2,96,320 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. 13,768 క్యూసెక్కుల నీటిని కాల్వలకు విడుదల చేస్తున్నట్లు బ్యారేజీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కృష్ణారావు తెలిపారు. మొత్తం 3,10,088 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. వరద ఉధృతి పెరిగే అవకాశం ఉందని ఆయన తెలిపారు. వరద నీటితో కళకళలాడుతున్న బ్యారేజీని చూసేందుకు సందర్శకులు భారీ ఎత్తున్న తరలివస్తున్నారు. మరోవైపు నాగార్జున సాగర్ జలాశయం 26 గేట్లు ఎత్తి 2.69 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా ప్రస్తుతం 585.4 అడుగులకు చేరుకుంది. నిల్వ సామర్థ్యం 312 టిఎంసిలుగా కాగా ప్రస్తుత నీటి నిల్వ 298.59 టిఎంసిలుగా నమోదైంది. పులిచింతల గరిష్ట నీటినిల్వ 45.77 టిఎంసిలు కాగా ప్రస్తుతం 35.46 టిఎంసిల నిల్వ ఉంది. ఎగువ నుంచి 2.46 లక్షల క్యూసెక్కులు పులిచింతలకు వస్తుండగా అదే స్థాయిలో దిగువకు విడుదల చేస్తున్నారు.

శ్రీశైలం నుంచి ముచ్చుమర్రికి నీరు విడుదల

శ్రీశైలం బ్యాక్ వాటార్ నుంచి హంద్రీనీవా సుజల స్రవంతికి (ముచ్చుమర్రి) 211 క్యూసెక్కులు, మహాత్మా గాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్‌కు 2,400, పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌కు 25,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గురువారం ఎగువ జూరాల నుంచి 3,13,182 క్యూసెక్కులు, తుంగభద్ర ద్వారా 53,748 క్యూసెక్కుల నీరు వచ్చి శ్రీశైలం జలాశయానికి చేరుతున్నాయి. జలాశయ నీటిమట్టం 882.50 అడుగులుగా, నీటి నిల్వ సామర్థ్యం 202.0439 టిఎంసిలుగా నమోదయింది. శ్రీశైలం జలాశయం పది గేట్లను 12 అడుగుల మేర ఎత్తి దిగవకు 3,08,480 క్యూసెక్కులు, రెండు విద్యుత్తు కేంద్రాల నుండి 65,410 క్యూసెక్కులతో కలిపి దిగువ సాగర్‌కు 3,73,890 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అలాగే కుడి, ఎడమ జల విద్యుత్తు కేంద్రాలలో గడిచిన 24 గంటల్లో 30.731 మిలియన్ యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తి చేశారు.

మల్యాల ఎత్తిపోతల నుంచి నీరు విడుదల

నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలంలోని మల్యాల ఎత్తిపోతల పథకం హంద్రీనీవా సుజల స్రవంతి కాలువకు గురువారం రెండు పంపుల ద్వారా 675 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ఈ నెల ఐదున వెల్దుర్తి మండలం మల్లేపల్లి పంప్‌హౌస్ సమీపంలో హంద్రీనీవా కాలువకు గండిపడడంతో మల్యాల ఎత్తిపోతల నుండి నీటి విడుదలను ఆపేశారు. కాలువ మరమ్మతుల అనంతరం తిరిగి నీటిని విడుదల చేశారు.

టిడిపి కార్యకర్తకలను పిలిపించుకున్న చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



టిడిపి కార్యకర్తలను ఆ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన వద్దకు పిలిపించుకుని మాట్లాడారు. పల్నాడు జిల్లా వినుకొండకు చెందిన శివరాజు యాదవ్, ఏలూరు జిల్లా దెందులూరుకు చెందిన దుర్గాదేవి టిడిపికి వీరాభిమానులుగా ఉన్నారు. చంద్రబాబు ప్రతిపక్షనేతగా ఉన్న సమయంలో రాష్ట్ర పర్యటనకు ఎక్కడికి వెళ్లినా వీరు కూడా అక్కడికి చేరుకునేవారు. చంద్రబాబు జైల్లో ఉన్న సమయంలోనూ ఆ ఇద్దరూ కొన్ని రోజులు రాజమండ్రిలోనే ఉన్నారు. తనపై అంతులేని అభిమానాన్ని కనబరిచిన వీరిని చంద్రబాబు తన వ్యక్తిగత సిబ్బంది ద్వారా ప్రత్యేకంగా గురువారం పిలిపించుకున్నారు. సచివాలయంలోని తన కార్యాలయంలో ఇద్దరినీ ఆప్యాయంగా పలకరించి వారి కుటుంబ నేపథ్యంపై ఆరా తీశారు.

బ్యాంక్‌ల్లో తగ్గుతున్న డిపాజిట్లు



న్యూఢిల్లీ : బ్యాంక్‌ల్లో డిపాజిట్లు తగ్గుతున్నాయని ఆర్‌బిఐ ఆందోళన వ్యక్తం చేసింది. రిటైల్ ఇన్వెస్టర్లకు ప్రత్యామ్నాయ పెట్టుబడి అవకాశాలు పెరుగుతున్న నేపథ్యంలో బ్యాంకుల్లో డిపాజిట్లు తగ్గుతున్నాయి. దీంతో బ్యాంకులు రుణ డిమాండ్‌ను అందుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. కుటుంబాల పొదుపు, డిపాజిట్లను ఆకర్షించడంపై బ్యాంకులు దృష్టి సారించాలి. వ్యక్తిగత రుణాల జారీలో భారీగా పెరుగుదల చోటు చేసుకుంటుంది. దీన్ని జాగ్రత్తగా పర్యవేక్షించాలి. బ్యాంక్‌లు, ఎన్‌బిఎఫ్‌సిలు కొన్నిసార్లు టాపప్ రుణాలు, బంగారంపై అప్పులు ఇవ్వడంలో నిబంధనలను పాటించడం లేదు. దీనిపై విత్త సంస్థలు దృష్టి సారించాలి. యుపిఐ ద్వారా పన్ను చెల్లింపులకు ప్రస్తుతం ఉన్న పరిమితిని రూ.1 లక్ష నుంచి రూ.5 లక్షలకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం చెక్కుల క్లియరెన్సుకు ప్రస్తుతం ఒక్కటి, రెండు రోజులు పడుతోంది. దీన్ని కొన్ని గంటలకు తగ్గించాలనుకుంటున్నట్లు శక్తికాంత దాస్ తెలిపారు. దీనికి సంబంధించి పూర్తి మార్గదర్శకాలను త్వరలో జారీ చేయనున్నట్లు వెల్లడించారు.

ఇతర ప్రధానాంశాలు..

ద్రవ్యోల్బణం పోకడలు, ఆహార ద్రవ్యోల్బణం ఆందోళనలపై చర్చలు జరిగాయి. స్టాండింగ్ డిపాజిట్ ఫెసిలిటీ (ఎస్‌డిఎఫ్) రేటు 6.25 శాతంగా కొనసాగింపు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో వాస్తవ జిడిపి 7.2 శాతం పెరగొచ్చని అంచనా. ద్రవ్యోల్బణం 4.5 శాతం నమోదయ్యే అవకాశాలు న్నాయి. రుతుపవనాలు ఆలస్యంగా ప్రారంభమైనా ఆశించిన వర్షపాతం నమోదవుతుంది. దాంతో ఆహార ద్రవ్యోల్బణం నియంత్రణలో ఉంటుంది. యుపిఐ ద్వారా చేసే పన్ను చెల్లింపుల పరిమితిని రూ.1 లక్ష నుంచి రూ.5 లక్షలకు ఆర్‌బిఐ పెంచింది. ఏప్రిల్ - మేలో స్థిరంగా ఉన్న ద్రవ్యోల్బణం. జూన్‌లో మళ్లీ పెరిగింది. ఆహార పదార్థాల ధరలు పెరగడమే దీనికి కారణమని ఆర్‌బిఐ పేర్కొంది.

ఎల్‌ఐసి ఫలితాలు ఆకర్షణీయం

- క్యూ1లో రూ.10,461 కోట్ల లాభాలు
- మొత్తం ఆదాయం రూ.2.1 లక్షల కోట్లు

ముంబయి : దిగ్గజ బీమా సంస్థ ఎల్‌ఐసి ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో 10 శాతం వృద్ధితో రూ.10,461 కోట్ల నికర లాభాలు సాధించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.9,544 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.1,88,749 కోట్లుగా ఉన్న మొత్తం ఆదాయం.. గడిచిన క్యూ1లో రూ.2,10,910 కోట్లకు చేరిందని గురువారం ఆ సంస్థ రెగ్యూలేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. గడిచిన జూన్ త్రైమాసికంలో ఎల్‌ఐసి తొలి ప్రీమియం వ్యాపారం రూ.7,470 కోట్లకు పెరిగింది. ఇది గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.6,811 కోట్లుగా చోటు చేసుకుంది. ఇదే సమయంలో రూ.53,638 కోట్లుగా ఉన్న రెన్యూవల్ ప్రీమియం.. గడిచిన క్యూ1లో రూ.56,429 కోట్లకు పెరిగింది. పెట్టుబడులపై కంపెనీ నికర ఆదాయం రూ.96,183 కోట్లకు పెరిగింది. 2024 ఇదే జూన్ త్రైమాసికంలో రూ.90,309 కోట్ల ఆదాయం చోటు చేసుకుంది. గురువారం బిఎస్‌ఇలో ఎల్‌ఐసి షేర్ విలువ 0.16 శాతం పెరిగి రూ.1,125.70 వద్ద ముగిసింది.

27 కొత్త బస్సులు ప్రారంభం

- గత ప్రభుత్వంలో ఒక్క బస్సు కొనలేదు: మంత్రి రాముప్రసాద్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్ర వ్యాప్తంగా 1400 బస్సులు కొనుగోలు చేసి ప్రారంభించినట్లు రవాణా శాఖ మంత్రి రామ్‌ప్రసాద్ రెడ్డి తెలిపారు. ఏలూరు బస్‌డిపో గ్యారేజ్ వద్ద 27 కొత్త బస్సులను గురువారం ఆయన ప్రారంభించారు. అందులో స్టార్ లైనర్ స్లీపర్ బస్సులు 12, సూపర్ లగ్జరీ బస్సులు తొమ్మిది, అల్ట్రా డీలక్స్ బస్సులు మూడు, ఎక్స్‌ప్రెస్‌లు మూడు ఉన్నాయి. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఒక్క బస్సైనా కొన్న దాఖలాలు లేవని విమర్శించారు. రాష్ట్రంలో అభివృద్ధి లేక అన్నీ వ్యవస్థలూ కుంటుపడ్డాయని అన్నారు. నిరుద్యోగులకు 16,300 పోస్టులతో నూతన డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదలకు నిర్ణయం తీసుకున్నామని, తమ ప్రభుత్వంలోని క్రైమ్ రేట్ కూడా తగ్గిందని తెలిపారు. సంస్థలు బలోపేతమయితేనే కార్మికులు బాగుంటారని, కార్మికులు బాగుంటేనే వారి కుటుంబాలు బాగుంటాయని అన్నారు. ఆర్‌టిసి అభివృద్ధికి కార్మికులు కష్టపడి పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణ, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.

వైసిపి మునిగిపోయిన నావ

- భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

వైసిపి మునిగిపోయిన నావ అని, ఒకప్పుడు ఆ పార్టీ ఉండేదని భవిష్యత్తులో చరిత్రగా చెప్పుకుంటారని భీమిలి ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు అన్నారు. గురువారం ఉదయం ఎంవిపి.కాలనీలోగల తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జివిఎంసి స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో పది స్థానాలకు పది గెలుచుకుని నూరు శాతం స్ట్రైక్ రేట్ సాధించామన్నారు. తనను కలిసిన 40 మంది జివిఎంసి కార్పొరేటర్లలో కూడా జగన్‌మోహన్ రెడ్డి విశ్వాసం కల్పించలేకపోయారని, 96 ఓట్లకుగాను 66 ఓట్లు కూటమి అభ్యర్థులకు రావడమే అందుకు నిదర్శనమని తెలిపారు. మూడింట రెండు వంతుల సభ్యుల విశ్వాసం కోల్పోయిన తర్వాత మేయర్ స్థానంలో కొనసాగడంపై వైసిపి పునరాలోచన చేసుకోవాలని హితవు పలికారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి విజయం ఖాయమని జోస్యం చెప్పారు. ప్రజా సమస్యలపై శాసన సభలో మాట్లాడకుండా, సిఎంగా ఉన్నప్పుడు రక్షణ కోసం నియమించుకున్న 900 మందిని తిరిగి సెక్యూరిటీగా కావాలని అడుగుతున్న జగన్ మానసిక పరిస్థితిని సమీక్షించాల్సి ఉందన్నారు. కూటమి ప్రభుత్వం గేట్లు తెరిస్తే ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్య నాయకులు సహా ఎవ్వరూ వైసిపిలో మిగలరన్నారు. జగన్ తన సొంత కుటుంబం కోసం రుషికొండ ప్యాలెస్‌ను డిజైన్ చేసుకున్నట్టుగా ఉందని, హోటల్, కన్వెన్షన్ సెంటర్.. ఇలా దేనికీ వినియోగించలేని విధంగా ఆ ప్యాలెస్ నిర్మాణం ఉందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కొయ్య ప్రసాదరెడ్డి, కార్పొరేటర్లు పివి.నరసింహం, పిల్లా మంగమ్మ పాల్గొన్నారు.

21 కిలోల గంజాయి పట్టివేత

- ఏడుగురు నిందితుల అరెస్ట్

ప్రజాశక్తి తెనాలి (గుంటూరు జిల్లా)

గుంటూరు జిల్లా తెనాలిలో పెద్ద మొత్తంలో గంజాయి పట్టుబడింది. గంజాయితోపాటు ఏడుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ వివరాలను ఎస్‌పి ఎస్.సతీష్ కుమార్ గురువారం తెనాలిలోని డిఎస్‌పి కార్యాలయంలో మీడియాకు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సంగం జాగర్లమూడి డంపింగ్ యార్డ్ వద్ద గంజాయి విక్రేతలు ఉన్నట్లు సమాచారం రావడంతో తెనాలి రూరల్ సిఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ కోటేశ్వరరావు దాడి చేసి ఏడుగురు విక్రేతలను అదుపులోకి తీసుకొని, వారి నుంచి 21 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న నిందితుల్లో కొల్లిపరకు చెందిన అమ్మిశెట్టి శివచందు, ఆవులమంద పవన్‌సాయి, ఓలేరుకు చెందిన దాసరి భరత్, చోడవరంకు చెందిన పి సిద్ధార్థ కుమార్, తూర్పుగోదావరి జిల్లా రౌతులపాలెంకు చెందిన గొర్ల రాజు, కందేపల్లి సతీష్, తోలెం రాము ఉన్నారు. ప్రధాన నిందితుడైన శివచందుపై దాదాపు పదికిపైగా కేసులు ఉన్నాయి. శివ చందు గత ఏడాది కాలంగా గొర్ల రాజు, కందేపల్లి సతీష్, తోలెం రాము నుంచి గంజాయి కొనుగోలు చేసి దానిని చిన్నచిన్న ప్యాకెట్లుగా చేసి విద్యార్థులకు, కార్మికులకు, నిరుద్యోగ యువతకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. గురువారం కూడా శివచందు గంజాయి తీసుకుని రావాలని రాజు, సతీష్, రాములను కోరగా వారు 21 కేజీల గంజాయిని తీసుకొని సంగం జాగర్లమూడి డంపింగ్ యార్డ్ వద్దకు వచ్చారు. అందరూ కలిసి అక్కడే గంజాయి సేవిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌పి తెలిపారు.

2028లో రిజర్వేషన్లు రద్దుకు బిజెపి కుట్ర

- కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్

ప్రజాశక్తి - తిరుపతి సిటీ

2028-29లో రిజర్వేషన్లు రద్దవుతాయని, తనకు పక్కా సమాచారం అందిందని, సుప్రీంకోర్టు ద్వారా తీర్పు వస్తుందని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ వ్యాఖ్యానించారు. ఇందుకు బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ కుట్ర పన్నుతున్నాయని విమర్శించారు. దళిత, మైనార్టీలకు బిజెపి వ్యతిరేకమని ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం తిరుపతిలో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. బిజెపి ఒత్తిడితో గతవారం ఎస్‌సి వర్గీకరణకు సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. ఎస్‌సి వర్గీకరణలో క్రిమిలేయర్ గురించి మాట్లాడుతున్న సుప్రీం జడ్జిలు.. ఎప్పుడైనా ఎస్‌సి కాలనీలకు వెళ్లారా? అంటరానితనం అంటే ఏమిటో ఆ జడ్జిలకు తెలుసా? అని ప్రశ్నించారు. బంగ్లాదేశ్ పరిస్థితులు భారత్‌లో రాకుండా చూసుకోవాలని మోడీ, అమిత్‌షాలను హెచ్చరించారు. పోలవరానికి ఏ ముఖ్యమంత్రి ఎంత ఖర్చు పెట్టారో ఆగస్టు 15న తన ప్రసంగంలో చంద్రబాబు వెల్లడించాలని కోరారు.

మార్కెట్లకు 'ఆర్‌బిఐ' నష్టాలు

ముంబయి : ఆర్‌బిఐ ద్రవ్య పరపతి విధాన సమీక్షాలో కీలక వడ్డీ రేట్లను యథాతథంగా ప్రకటించడం మార్కెట్లను నిరాశకు గురి చేసింది. దీంతో గురువారం సెషన్‌లో అమ్మకాలు చోటు చేసుకున్నాయి. బిఎస్‌ఇ సెన్సెక్స్ చివరకు 582 పాయింట్ల నష్టంతో 78,886కు తగ్గింది. ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ 180.50 పాయింట్లు కోల్పోయి 24,117 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో దాదాపు 1,702 షేర్లు పెరగ్గా.. మరో 1679 షేర్లు పతనమయ్యాయి. బిఎస్‌ఇ మిడ్‌క్యాప్ సూచీ 0.4 శాతం విలువ కోల్పోగా.. స్మాల్ క్యాప్ యథాతథంగా ముగిసింది.

తెలుగు రాష్ట్రాల్లో 100 శాఖలకు విస్తరిస్తాం

- ఫెడరల్ బ్యాంక్ సిఇఒ వెల్లడి

హైదరాబాద్ : వచ్చే ఏడాదిన్నరలో తెలుగు రాష్ట్రాల్లో తమ శాఖలను 100కు విస్తరించాలని నిర్దేశించుకున్నామని ఫెడరల్ బ్యాంక్ ఎండి, సిఇఒ శ్యామ్ శ్రీనివాసన్ తెలిపారు. ఫెడరల్ బ్యాంక్ హైదరాబాద్‌లో 50 ఏళ్లు పూర్తి చేసుకున్నందున గురువారం ఆ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఇక్బాల్ మనోజ్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ దిలీప్ బితో కలిసి శ్రీనివాసన్ మీడియాతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో ప్రస్తుతం తమకు 78 శాఖలున్నాయని తెలిపారు. దేశంలో మొత్తంగా 1600పైగా శాఖలను కలిగి ఉన్నామన్నారు. గడిచిన ఐదేళ్లలో తమ వ్యాపారం రెట్టింపు అయ్యిందన్నారు. బ్యాంకింగ్, వ్యాపార విస్తరణకు తమకు విస్తృతావకాశాలు ఉన్నాయని తెలిపారు. వైజాగ్‌లోని తమ కార్యాలయాన్ని మరింత విస్తరించనున్నట్లు తెలిపారు. ఇక్కడ తమ ఉద్యోగులకు 1000 మందికి చేర్చనున్నామన్నారు. హైదరాబాద్‌లోనే 28 శాఖలున్నాయని.. మరో 10-12 కొత్త శాఖలను ఏర్పాటు చేయనున్నామన్నారు.

సంపాదకీయం


భారత హృదయ విజేత

పారిస్ ఒలింపిక్స్ నుంచి పసిడి పతకం పట్టుకువస్తుందని దేశమంతా ప్రేమతో ఎదురు చూస్తున్న తరుణంలో– వినేశ్ ఫొగాట్‌పై అనర్హత వేటు పడడం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. మంగళవారం నాటి కుస్తీ బరిలో వరుసగా ముగ్గురిని ఓడించి, ఫైనల్‌కి చేరిన వినేశ్ కచ్చితంగా గరిష్ట విజయాన్ని సాధించగలదని దేశానికి గట్టి ఆశ కల్పించింది. తుది పోటీని చూడ్డానికి ఎప్పుడు తెల్లారుతుందా? అని క్రీడాభిమానులు ఉత్సుకతతో ఎదురుచూశారు. ఆ ఉత్సాహం వెల్లివిరిసే సమయానికి ... నిర్ణీత బరువు కన్నా వంద గ్రాములు అదనంగా ఉందన్న కారణంతో వినేశ్‌పై అనర్హత వేటు పడడం పిడుగుపాటే అయింది! ఈ వార్త తెలిసి, కోట్లాది మంది భారత క్రీడాభిమానుల హృదయాలు ఆవేదనతో బరువెక్కాయి. మంగళవారం నాడు బరిలో దిగటానికి ముందు తూకంలో 49.9 కేజీల బరువున్న ఈ క్రీడాకారిణి – దిగ్గజ క్రీడాకారులను ఓడించి, ఫైనల్‌లోకి దూసుకుపోయింది. ఆట ముగిశాక నీళ్లూ, కొద్ది ఆహారం తీసుకొంది. ఆ తరువాత బరువు చూస్తే 52.8 కేజీలు ఉందని, అదనపు బరువును తగ్గించటానికి రాత్రంతా అన్ని విధాలా ప్రయత్నించామని భారత జట్టు వైద్యులు చెబుతున్నారు. కొద్ది గంటల వ్యవధిలోనే రెండున్నర కేజీలకు పైగా బరువు ఎలా పెరిగిందన్నది ప్రశ్న. కోచ్‌లు, ఆహార నిపుణులు, వైద్యుల పర్యవేక్షణలో ఉండగా ... ఇలా జరగటంపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇదంతా సాంకేతికపరమైన అంశమే తప్ప ఎలాంటి అనుమానాలకూ తావు లేదని భారత జట్టు నాయకత్వం చెబుతోంది.

పతకానికి ఒక పంచ్ దూరంలో ఉండగా, అనర్హత వేటు పడడంతో వినేశ్ ఫొగాట్ తీవ్ర నిరాశ చెంది, అస్వస్థతకు గురైంది. కోలుకున్న తరువాత తాను కుస్తీకి శాశ్వతంగా సెలవు చెబుతున్నట్టు ప్రకటించింది. ఈ వరుస పరిణామాలు క్రీడాభిమానులను నిరుత్సాహానికి గురి చేసినప్పటికీ– వినేశ్‌కు కొండంత అండగా నిలబడ్డారు. "బుధవారం నాటి బరిలోకి నువ్వు వెళ్లి ఉంటే– స్వర్ణమో, రజతమో గెలిచివుండేదానివి. అంతకన్నా ముందే నువ్వు నీ పోరాటస్ఫూర్తితో మా హృదయాలను గెలుచుకున్నావు. నువ్వు మా నిజమైన విజేతవు. నిలువెత్తు బంగారానివి." అంటూ సోషల్ మీడియాలో అనేకమంది అభిమానం కురిపించారు. సంఘీభావం ప్రకటించారు. పార్లమెంటు ఉభయ సభల్లోనూ వినేశ్‌కి మద్దతుగా విపక్షాలు గళమెత్తాయి. అనర్హత వేటు వెనుక కుట్రకోణం ఉందేమోనన్న అనుమానం వ్యక్తం చేసి, దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని పట్టుబట్టాయి. లైంగిక వేధింపులపై వినేశ్ ఫొగాట్ తదితర రెజ్లర్లు నెలల తరబడి, రోడ్లపై ఆందోళన చేపట్టినా స్పందించని ప్రధాని మోడీ కూడా ఎక్స్ వేదికపై గొంతు విప్పారు. "నువ్వు చాంపియన్ల చాంపియన్‌వి. విజేతవు." అంటూ వినేశ్‌కి ధైర్యం చెప్పారు.

ఒక క్రీడాకారిణి పట్ల ఇంత జన స్పందన, మద్దతూ, అభిమానమూ ఎందుకు వెల్లువెత్తుతోంది? ఎందుకంటే– కేంద్ర ప్రభుత్వం అండదండలు పుష్కలంగా ఉన్న భారత రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్‌కి వ్యతిరేకంగా ఆమె పోరాడింది. అతడి లైంగిక వేధింపులను నిరసిస్తూ తోటి రెజ్లర్లకు అండగా నిలబడింది. ఆ సందర్భంగా ఢిల్లీ వీధుల్లో నెలల తరబడి నిరసన శిబిరం నిర్వహించిన మహిళా కుస్తీ యోధుల పట్ల మోడీ ప్రభుత్వం అత్యంత పాశవికంగా, కక్షపూరితంగా వ్యవహరించింది. రోడ్లపై ఈడ్చి, లాఠీలు ఝుళిపించి, అరెస్టులు చేయించింది. బిజెపి అనుకూల అల్లరిమూకలు మహిళా రెజ్లర్ల మీద తీవ్రస్థాయిలో అనుచిత ప్రచారం చేశాయి. మోడీ ప్రభుత్వం ఆఖరి క్షణం వరకూ బ్రిజ్ భూషణ్‌ను వెనకేసుకొచ్చింది. అలాంటి ప్రతికూలత, నిరుత్సాహ వాతావరణం ఉన్నప్పటికీ– పారిస్ ఒలింపిక్స్‌కి వినేశ్ ఫొగాట్ సన్నద్ధం కావడం గొప్ప స్ఫూర్తిదాయకం. పాలకపక్షం పగబట్టినట్టు వ్యవహరించినా నిలబడి, విశ్వవేదికపై తలపడిన పట్టుదల, కఠోర సాధన కోట్లాది క్రీడాభిమానుల అభిమానాన్ని పొందింది. మానసిక, శారీరక గాయాలను తట్టుకొని విశ్వవేదిక సాక్షిగా కోట్లాది భారతీయ హృదయాలనూ గెలుచుకొంది. తాను బంగారు పతకాన్ని గెలవకపోయినా, తననే బంగారం అనుకునేంతగా దేశం ప్రేమను పొందగలిగింది. వినేశ్ ఫొగాట్ పోరాట స్ఫూర్తికి జేజేలు!

మహనీయుని మాట



ఆలోచనల యుద్ధంలో
పుస్తకాలే
అసలైన అస్త్రాలు

-జార్జి బెర్నార్డ్ షా

కార్పొరేట్లను బహిష్కరిస్తేనే వ్యవసాయ పరిరక్షణ

నేడు ఎస్‌కెఎం ఆధ్వర్యంలో దేశవ్యాప్త నిరసన

కొన్ని వేల సంవత్సరాల చరిత్ర ఉన్న భారత వ్యవసాయం ప్రపంచంలో ఒక ప్రత్యేకతను సంతరించుకుంది .ఆసియా వరకు స్వయం పోషక గ్రామీణ వ్యవస్థగా రూపుదిద్దుకుంది. ఈస్ట్ ఇండియా కంపెనీ రాకతో బ్రిటిష్ వాళ్లకు అవసరమైన పంటలు పండించే దారిలోకి దేశం వెళ్లిపోయింది. మన పంటల ప్రత్యేకతలను, మిగులును కోల్పోయింది. స్వాతంత్ర్యం వచ్చిన మొదటి 40 సంవత్సరాల్లో కరువు కాటకాల నుంచి, ధాన్యం విదేశీ దిగుమతుల నుంచి బయటపడి స్వయంపోషకంగా అభివద్ధి చేసుకున్నాం. 1990 నుంచి ప్రపంచీకరణ ఛాయలు భారత వ్యవసాయ రంగంపై పడ్డాయి.

ప్రపంచం మొత్తం భూమిలో భారతదేశ విస్తీర్ణం 2.3% మాత్రమే. ప్రస్తుత ప్రపంచ పంట విస్తీర్ణంలో 11 శాతం భూమి భారతదేశంలో పంటభూమిగా ఉంది. పశువుల పెంపకంలో భారతదేశం ప్రపంచంలో అతిపెద్దదిగా 30% పైగా వాటా కలిగి ఉంది.అభివద్ధి చెందిన దేశాలు వస్తు ఉత్పత్తిలో అదనపు విలువను తోడు చేయడంలో కూడా 65% వాటా ఉన్నా, వ్యవసాయంలో 35 శాతం అదనపు విలువను మాత్రమే తోడు చేయగలుగుతున్నాయి. 1992లో భారతదేశ వ్యవసాయ సంబంధ రంగాల్లో తోడు చేసిన అదనపు విలువ 7.4% ఉండగా 2018 – 20 నాటికి 12.8% కి పెరగడం జరిగింది. అదే కాలంలో అభివద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాల వాటా 36.4% నుంచి 14.3%కి తగ్గింది. వీటన్నిటికీ భిన్నంగా చైనా వ్యవసాయంలో అదనపు విలువను తోడు చేయడంలో 9.4% నుండి 30.7% కి చేరి మొదటి స్థానాన్ని సాధించింది. ఈ కాలంలో భారతదేశ ఎగుమతులు, దిగుమతుల్లో పెద్దగా పెరుగుదల లేదు. కాఫీ, టీ, సుగంధ ద్రవ్యాలు, చిరుధాన్యాలు లాంటి ఎగుమతి జరుగుతున్నా పప్పు ధాన్యాలు, నూనెల దిగుమతి తగ్గలేదు. ప్రపంచీకరణ క్రమంలో దేశ వ్యవసాయం నూతన వరవడితో అభివద్ధి కాలేదని తెలుస్తున్నది.

వి. కృష్ణయ్య

భారత వ్యవసాయంలో కార్పొరేట్ల చొరబాటు

ప్రపంచీకరణకు ముందు భారత వ్యవసాయంలో కుటుంబ వ్యవసాయంగా ఉండేది. అందులో ప్రైవేటు పాత్రతో పాటు కొంతలో కొంత ప్రభుత్వ పెట్టుబడి ఉండేది. ప్రపంచీకరణ బాగా ముందుకు వచ్చిన తర్వాత అంటే 2011–12ని బేస్ ఇయర్ గా చేసుకొని చూస్తే భారత ఆర్థిక వ్యవస్థలో కార్పొరేట్ రంగం పాత్ర విశేషంగా పెరిగింది. దరిదాపుగా 50% మించింది. కానీ వ్యవసాయ రంగంలో నేరుగా వీరి పాత్ర ఇప్పటిదాకా చాలా పరిమితంగా ఉంది. కార్పోరేట్లకు ఈ రంగంలో వస్తురంగంతో పోల్చితే బహు ముఖ్యమైన అవకాశాలున్నాయి. భారత వ్యవసాయ రంగానికి అభివద్ధి చెందిన దేశాల వ్యవసాయ రంగాల కన్నా ప్రాధాన్యత బాగా ఉంది. వ్యవసాయరంగానికి ఆర్థిక రంగంలో అన్ని విభాగాలతో సంబంధ బాంధవ్యాలు ఎక్కువ ఉంటాయని మనకు తెలుసు. అంటే కార్పొరేట్ శక్తులు చొరబడడానికి ఎక్కువ అవకాశాలున్నాయన్నమాట. వ్యవసాయ దిగుబడులు అనేక ఆర్థిక సంస్థల చేతిలోకి వెళ్లి అక్కడ నుండి జాతీయ, అంతర్జాతీయ, పెట్టుబడి నెట్వర్క్ లోకి వెళుతుంది. పంటలను పండించిన రైతులు దూరపువారు గాను, మాల్స్‌ను, మార్కెట్లను నడిపే కార్పొరేట్ కంపెనీలు అసలైన యజమానులు గాను పరిస్థితి మారింది. వ్యవసాయానికి సంబంధిత సాంకేతిక పరిజ్ఞానం, ఎరువులు, పురుగుమందులు, పంటల ధరలను కార్పొరేట్ కంపెనీలు నిర్ణయిస్తున్నాయి. వ్యవసాయానికి అవసరమైన వాటి అమ్మకాల్లోనూ, పంటలను తక్కువకు కొనడం ద్వారానూ రెండు వైపులా కార్పొరేట్లు అధికంగా అర్జిస్తున్నారు. పంటల రవాణా, నిల్వ తదితర ద్వారా 20% కంపెనీలు అదనంగా లాభాలు పొందుతున్నాయి. వ్యవసాయానికి అవసరమైన యంత్ర పరికరాలు, స్పేర్ పార్ట్స్ విదేశాల నుంచి వ్యవసాయేతర ఏజెన్సీల ద్వారా దిగుమతి జరుగుతున్నది. కార్పొరేట్లకు ఇది లాభదాయకమైన వ్యాపారమైంది.

> ఈ 30 ఏళ్ల సరళీకరణ కాలంలో ప్రధానంగా గత దశాబ్దన్నర కాలంలో వ్యవసాయ రంగంలో వివిధ కార్పొరేట్ కంపెనీలు పాలక పార్టీల ద్వారా అధివత్యానికి ఎలా ప్రయత్నిస్తున్నాయో చూస్తున్నాము. భూ సమగ్ర సర్వే చట్టం, యాజమాన్య హక్కు చట్టం లాంటి చట్టాల ద్వారా కార్పొరేట్లు లక్షలాది ఎకరాల భూమిని స్వాధీనానికి ప్రయత్నం చేస్తున్నారు. వంటల బీమాలోనూ జొరబడి వేలాది కోట్ల రూపాయలు ఎలా దోచుకుంటున్నారో చూస్తున్నాం. బ్యాంకుల్లో పేద రైతులకు పంట రుణాలపై జీరో, పావలా వడ్డీలను పక్కనపెట్టి లక్షల కోట్ల రూపాయలు తీసుకున్న కార్పొరేట్లకు పాలకులు వడ్డీ రాయితీ లోన్లు, టాక్సు తగ్గింపులు ఎలా చేస్తున్నారో చూస్తున్నాం. సంవత్సరానికి 15 లక్షల కోట్ల రూపాయల పైనున్న భారత పాల మార్కెట్లో స్వదేశీ, విదేశీ కార్పొరేట్ కంపెనీలు జొరబడుతున్నాయి.



2019–21 కాలంలో పరిశీలిస్తే దేశానికి అవసరమైన ఎరువులను దేశంలో ప్రభుత్వ లేదా ప్రైవేటు కంపెనీల ఉత్పత్తి పెరగలేదు. అందువల్ల విదేశాల నుంచి దిగుమతి పెరిగింది. గత 20 ఏళ్లలో వ్యవసాయ అవసరాలు పెరిగినా, యూరియా 43.7%, డిఏపి 54.4%, కాంప్లెక్స్ 57.9% మాత్రమే మన దగ్గర తయారు అవుతోంది. మిగిలినది విదేశాల నుంచి కార్పొరేట్ కంపెనీలు దిగుమతి చేసుకుంటున్నాయి. యంత్ర పరికరాల్లో ట్రాక్టర్లు ప్రధానమైనవి, ప్రపంచంలో ట్రాక్టర్ ఉత్పత్తి కార్పొరేట్ కంపెనీల్లో నాలుగు ఇండియావి. అందులో ఉత్పత్తి చేస్తున్నవి మహీంద్రా మొదటి స్థానంలో ఉన్నది. హాలాండ్ లాంటి విదేశీ కంపెనీలు కూడా కీలకమైన పాత్రనే పోషిస్తున్నాయి. ప్రపంచ విత్తన మార్కెట్లో 2012లో ఇండియా వాటా 4శాతం కాగా 2019 నాటికి 6%గా పెరిగింది. మనదేశంలో నూతన వంగడాల అభివద్ధికి మంచి వాతావరణం ఉండడం, ఈ వంగడాలు వాడడానికి మంచి డిమాండ్ ఉండడం గుర్తించిన ప్రైవేట్ కార్పొరేట్ కంపెనీలు బాగా పెట్టుబడులు పెడుతున్నాయి. 1988లో ప్రభుత్వం తీసుకువచ్చిన విత్తన విధానం కూడా వీరికి అనుకూలంగా ఉంది. భారత దేశ, విదేశీ కార్పొరేట్ కంపెనీలు భారత రైతులకు అవసరమైన విత్తనాలు 67% వీరే తీరుస్తున్నారు. ముఖ్యమైన కార్పొరేట్ ఆగ్రో కెమికల్స్ స్వదేశీ విదేశీ కంపెనీలు రైతుల అవసరాలలో 86% తీరుస్తున్నాయి. ఈ పురుగుమందుల ప్రాముఖ్యతపై పెద్ద ఎత్తున ఈ కంపెనీలు ప్రచారం చేస్తూ అత్యధిక లాభాలు గడిస్తూ రైతులను మరీ ముఖ్యంగా వాణిజ్య పంటలు పండిస్తున్న రైతులు మూలుగులు పీల్చుతున్నారు.

వ్యవసాయ ఉత్పత్తులను వ్యవసాయేతర కార్పొరేట్ కంపెనీలు 19వ శతాబ్దం మధ్యనుంచే ప్రాసెసింగ్, ఉత్పత్తి, మార్కెటింగ్ చేస్తున్నాయి. టీ, కాఫీ, పప్పు దినుసులు, ఆహార పదార్థాలు, చేపలు, మాంసం, అటవీ ఉత్పత్తులను బహుళ జాతి కంపెనీలైన టాటా, బజాజ్, గోద్రెజ్, హిందుస్థాన్, నెస్లే, లాంటివి నిర్వహిస్తున్నాయి. ప్రపంచ ఫైనాన్స్ పెట్టుబడి సహకారంతో ప్రభుత్వ మద్దతుతో డిజిటల్ టెక్నాలజీతో వ్యవసాయ రంగంలో 1000 అగ్రిటెక్స్ స్టార్ట్ అప్ ఇండియాలో ప్రారంభానికి సిద్ధమవుతున్నాయి. ఇప్పటికే 100 అలాంటివి 1.33 బిలియన్ డాలర్ల పెట్టుబడులతో నడుస్తున్నాయని ప్రభుత్వం ప్రకటించింది.

ఈ 30 ఏళ్ల సరళీకరణ కాలంలో ప్రధానంగా గత దశాబ్దన్నర కాలంలో వ్యవసాయ రంగంలో వివిధ కార్పొరేట్ కంపెనీలు పాలక పార్టీల ద్వారా అధివత్యానికి ఎలా ప్రయత్నిస్తున్నాయో చూస్తున్నాము. భూ సమగ్ర సర్వే చట్టం, యాజమాన్య హక్కు చట్టం లాంటి చట్టాల ద్వారా కార్పొరేట్లు లక్షలాది ఎకరాల భూమిని స్వాధీనానికి ప్రయత్నం చేస్తున్నారు. వంటల బీమాలోనూ జొరబడి వేలాది కోట్ల రూపాయలు ఎలా దోచుకుంటున్నారో చూస్తున్నాం. బ్యాంకుల్లో పేద రైతులకు పంట రుణాలపై జీరో, పావలా వడ్డీలను పక్కనపెట్టి లక్షల కోట్ల రూపాయలు తీసుకున్న కార్పొరేట్లకు పాలకులు వడ్డీ రాయితీ లోన్లు, టాక్సు తగ్గింపులు ఎలా చేస్తున్నారో చూస్తున్నాం. సంవత్సరానికి 15 లక్షల కోట్ల రూపాయల పైనున్న భారత పాల మార్కెట్లో స్వదేశీ, విదేశీ కార్పొరేట్ కంపెనీలు జొరబడుతున్నాయి.

రైతు రక్షణ వేదిక ప్రకటించినట్లుగా పెప్సీ కంపెనీ ఇండియాలో సంవత్సరానికి చేస్తున్న వ్యాపారం రూ. 4.5 లక్షల కోట్లు దాటింది. ఇండియాలో 3 తినుబండారాల తయారీ ఫ్యాక్టరీలు, 38 కూల్ డ్రింక్స్ తయారు చేసే ఫ్యాక్టరీలున్నాయి. ఇక ఐ టి సి కంపెనీ సామ్రాజ్యం గురించి చెప్పనవసరం లేదు. ఐదు లక్షల గ్రామాల్లో నెట్వర్క్ ఉందని గర్వంగా ప్రకటించింది.

వివిధ రంగాల కార్పొరేట్ కంపెనీలు రైతుల పంటలకు తాము ఇచ్చిందే భిక్షలా ఉంది. దేశం మొత్తంగా దానివల్ల రైతు కనీసంగా రెండున్నర లక్షల కోట్ల రూపాయలు సంవత్సరానికి నష్టపోతున్నారని వివిధ అధ్యయన సంస్థల అంచనా. పంటలు గిట్టుబాటు కాక రైతులు ఆత్మహత్యల పాలవుతున్నది దీని వల్లే... కానీ పాలక పార్టీలు కార్పొరేట్ కంపెనీలతో వ్యవసాయంతో పాటు అన్ని రంగాలు ముందుకు పోతున్నాయనే భ్రమను ప్రజలకు కల్పిస్తున్నారు. ఆఖరికి పార్టీల ఎన్నికల నిర్వహణకు కూడా ఈ కార్పొరేట్లపై ఆధారపడిన విషయం ఎలక్టోరల్ బాండ్స్ రూపంలో బయటికి వచ్చిన నిజాలు చూస్తున్నాం. 2019లో బిజెపి ఎన్నికల మానిఫెస్టో భారత వ్యవసాయంలోకి కార్పొరేట్లు 25 లక్షల కోట్ల రూపాయల మేర పెట్టుబడులు తెస్తారనిబహిరంగంగా ప్రకటించింది. మూడు వ్యవసాయ చట్టాలు తెగించి తెచ్చారు. రైతులు తమ త్యాగాలతో వాటిని ఎలా వెనక్కి కొట్టారో చూశాం. బిజెపి విధానాలతో వ్యవసాయం ద్వారా రైతులకు రెట్టింపు ఆదాయం రాలేదని ప్రజలకు అర్థమైంది. పాలేకర్ వ్యవసాయం ఫలప్రదం కాలేదు. 108 వ్యవసాయ విశ్వవిద్యాలయాల్లో లక్షమంది పైగా శాస్త్రవేత్తలను దేశభక్తితో ఉత్తేజబరచి నూతన వంగడాలను, కొత్త విధానాలను, ఉత్పత్తిని రెట్టింపు చేయలేకపోయారు.

బిజెపి.... రైతు అనుకూల విధానాలతో కాకుండా కార్పొరేట్ అనుకూల విధానాలతో వ్యవసాయాన్ని నడిపిద్దామని కృత నిశ్చయంతో ఉందని మోడీ వ్యవసాయ విధానాల ద్వారా అర్థమవుతున్నది. కార్పొరేట్ అనుకూల విధానాలతో వ్యవసాయం అంతా శ్రీలంక లాగా నాశనమైపోయేదాకా ఆగకుండా ఆ కార్పొరేట్ కంపెనీలను, వాటికి మద్దతు ఇచ్చిన వారిని ముందు బయటకు సాగనంపడం రైతులకు దేశానికి శ్రేయస్కరమని రైతు సంఘాల సమన్వయ కమిటీ (ఎస్‌కెఎం) నిర్ణయించింది. దానికి ఆగస్టు 9న కార్పొరేట్ ఆఫీసుల ముందు, ప్రభుత్వ ఆఫీసుల ముందు దేశవ్యాప్త నిరసన ఉద్యమాన్ని జయప్రదం చేయాలని కోరుతున్నాం.

(- వ్యాస రచయిత రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు)


విశ్లేషణ

- పొగడ దొరువు

అణ్వాయుధ రహిత దారిలో...

ప్రపంచాన్ని వణికించిన అణుబాంబుదాడి జరిగి 79 సంవత్సరాలు గడిచాయి. 1945 ఆగస్టు ఆరున హిరోషిమా, తొమ్మిదిన నాగసాకిలలో చోటుచేసుకున్న అణువిస్ఫోటన ప్రభావం మానవాళిని ఇంకా వెంటాడుతూనే ఉంది. పోయిన ప్రాణాలకు, తెగిపడిన శరీర అవయవాలకు లెక్కేలేదు. ప్రాణాలతో బయటపడిన వారిని అణుధార్మిక శక్తి జీవచ్ఛవాలుగా మార్చివేసింది. ఇప్పుడు పుడుతున్న చిన్నారులనుసైతం ఆ రక్కసి వెంటాడుతోంది. ఇదంతా ఒక ఎత్తైతే, ఈ బాంబు దాడితో ప్రపంచాన్ని అణుప్రమాదం ముప్పు ముందుకు సామ్రాజ్యవాద అమెరికా తోసింది. అప్పుడు ప్రారంభమైన అణ్వాయుధ పోటీ ఇప్పటికీ కొనసాగుతోంది. అణుబాంబు సృష్టించే వినాశనం తెలిసినిప్పటికీ ఆత్మరక్షణ కోసం ఆ బాటనే నడవక తప్పని స్థితి అనేక దేశాలదీ! కొన్నిదేశాలు చెప్పి అణు ప్రయోగాలు చేస్తున్నాయి. మరికొన్ని చెప్పకుండా ఆ పనికానిస్తున్నాయి. అధికారికంగా అణ్వాయుధ దేశాలుగా కొన్ని గుర్తింపు పొందితే, ఆ గుర్తింపు కోసం తహతహలాడుతున్న దేశాలు మరికొన్ని! గుర్తింపు ఉన్నా, లేకపోయినా అ ఆయుధం తమ చెంత ఉంటే చాలనుకునే దేశాలు ఇంకొన్ని..! తన స్వార్థం కోసం, ప్రపంచ ఆధిపత్యంకోసం మొత్తం భూగోళాన్ని అశాంతిలోకి... ఉద్రిక్తతల్లోకి తోసివేసిన అమెరికా వైఖరిలో ఇప్పటికీ మార్పు లేకపోవడమే ఆందోళనకరం! ఇప్పటికీ అణుకుంపటిని రగిలిస్తూ, యుద్ధాలు రెచ్చగొడుతూ, దేశాల మధ్య కుట్రలు చేస్తూ ఆయుధ వ్యాపారాన్ని విచ్చల విడిగా ఆ దేశం చేస్తూనే ఉంది. కళ్లముందు కనపడుతున్న ఇజ్రాయిల్ అమానుష దాడితో పాటు, ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో రగిలిస్తున్న ఉద్రిక్తతలే దీనికి నిదర్శనం. ఈ పరిస్థితుల్లో అణ్వాయుధ రహిత ప్రపంచ లక్ష్య సాధన సాధ్యమవుతుంది... ఆ దారిలో ఉన్న ఆటంకాలేవి? 2013వ సంవత్సరం నుండి ప్రతి సంవత్సరం హిరోషిమాలో 'హిరోషిమా రౌండ్ టేబుల్ సమావేశం' నిర్వహిస్తున్నారు. ఈ సమావేశానికి పరిమితసంఖ్యలో అయినప్పటికీ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అణు శాస్త్రవేత్తలు, అణు వ్యూహ నిపుణులు హాజరవుతారు. అణుఆయుధాలను నిర్మూలించడం ద్వారా హిరోషిమా ప్రపంచ శాంతి ప్రణాళికకు మద్దతు ఇవ్వడం ఈ రౌండ్‌టేబుల్ సమావేశ ముఖ్య ఉద్దేశ్యం. దీనిలో భాగంగా 'హిరోషిమా వాచ్ –2024' పేరిట ఒక నివేదికను విడుదల చేసింది. ఈ నివేదికలో ప్రస్తుత ప్రపంచంలో చోటుచేసుకుంటున్న అణ్వాయుధ పోటీ గురించి, వివిధ దేశాల వైఖరి గురించి అనేక అంశాలను వివరించింది.

2024 జనవరి నాటికి వివిధ దేశాలలో ఉన్న అణ్వాయుధాల సంఖ్య



చైనా మార్గం..!

ఎటువంటి పరిస్థితుల్లోనూ అణు ఆయుధాలను మొదటగా తాము ప్రయోగించేది లేదని చైనా ప్రకటించింది. తమ దేశ సార్వభౌమత్వానికి ముప్పు ఎదురైన పరిస్థితుల్లోనూ సాంప్రదాయ ఆయుధాల మీదనే ఆధారపడతామని, తమంతట తాముగా మొట్ట మొదట అణు ఆయుధాలను ప్రయోగించమని (నో ఫస్ట్ యూజ్) ఆ దేశం స్పష్టం చేసింది. అణు ఆయుధాల వ్యాప్తి నిరోధక ఒప్పందం (ఎన్‌పిటి) ప్రకారం అణు ఆయుధ దేశాలుగా అధికారికంగా గుర్తింపు పొందిన ఐదు దేశాల్లో ' నో ఫస్ట్ యూజ్' ప్రకటన చేసింది చైనా ఒక్కటేనేనని 'హిరోషిమా వాచ్ –2024' లో పేర్కొన్నారు. అమెరికాతో పాటు, ఈ జాబితాలో ఉన్న బ్రిటన్, రష్యా, ఫ్రాన్స్ దేశాలు ఈ తరహా ప్రకటన చేయడానికి నిరాకరిస్తున్నాయి. ' అణు యుద్ధం ఎప్పటికీ గెలవదు. ఆ యుద్ధాన్ని ఎన్నడూ చేయకూడదు' అంటూ సంతకాలు చేసిన ఈ దేశాలు 'నో ఫస్ట్ యూజ్' ప్రకటన చేయడానికి మాత్రం నిరాకరిస్తుండటం గమనార్హం. తమ మీద దాడి జరిగినప్పుడు ఏ రకంగానైనా తిప్పి కొట్టే హక్కు తమకు ఉంటుందని ఆ దేశాలు చెబుతున్నాయి. చైనా మాత్రం దీనికి భిన్నమైన వైఖరి తీసుకుంది. అటువంటి సందర్భంలోనూ తమంతట తాముగా మొట్టమొదట అణు ఆయుధాలను ప్రయోగించేది లేదని స్పష్టం చేసింది. ఇటీవలే రష్యా అణు ఆయుధాల వినియోగంపై తమ వైఖరిని మార్చుకోవడానికి సంసిద్ధత వ్యక్తం చేసింది. 'అణు వ్యూహాన్ని పున:పరిశీలిస్తాం... ఆ దిశలో చర్యలు చేపడతాం.' అని రష్యా ప్రకటించినట్లు నివేదికలో పేర్కొన్నారు. అణు ఆయుధ పోటీకి మూల కారణమైన అమెరికా మాత్రం ఈ దిశలో 'హిరోషిమా శాంతి ప్రణాళిక' చేసిన విజ్ఞప్తిని బేఖాతరు చేసింది. అణు ఆయుధ దేశాలన్నీ ఎన్‌పిటిలో భాగమైనా, కాకపోయినా 'నో ఫస్ట్ యూజ్ ' ప్రకటన చేయాలని, అణు ఆయుధాల తయారీని, వాటిపై ఆధారపడటాన్ని నిలిపివేయాలని హిరోషిమా రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. వివిధ దేశాలు తమ అణు వ్యూహాలను ఎప్పటికప్పుడు మార్చుకుంటుండటం, 'వ్యూహాత్మకం' పేరిట అణు ఆయుధాల తయారీని కొనసాగిస్తుండటం పట్ల రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న నిపుణులు తమ ఆందోళనను వ్యక్తం చేశారు.

పెరుగుతున్న ముప్పు!

మరోవైపు అణుముప్పు పెరుగుతోంది. స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చి ఇన్‌స్టిటట్యూట్ (ఎస్‌ఐపిఆర్‌ఐ) తాజా నివేదిక ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా అణు ఆయుధాల తయారీ, వాటి మోహరింపు పెరుగుతోంది. ఈ ఏడాది జనవరి నాటికి ప్రపంచవ్యాప్తంగా 12,121 అణు ఆయుధాలు పోగుపడ్డాయి. అణు పోటీకి కారమైన అమెరికా అధికారికంగా ప్రకటించిన లెక్కల ప్రకారం 5,044 అణు ఆయుధాలను కలిగి ఉంది. రష్యా వద్ద 5,580 అణు ఆయుధాలు ఉన్నాయి. పాలస్తీనాపై యుద్ధం చేస్తున్న ఇజ్రాయిల్ వద్ద 90 అణు ఆయుధాలు ఉన్నాయి. చైనాలో 500, భారతదేశంలో 172, పాకిస్తాన్‌లో 170 అణు ఆయుధాలు ప్రయోగానికి సిద్ధంగా ఉన్నట్లు ఈ నివేదిక పేర్కొంది. అణు ఆయుధాల మోహరించడం ద్వారా ప్రపంచానికి అణుముప్పును తీవ్రం చేయడంలోనూ అమెరికానే ముందంజలో ఉంది. నాటోలోని అన్ని నాన్ న్యూక్లియర్ దేశాల్లోనూ ఆమెరికా అణు ఆయుధాలను మోహరిస్తోంది. బ్రిటన్‌లో కూడా ఈ ప్రక్రియను కొనసాగిస్తోంది. అదే సమయంలో నూతన వ్యూహాత్మక న్యూక్లియర్ ఆర్మ్‌డ్ సీ లాంచ్‌డ్ క్రుసైల్ మిసైల్ (ఎస్ఎల్‌సిఎం–ఎన్) అమెరికా తాజాగా రూపొందిస్తోంది. . దీనిని పసిఫిక్ రీజియన్‌లో ఆదేశం వినియోగించనుంది. అదే జరిగితే 1991 తరువాత పసిఫిక్ ప్రాంతంలో ఇది మొదటి అణు మోహరింపు అవుతుంది. అమెరికా చేపడుతున్న ఈ చర్యలు రష్యాపై ఒత్తిడి పెంచుతున్నాయి. ఫలితంగా కాంప్రహెన్సివ్ న్యూక్లియర్ టెస్ట్ బాన్ ట్రీటీ (సిటిబిటి) నుడి బయటకు వస్తున్నట్లు రష్యా ప్రకటించింది. ఈ ప్రకటనపై ప్రపంచ వ్యాప్తంగా ఆందోళన వ్యక్తంకావడంతో నూతన వ్యూహాత్మక ఆయుధాల కుదింపు ఒప్పందం (ది న్యూ స్ట్రాటజిక్ ఆర్మ్స్ రిడక్షన్ ట్రీటీ – న్యూ స్టార్ట్)కు కట్టుబడి ఉంటామని రష్యా తెలిపింది. అమెరికా అనుసరిస్తున్న ఏకపక్ష విధానాలు ప్రపంచవ్యాప్తంగా అణు ఉద్రిక్తతలు పెంచడానికి కారణమౌతోందన్న ఆందోళనను నిపుణులు వ్యక్తం చేస్తున్నారు. అణు ఆయుధాలను తయారు చేయడం, మోహరించడాన్ని తక్షణం మానుకోవాలని, అమెరికా–రష్యా దేశాలు 'న్యూ స్టార్ట్' కు కట్టుబడి ఉండాలన్న అభిప్రాయాన్ని వారు వ్యక్తం చేస్తున్నారు. అణుఆయుధాల నిషేధ ఒప్పందం (టిపిఎన్‌డబ్ల్యు)ను 2017లో ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. 2021 నుండి అ ఒప్పందం అమలులో ఉంది. అయితే, అణ్వాయుధ దేశాల ఆచరణ మాత్రం దానికి భిన్నంగా ఉంది. ఎప్పటికప్పుడు ఈ దేశాలు, ముఖ్యంగా అమెరికా, దాని మిత్ర దేశాలు ఈ ఒప్పందానికి ప్రత్యక్షంగానూ,పరోక్షంగానూ తూట్లు పొడుస్తూనే ఉన్నాయి. అణ్వాయుధ రహిత ప్రపంచపు స్వప్నం నెరవేరాలన్నా, దేశాల మధ్య ఉద్రిక్తతలు సమసిపోయి శాంతి నెలకొల్పాలన్నా ఆ దేశాల వైఖరి మారాలి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజాస్వామ్య శక్తులు ఆ దేశాలపై ఒత్తిడి తీసుకురావడమే దీనికి మార్గం.

జనవాక్యం

పేదలకు పెన్నిధిగా నేతలు వ్యవహరించాలి

సామాన్య, పేద ప్రజానీకంపై ఆరాచకాలు చేస్తే, అయిన దానికి కానిదానికి వేధింపులకు గురిచేస్తే ప్రజల దష్టిలో దౌర్జన్యకారులుగా ,అప్రజాస్వామిక శక్తులుగా, అభివద్ధి నిరోధకులుగా మిగిలిపోతారనేది ఎవరూ కాదనలేని అక్షర సత్యం. ప్రజల ఆధారాభిమానాలు ఎల్లవేళలా లభించాలంటే పదవిలో వున్నప్పుడే న్యాయ బద్ధమైన పాలన ప్రజలకు అందించాలి. ఆ తరువాత పదవిలో లేనప్పుడూ ప్రజలు వారిని ఎంతో గౌరవిస్తారు, ప్రజా సమస్యల పట్ల అత్యంత చిత్తశుద్ధి తో వ్యవహరిస్తూ వారి సమస్యల పరిష్కారానికి తమ శక్తివంచన లేకుండా ఆవిరళ కృషితోనే ఆరాధ్యనీయమైన నాయకులుగా అత్యంత సుదీర్ఘ కాలం పాటు ప్రజారంగంలో నిలబడడానికి అవకాశం ఉంటుంది. పేద, సామాన్యప్రజానీకం పాలిట పెన్నిధిగా నిలవాలిగాని, వారి పాలిట శాపంగా ఎన్నటికీ మారకూడదు. పేద, సామాన్య ప్రజల బతుకులు మారాలి, వారంతా తిండికి, బట్టకు, గూడుకు ఏ మాత్రం లోటు లేకుండా అత్యంత సుఖ, సంతోషాలతో జీవించాలి.

- బి మధుసూదనరెడ్డి,
బేతంచెర్ల, నంద్యాల జిల్లా.


మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@ gmail.com

కొలువుదీరిన తాత్కాలిక ప్రభుత్వం

- బంగ్లాదేశ్‌లో 17మందితో అడ్వైజరీ కౌన్సిల్
- పౌరుల భద్రతకు హామీనిచ్చే ప్రభుత్వం : యూనస్



ధాకా : నోబెల్ బహుమతి గ్రహీత ప్రొఫెసర్ మహ్మద్ యూనస్ నేతృత్వంలో 17మందితో బంగ్లాదేశ్‌లో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడింది. గురువారం రాత్రి 9.20 గంటల సమయంలో అధ్యక్షుడు మహ్మద్ షహబుద్దీన్, మహ్మద్ యూనస్‌చేత తాత్కాలిక ప్రభుత్వ అధినేతగా ప్రమాణ స్వీకారం చేయించారు. తర్వాత కేబినెట్ సభ్యులు కూడా ప్రమాణం చేశారు. విద్యార్థి నాయకులు నహిద్ ఇస్లామ్, అసిఫ్ మహ్మద్ తాత్కాలిక ప్రభుత్వంలో చేరారు. బంగాభవన్ అధ్యక్ష భవనంలో జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి బిఎన్‌పి, బంగ్లాదేశ్ జమాత్ ఇ ఇస్లామి సహా ఇతర రాజకీయ నేతలు, బ్రిటన్, జపాన్, చైనా, ఫిలిప్పీన్స్, ఇరాన్, తదితర దేశాల నుండి దౌత్యవేత్తలు హాజరయ్యారు. అవామీ లీగ్ నుండి ఎవరూ ఈ కార్యక్రమంలో కనిపించలేదు. బంగ్లాదేశ్‌లో శాంతిని పునరుద్ధరించడం, వారాల తరబడి హింస కొనసాగిన నేపథ్యంలో తాజాగా ఎన్నికలకు సిద్ధమవడం ప్రస్తుతం యూనస్ ముందున్న కీలకమైన సవాళ్లు. ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లపై తలెత్తిన ఆందోళనలు, నిరసనలతో షేక్ హసీనా ప్రభుత్వం పతనమైన మూడు రోజుల వ్యవధిలో కొత్త ప్రభుత్వం ఏర్పడింది. రాజ్యాంగాన్ని పరిక్షిస్తానని, నిజాయితీగా తన విధులను నిర్వర్తిస్తానని యూనస్ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ప్రమాణ స్వీకారం అనంతరం ఆయన మాట్లాడుతూ పౌరుల భద్రతకు హామీ కల్పించే ప్రభుత్వాన్ని అందిస్తామని అన్నారు. ఒలింపిక్ క్రీడల కోసం ప్రస్తుతం పారిస్‌లో వున్న ఆయన గురువారం మధ్యాహ్నం ఢాకా చేరుకున్నారు. ఆర్మీ చీఫ్ జనరల్ వాకర్ ఉజ్ జమాన్, సీనియర్ అధికారులు, విద్యార్థి నేతలు, ప్రముఖులు ఆయనకు హజరత్ షాజ్‌లాల్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం విమానాశ్రయం వద్ద పత్రికా సమావేశంలో యూనస్ మాట్లాడారు. "ఇప్పుడు దేశం మీ చేతుల్లో వుంది. ఇక మీ ఆకాంక్షలకు అనుగుణంగా దేశాన్ని పునర్నిర్మించుకోవాల్సింది మీరే, ఇందుకు మీ సృజనాత్మకతను ఉపయోగించుకోండి." అని పిలుపునిచ్చారు. కొత్తగా సాధించిన మన ఈ విజయాన్ని ఉత్తమంగా ఉపయోగించుకోవాలన్నారు. యూనస్‌కు అవసరమైన సాయం, తోడ్పాటును సాయుధ బలగాలు అందిస్తాయని జనరల్ జమాన్ ప్రకటించారు. భవిష్యత్ నిర్మాణంలో మహిళల పాత్ర ఎనలేనిదని యూనస్ నొక్కిచెప్పారు. తాత్కాలిక ప్రభుత్వ అధినేతగా ప్రమాణ స్వీకారం చేసిన యూనస్‌కు ప్రధాని మోడీ అభినందనలు తెలిపారు. త్వరలోనే బంగ్లాదేశ్‌లో సాధారణ పరిస్థితులు నెలకొనగలవన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.



సదస్సులో మాట్లాడుతున్న మిడియం బాబూరావు

జిఒ 3పై స్పష్టత ఇవ్వండి

- డిఎస్‌సిలో ఆదివాసీలకు అన్యాయం
- ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ వైస్ చైర్మన్, మాజీ ఎంపీ మిడియం

ప్రజాశక్తి - పాడేరు (అల్లూరి జిల్లా)

ఆదివాసీ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే జిఒ నంబర్ 3 పునరుద్ధరణపై ఇచ్చిన హామీని నెరవేర్చాలని, ఆ విషయాన్ని శుక్రవారం జరిగే ఆదివాసీ దినోత్సవం స్ఫూర్తిగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టంగా ప్రకటించాలని ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ వైస్ చైర్మన్, మాజీ ఎంపి మిడియం బాబూరావు డిమాండ్ చేశారు. 'ఆదివాసీ ప్రాంత సమగ్రాభివృద్ధి - సవాళ్లు' అన్న అంశంపై పాడేరులో ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన పిఎంఆర్‌సిలో రాష్ట్ర స్థాయి సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ... జిఒ నంబర్ 3ని రద్దుచేసి మూడున్నర సంవత్సరాలవుతోందని తెలిపారు. ఎన్నికల సభలో జిఒ నంబర్ 3 రిజర్వేషన్‌ను పునరుద్ధరిస్తామని ప్రతిపక్ష నేత హోదాలో చంద్రబాబు హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. గెలిచిన తరువాత మూడు సార్లు కేబినెట్ సమావేశాలు జరిగినా..గిరిజన సంక్షేమ శాఖపై సమీక్షించినా జిఒ3పై రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి ప్రకటనా చేయలేదన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన జనరల్ డిఎస్‌సిలో స్థానిక ఆదివాసీలకు అన్యాయం జరుగుతోందన్నారు. గురుకులం నిబంధనలను తుంగలో తొక్కి, జనరల్ రిక్రూట్‌మెంట్ చేయడం వల్ల ఇప్పటికే విధులు నిర్వహిస్తున్న ఆదివాసీ గెస్ట్ టీచర్లు, అధ్యాపకులు గురుకులాల నుంచి నెట్టివేయబడతారన్నారు. రాష్ట్రంలోని 28 ఏకలవ్య పాఠశాలల్లో ఒక్క ఎస్‌టికి కూడా ఉద్యోగం రాలేదని, హిందీ రాష్ట్రాల నుంచి వచ్చి విద్యా బోధన చేయడంతో విద్యార్థుల్లో డ్రాపౌట్స్ సంఖ్య మొదలైందని, ఇది ఇలానే కొనసాగితే ఏకలవ్య మోడల్ పాఠశాలల లక్ష్యం నెరవేరదని అన్నారు. ఆదివాసీ యువతకు న్యాయం చేసేలా గిరిజన ప్రత్యేక డిఎస్‌సిపైనా సిఎం స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆరు శాతమైతే నేటికీ విద్యా, ఉద్యోగ, ఉపాధ్యాయ రంగాలలో 3.5 శాతానికి మించి ఆదివాసీలు పొందలేకపోతున్నారని తెలిపారు. మరోపక్క గిరిజనేతరులను, బోయ/వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేర్చడానికి రాజకీయ ప్రయోజనాల కోసం పాలకులు చేస్తున్న కుట్రను తిప్పికొట్టాలని కోరారు. సదస్సులో సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు పి.అప్పలనర్స, ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోరాబు సత్యనారాయణ, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.ధర్మన్న పడాల్, పి.బాలదేవ్, నాయకులు చిన్నం నాయుడు, బిసిహెచ్.పడాల్, కుమారి పాల్గొన్నారు.

16, 17 తేదీల్లో ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర సమావేశాలు

ప్రజాశక్తి - ఏలూరు

ఈ నెల 16, 17 తేదీల్లో ఏలూరులో ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర సమావేశాలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్ తెలిపారు. స్థానిక ఎస్‌ఎఫ్‌ఐ కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం విద్యార్థులు పడుతున్న కష్టాలు, భవిష్యత్తులో ఎటువంటి కష్టాలు పడబోతున్నారో వాటిని ఎలా ఎదుర్కొవాలో ఈ సమావేశ సారాంశమని చెప్పారు.

శ్రీకాళహస్తి పర్యాటకానికి రూ.114 కోట్లివ్వండి

- కేంద్ర మంత్రి షెకావత్‌ను కోరిన ఎమ్మెల్యే బొజ్జల

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

ఆధ్యాత్మిక పట్టణంగా ప్రపంచ ఖ్యాతి గడించిన శ్రీకాళహస్తిని పర్యాటకంగానూ అభివృద్ధిపరిచేందుకు అవసరమైన నిధులను మంజూరు చేయాలని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ను శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి కోరారు. శ్రీకాళహస్తి అభివృద్దే లక్ష్యంగా అందుకు అవసరమైన పనులు, నిధులను సమకూర్చుకోవడంలో భాగంగా ఢిల్లీలో మకాం వేసిన బొజ్జల..

గురువారం కేంద్ర పర్యాటక శాఖా మంత్రిని కలిశారు. 'ప్రసాద్' పథకం కింద శ్రీకాళహస్తిలో పర్యాటకం అభివృద్ధికి రూ.111.06 కోట్లు కావాలని విన్నవించారు. దానికి సంబంధించిన పనులు, అంచనా విలువలను మంత్రి ముందు ఉంచారు. భరద్వాజ తీర్థం నుంచి దుర్గమ్మ కొండ వరకు రోప్ వే, స్వర్ణముఖి నది, కరకట్ట సుందరీ కరణ, ఆలయ మహాప్రాకారం పనులు ఇందులో ముఖ్యమైనవి. సానుకూలంగా స్పందించిన కేంద్ర పర్యాటక శాఖా మంత్రి పరిశీలించి నిధులు మంజూరయ్యేలా చేస్తానని హామీ ఇచ్చారు.

పెరిగిన గోదావరి నీటిమట్టం

- పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే నుంచి 7,43,222 క్యూసెక్కులు విడుదల

ప్రజాశక్తి - పోలవరం

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి నీటిమట్టం గురువారానికి పెరిగింది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే నుంచి 7,43,222 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. స్పిల్‌వే ఎగువున 31.430 మీటర్లు, స్పిల్‌వే దిగువున 22,790 మీటర్ల నీటిమట్టం నమోదైనట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ఏలూరు జిల్లా పోలవరం మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు కొండవాగులు, కొవ్వాడ కాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఎల్లండిపేట కొవ్వాడ రిజర్వాయర్ కొండవాగుల వరద నీరు నిండిపోవడంతో బుధవారం రాత్రి 480 క్యూసెక్కులు, గురువారం ఉదయం రిజర్వాయర్ నీటిమట్టం 90.25 మీటర్లకు చేరుకోవడంతో ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు సిబ్బంది 1000 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేశారు. కొండవాగులు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పోలవరం నుండి కన్నాపురం వెళ్లే రోడ్డు మార్గంలో దొండపూడి సాగిపాడు కల్వర్టుపై నాలుగు అడుగుల ఎత్తున నీరు ప్రవహిస్తోంది. దీంతో ఆ మార్గంలో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. కడెమ్మ అవుట్ ఫాల్ స్లూయిజ్ నుండి గోదావరిలోకి నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. పోలవరం పట్టిసీమ, గూటాల, కొత్తపట్టిసీమ, ఇటుకలకోట, వింజరం, చేగొండపల్లి పంచాయతీల్లో పలు గ్రామాలు జలమయమ య్యాయి. చింతలపూడి మండలంలోని నాగిరెడ్డిగూడెం వద్ద తమ్మిలేరు రిజర్వాయర్‌లోకి గురువారం ఇన్ ఫ్లో 6,393 క్యూసెక్కులు గాను, ఔట్ ఫ్లో 8893 క్యూసెక్కులు ఉన్నట్లు ఎఇఇ. పరమానందం తెలిపారు. రిజర్వాయర్ పూర్తి నీటి మట్టం 355 అడుగులు కాగా ప్రస్తుత నీటి మట్టం తమ్మిలేరుబేసిన్ 349.36 అడుగులుగా, గొనెలవాగు బేసిన్ వద్ద 349.13 అడుగులు ఉందని తెలిపారు.

త్వరలో జన్మభూమి-2

టిడిపి పొలిట్‌బ్యూరో సమావేశంలో చంద్రబాబు



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో త్వరలో జన్మభూమి -2 కార్యక్రమాన్ని ప్రారంభించాలని టిడిపి అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. టిడిపి కార్యాలయంలో గురువారం ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన చంద్రబాబు మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో చేపట్టిన జన్మభూమి కార్యక్రమాన్ని మరలా నిర్వహించాల్సిఉందని చెప్పారు. అప్పట్లో ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని తెలిపారు. నాడు చేపట్టిన అభివృద్ధి పనులు ఇప్పటికీ కనిపిస్తున్నాయని వివరించారు. ప్రజలందరి సహకారంతో జన్మభూమి-2 కింద అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సకాలంలో వర్షాలు పడి రిజర్వాయర్లు నిండటం శుభపరిణామం అని, దీంతో వ్యవసాయ అనుకూల వాతావరణం ఏర్పడిందని చెప్పారు. ఇటీవల కురిసిన వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సహాయ, సహకారాలు అందిస్తుందన్నారు. ఈ నెల 15 నుంచి అన్న క్యాంటీన్లు ప్రారంభం కానున్నాయని తెలిపారు. నీతి ఆయోగ్ సహకారంతో రాష్ట్రాభివృద్ధికి సమగ్రప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. అమరావతి నిర్మాణానికి, పోలవరం పూర్తిచేయడానికి, వెనుకబడ్డ ఎనిమిది జిల్లాల అభివృద్ధికి అవసరమైన నిధులు ఇవ్వడానికి కేంద్రప్రభుత్వం వెంటనే అంగీకరించడం శుభపరిణామన్నారు. పోలవరం డయాఫ్రంవాల్ మూడుచోట్ల దెబ్బతిన్నదని, దీనిపై ఏం చేయాలనేదానిపై కేంద్ర నిర్ణయం తీసుకుంటుందన్నారు. నిబద్ధతతో కష్టపడిన పనిచేసిన వారికి నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. సిఫార్సులతో సంబంధం లేకుండా పనిచేసిన వారిని గుర్తించి దశలవారీగా భర్తీ చేస్తామన్నారు. మాజీమంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సాక్ష్యాలు తారుతారు చేసిన్నట్లే మదనపల్లెలో భూ కుంభకోణాలకు సంబంధించిన సాక్షాలను కూడా తారుమారు చేసేందుకు వైసిపి నేతలు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. వైసిపి అంటేనే నేరస్తులు, అరాచకవాదులని వ్యాఖ్యానించారు..

అర్జీల పరిష్కారానికి యంత్రాంగం

ప్రజావేదిక, ప్రజాదర్బార్‌లో ప్రజల నుంచి వచ్చిన అర్జీల పరిష్కారానికి యంత్రాంగం ఏర్పాటు చేయాలని పొలిట్ బ్యూరో నిర్ణయం తీసుకుందని పార్టీ రాష్ట్రఅధ్యక్షులు పల్లా శ్రీనివాసయాదవు, పొలిట్ బ్యూరోసభ్యులు కాల్వ శ్రీనివాసులు వెల్లడించారు. సమావేశ నిర్ణయాలను మీడియాకు వారు వివరించారు.

పార్టీ సభ్యుల ప్రమాద బీమాను రూ.5లక్షలకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. జిల్లాల్లో జనాభా దామాషాను బట్టి ఎస్సి వర్గీకరణ చేపట్టాలని ప్రతిపాదించిన్నట్లు తెలిపారు. వైసిపి తప్పుడు ప్రచారాలు, కుట్రలను పార్టీ శ్రేణులంగా తిప్పికొట్టాలని కోరారు. తెలంగాణలో పార్టీ బలోపేతానికి తగిన కృషి చేయాలని నిర్ణయించిన్నట్లు వెల్లడించారు. గత ఐదేళ్లల్లో జరిగిన విధ్వంసాలు, దోపిడీ, భూ కబ్జాలపై ప్రభుత్వం విడుదల చేసిన శ్వేతపత్రాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించిన్నట్లు తెలిపారు.

వక్ఫ్ బిల్లు రాజ్యాంగ విరుద్ధం

(మొదటిపేజీ తరువాయి)

ముస్లిం మ్యాన్ వక్ఫ్ (రీఫిల్) బిల్లులను ప్రవేశపెట్టారు. బిల్లులను ప్రవేశపెట్టడానికి మంత్రి సిద్ధమైనప్పటి నుండే ప్రతిపక్షాల నిరసన ప్రారంభమైంది. ఈ బిల్లు రాజ్యాంగ విరుద్ధమని, ముస్లిం వ్యతిరేక, విభజన రాజకీయాల్లో భాగమంటూ ప్రతిపక్షాలు తీవ్ర స్థాయిలో వ్యతిరేకించాయి. దీంతో ప్రభుత్వం ఈ బిల్లును పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీకి పంపింది. ఈ బిల్లును పార్లమెంటరీ కమిటీ పరిశీలిస్తుంది. బిల్లును ఇండియా ఫోరంలోని పార్టీలన్నీ ముక్తకంఠంతో వ్యతిరేకించాయి. వైసిపి కూడా బిల్లును వ్యతిరేకించింది. తెలుగుదేశం పార్టీ బిల్లుకు మద్దతు ఇచ్చింది. 'ఈ బిల్లు రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తోంది. సమాఖ్య వాదానికి వ్యతిరేకం. పార్లమెంట్ స్టాండింగ్ కమిటీకి పంపాలి. భూమి రాష్ట్ర జాబితాకు సంబంధించినది. కానీ, కేంద్రం బిల్లు ప్రవేశపెడుతోంది. బిల్లు ప్రకారం ముస్లింలకు సంబంధించిన వక్ఫ్ బోర్డులో ముస్లిమేతరులు కూడా సభ్యులుగా ఉంటారని పేర్కొన్నాయి. ఇది దారుణం'అని ప్రతిపక్షాలు పేర్కొన్నాయి. కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు చట్టంలో ఉన్న లొసుగులను సరిచేయడం కోసం, ముస్లిం సమాజం మెచ్చుకునేలా ఈ బిల్లు తీసుకొచ్చామని అన్నారు. ఈ బిల్లు రాజ్యాంగంలోని ఏ అధికరణకూ వ్యతిరేకంగా లేదన్నారు. 2014 తరువాత వక్ఫ్ బోర్డు చట్టంపై ప్రజలను, అనేకమంది ముస్లిం పెద్దలు, ముస్లిం సంస్థలను కలిసి వారి సమస్యలు, అభిప్రాయాలు తెలుసుకుని దానికి అనుగుణంగా బిల్లు తీసుకొచ్చినట్లు కిరణ్ రిజిజు చెప్పారు. ఆన్‌లైన్‌లో కూడా ప్రజల అభిప్రాయాలు స్వీకరించామన్నారు. వక్ఫ్‌బోర్డును కాపాడటంతో పాటు ఇప్పటివరకు అవకాశాలు పొందని ముస్లిం సమాజం అవకాశాలు పొందే విధంగా సవరణలు తీసుకొస్తున్నట్లు తెలిపారు. వక్ఫ్ సవరణ బిల్లు సమాఖ్య వ్యవస్థపై, రాజ్యాంగంలో పొందుపరిచిన మత స్వేచ్ఛపై ప్రత్యక్ష దాడి అని కాంగ్రెస్ నేత కెసి వేణుగోపాల్ విమర్శించారు. విభజన రాజకీయాలకు పాల్పడటమే ప్రతిపాదించిన మార్పులకు ప్రేరణ అని ఆయన అన్నారు. 'మహారాష్ట్ర, హర్యానా ఎన్నికలకు ఈ బిల్లు ప్రత్యేకం. ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో దేశ ప్రజలు మీకు గుణపాఠం చెప్పారని అర్థం కావడం లేదు. ఇది ఫెడరల్ వ్యవస్థపై దాడి' అని చెప్పారు. 'ఈ బిల్లు ద్వారా ముస్లిమేతరులు కూడా వక్ఫ్ పాలక మండలిలో సభ్యులుగా ఉండాలనే నిబంధన పెడుతున్నారు. ఇది మత స్వేచ్ఛపై ప్రత్యక్ష దాడి... మీరు మొదటి నుండి ముస్లింలపై దాడి చేస్తున్నారు. తరువాత క్రిస్టియన్లు, ఆ తరువాత జైనులు, సిక్కులు, పార్శీలు... ఇలాంటి విభజన రాజకీయాలను భారత ప్రజలు ఇప్పుడు సమర్థించరు. ఈ విషయం అధికారంలో ఉన్న నేతలకు అర్థం కావడం లేదు' అని ఆయన అన్నారు. ఈ బిల్లును ఎస్‌పి ఎంపి మోహిబ్బుల్లా, టిఎంసి ఎంపిలు సుదీప్ బందోపాధ్యాయ, కల్యాణ్ బెనర్జీ, డిఎంకె ఎంపి కనిమొళి, ఎస్‌పి ఎంపి అఖిలేష్ యాదవ్, ఎన్‌సిపి ఎంపి సుప్రియా సులే, ఐయుఎంఎల్ ఎంపి ఈటి మహ్మద్ బషీర్, ఆర్‌ఎస్‌పి ఎంపి ఎన్‌కె ప్రేమ్‌చంద్రన్, విసికె ఎంపి తిరుమవలవన్, ఎంఐఎం ఎంపి అసదుద్దీన్ ఒవైసి, కాంగ్రెస్ ఎంపిలు గౌరవ్ గొగొయ్, ఇమ్రాన్ మసూద్, నేషనల్ కాన్ఫరెన్స్ అల్తాఫ్ అహ్మద్, సిపిఐ ఎంపి సుబ్బరాయన్, టిఎంసి ఎంపి సౌగత్ రాయ్ వ్యతిరేకించారు.

బిల్లును వ్యతిరేకిస్తున్నాం : మిథున్ రెడ్డి

వైసిపి ఎంపి పివి మిథున్ రెడ్డి మాట్లాడుతూ ఈ బిల్లును ప్రవేశపెట్టడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని, ఈ బిల్లు తీసుకురావడానికి ముందే ముస్లిం పక్షాలతో సంప్రదింపులు చేయాల్సి ఉందని అన్నారు. ఎంఐఎం ఎంపి అసదుద్దీన్ ఒవైసి మాట్లాడిన అంశాలతో ఏకీభవిస్తున్నామని అన్నారు.

ప్రభుత్వాన్ని అభినందిస్తున్నాం : టిడిపి

టిడిపి ఎంపి జిఎం హరీష్ మాట్లాడుతూ ప్రభుత్వం ఈ బిల్లును తీసుకురావడాన్ని అభినందిస్తున్నామని, మత సంస్థలకు ఆస్తులు దానం చేసేవారి ప్రయోజనాలను కాపాడాలని అన్నారు.. ఈ బిల్లుకు తాము మద్దతు ఇస్తున్నామని అన్నారు. సెలక్ట్ కమిటీకి పంపడం పట్ల తమకు అభ్యంతరం లేదని పేర్కొన్నారు. జెడియు ఎంపి లలన్ సింగ్, శివసేన (షిండే) ఎంపి శ్రీకాంత్ ఏక్‌నాథ్ మద్దతు తెలిపారు.

జిల్లా జడ్జిల పెన్షన్ల సమస్యలకు పరిష్కారం కనుగొనండి

- కేంద్రానికి సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ : జిల్లా జడ్జిల పెన్షన్ల సమస్యలకు వీలైనంత తర్వగా పరిష్కారం కనుగొనాలని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు గురువారం ఆదేశించింది. 'జిల్లా జడ్జిలు కేవలం రూ.15 వేల పెన్షన్ మాత్రమే పొందుతున్నారు. ఒక వేళ జిల్లా జడ్జిలు 56, 57 ఏళ్ల వయస్సులో హైకోర్టు జడ్జిలుగా పదోన్నతి పొందితే రూ 30 వేల పెన్షన్‌తో రిటైరవుతున్నారు' అని ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం కేంద్రానికి గుర్తు చేసింది. ఈ కొద్దిపాటి పెన్షనపై కూడా అనేక ఫిర్యాదులు వస్తున్నాయని, వీటిని త్వరగా పరిష్కరించాలని కోరింది. అమికస్ క్యూరీతో కలిసి కూర్చుని ఒక పరిష్కార మార్గాన్ని కనుగొనవలసిందిగా జిల్లా న్యాయవ్యవస్థ యొక్క సంరక్షకులుగా మిమ్మల్ని (అటార్నీ జనరల్, సొలిసిటర్ జనరల్‌ను ఉద్దేశించి) మేము కోరుతున్నామని ధర్మాసనం తెలిపింది. ఈ సందర్భంగా క్యాన్సర్‌తో బాధపడుతున్న జిల్లా జడ్జి కేసును ధర్మాసనం ప్రస్తావించింది. అఖిల భారత న్యాయమూర్తుల సంఘం దాఖలు చేసిన పిటీషన్ విచారణలో ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. తమకు కొంత సమయం కావాలని కేంద్రం తరుపున హాజరైన అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణి, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోరడంతో, విచారణను ఈ నెల 27కి కోర్టు వాయిదా వేసింది.

జిల్లా కలెక్టర్‌దే తుది నిర్ణయం

- వివాద పరిష్కారానికి హైకోర్టే దిక్కు!
- వక్ఫ్ బిల్లులో ప్రతిపాదిత సవరణలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ప్రభుత్వం ఇప్పుడు పార్లమెంటులో ప్రవేశపెట్టిన వక్ఫ్ బిల్లులో పలు సవరణలను ప్రతిపాదించింది. వక్ఫ్ బోర్డులు తమ ఆస్తులను నిర్వహించే అధికారాన్ని పరిమితం చేయడం, మరింత ప్రభుత్వ నియంత్రణకు వీలు కల్పించడం ఈ బిల్లు లక్ష్యం. వక్ఫ్ ఆస్తికి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేయాలని, తద్వారా ఆస్తిని మదింపు చేయవచ్చని బిల్లులో ప్రతిపాదించారు. ఒక ప్రాపర్టీ వక్ఫ్ ఆస్తినా?, లేక ప్రభుత్వ భూమినా? అనేది జిల్లా కలెక్టర్ నిర్ణయిస్తారని, ఆయన నిర్ణయమే అంతిమమని బిల్లులో ప్రతిపాదించారు. కలెక్టర్ నిర్ణయం తీసుకున్న తర్వాత రెవెన్యూ రికార్డుల్లో అవసరమైన మార్పులు చేసి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించవచ్చు. కలెక్టర్ తన నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించే వరకు ఆ ఆస్తిని వక్ఫ్ ఆస్తిగా పరిగణించరాదని బిల్లులో పేర్కొన్నారు. గతానికి భిన్నంగా వక్ఫ్ బోర్డులో ముస్లిమేతర వ్యక్తులు ఉంటారు.

వక్ఫ్ బోర్డు నిర్ణయంతో వివాదం తలెత్తితే ఇకపై సంబంధిత హైకోర్టుల్లో అప్పీల్ చేసుకోవచ్చు. స్థానిక కోర్టులకు వెళ్లే అవకాశం లేకపోవడం సామాన్యులకు కష్టం అవుతోంది. ప్రాపర్టీ అసలు డిక్లరేషన్ అనుమానాస్పదంగా లేదా వివాదాస్పదంగా ఉన్నప్పటికీ. ఇస్లామిక్ చట్టం ప్రకారం, డాక్యుమెంటేషన్ (వక్ఫ్ నామా) ప్రామాణికంగా మారే వరకు, ఒక ఆస్తిని వక్ఫ్ గా నిర్ధారించవచ్చు. ఈ బిల్లు అటువంటి నిబంధనలను తొలగించడానికి ప్రయత్నిస్తుంది. చెల్లుబాటు అయ్యే వక్ఫ్ నామా లేనప్పుడు వక్ఫ్ ఆస్తిని అనుమానాస్పద లేదా వివాదాస్పద ఆస్తిగా పరిగణించవచ్చు. జిల్లా కలెక్టర్ తుది నిర్ణయం తీసుకునే వరకు ఈ ఆస్తిని ఉపయోగించడానికి వీల్లేదు.

కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా (కాగ్) నియమించిన ఆడిటర్ లేదా ఆ ప్రయోజనం కోసం కేంద్ర ప్రభుత్వం నియమించిన ఏ అధికారి అయినా ఏ సమయంలోనైనా వక్ఫ్ ఆడిట్‌ను పరిశీలించే అధికారాలు ఉంటాయని ప్రతిపాదిత బిల్లులో పేర్కొన్నారు. కేంద్ర వక్ఫ్ కౌన్సిల్, రాష్ట్ర బోర్డుల్లో మహిళలకు ప్రాతినిధ్యం ఉండేలా చూడాలని బిల్లులో ప్రతిపాదించారు.

వక్ఫ్ ప్రాపర్టీ అంటే ఏమిటి?

ముస్లింలు తమ దేవుని పేరుపై ధార్మిక ప్రయోజనాల కోసం అంకితం చేసిన చరాస్తులు, లేదా స్థిరాస్తులను వక్ఫ్ ఆస్తులు అంటారు. డాక్యుమెంటేషన్ ప్రారంభం కాకముందు నుంచే ఈ విధానం ఉనికిలో ఉంది. వక్ఫ్ ఆస్తిని ట్రాన్స్ ఫర్ చేయడం కుదరదు. ఇది దేవుని పేరు మీద శాశ్వతంగా ఉంటుంది. వక్ఫ్ నుంచి వచ్చే ఆదాయం సాధారణంగా విద్యా సంస్థలు, శ్మశాన వాటికలు, మసీదులు, షెల్టర్ హోమ్ ల నిర్వహణకు ఉపయోగిస్తారు. ఇది పెద్ద సంఖ్యలో ముస్లింలకు ప్రయోజనం చేకూరుస్తుంది.

వక్ఫ్ బోర్డు అంటే ఏమిటి?

వక్ఫ్ బోర్డు అనేది వక్ఫ్ ఆస్తుల నిర్వహణకు నామినేటెడ్ సభ్యులతో కూడిన చట్టబద్ధమైన సంస్థ. బోర్డు ప్రతి ఆస్తికి ఒక కస్టోడియన్‌ను నియమిస్తుంది. దాని ద్వారా వచ్చే ఆదాయాన్ని ఉద్దేశిత ప్రయోజనాలకు ఉపయోగించేలా చూసుకుంటుంది. 1964లో స్థాపించబడిన సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్ (సిడబ్ల్యుసి) భారతదేశం అంతటా రాష్ట్ర స్థాయి వక్ఫ్ బోర్డులను పర్యవేక్షిస్తుంది. సలహాలు, సూచనలు అందిస్తుంది. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం, వక్ఫ్ బోర్డులకు ఆస్తుల నిర్వహణపై సలహాలు ఇస్తుంది. రాష్ట్ర స్థాయి బోర్డులు తమ పనితీరు, ముఖ్యంగా ఆర్థిక పనితీరు, సర్వే, రెవెన్యూ రికార్డులు, వక్ఫ్ ఆస్తుల ఆక్రమణ, వార్షిక, ఆడిట్ నివేదికలు మొదలైన వాటిపై సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్ కు సమాచారం అందించాలని వక్ఫ్ చట్టం 1954లోని సెక్షన్ 9(4) ఆదేశించింది.

1995లో కొత్త చట్టం

వక్ఫ్ ఆస్తుల నిర్వహణకు సంబంధించి 1995లో కొత్త చట్టాన్ని అమల్లోకి తీసుకువచ్చారు. తరువాత, ఈ చట్టాన్ని 2013 లో సవరించారు. ఈ చట్టం ప్రకారం.. ఒక ఆస్తిని 'వక్ఫ్ ప్రాపర్టీ'గా గుర్తించే అధికారాన్ని వక్ఫ్ బోర్డుకు కల్పించారు. ఒక ఆస్తిని వక్ఫ్ గా పరిగణించవచ్చా అనే వివాదం తలెత్తినప్పుడు, 1995 చట్టంలోని సెక్షన్ 6 ప్రకారం అటువంటి విషయంలో ట్రిబ్యునల్ నిర్ణయమే అంతిమంగా ఉంటుంది.

విదేశీ పర్యాటకుల జాడేదీ!

- రాష్ట్రానిది 16వ స్థానం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్రంలో పర్యాటక రంగం తిరోగమనబాటలో పయనిస్తోంది. కీలక పర్యాటక ప్రాంతాలకు తప్ప ఇతర ప్రాంతాలకు పర్యాటకుల తాకిడి ఆశించిన స్థాయిలో ఉండటం లేదు. పర్యాటక రంగంలో ఎక్కువ ఆదాయం సమకూర్చే విదేశీయుల రాక ఆశాజనకంగా లేదని అధికారులు చెబుతున్నారు. విదేశీ పర్యాటకుల రాకకు సంబంధించి మన రాష్ట్రం దేశంలో 16వ స్థానంలో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. అది కూడా విశాఖ, తిరుపతి జిల్లాలకే అధికంగా వస్తున్నారని అంటున్నారు. వీరి రాక తగ్గడం, పర్యాటక రంగంలో సౌకర్యాలు సక్రమంగా లేకపోవడం వల్లనే వీరి రాక తగ్గుతోందని, ఫలితంగా రాష్ట్ర స్థూల విలువ (జివిఎ)లో పర్యాటక రంగం పాత్ర చాలా తక్కువగా ఉందని అధికారులు అంగీకరిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో జివిఏలో కేవలం 4.6 శాతం మాత్రమే పర్యాటక ఆదాయం ఉంది. రాష్ట్రం మొత్తం మీద పెద్ద పెద్ద హెూటళ్లలో కేవలం 3,097 గదులు మాత్రమే ఉన్నత స్థాయివి ఉన్నాయి,. రాష్ట్ర, దేశ పర్యాటకులు, వ్యాపారులు, ఇతర ప్రముఖులు వినియోగించేవి పోగా విదేశీయులకు నామమాత్రంగానే గదుల లభ్యత ఉంటోందని తెలుస్తోంది. అలాగే విదేశీయులు కేవలం ఒకటి లేదా రెండు రోజులు బస చేసేందుకు మాత్రమే అవకాశాలు ఉంటాయని, ఎక్కువ రోజులు ఉండాలనుకునే వారికి ఈ పరిస్థితి ఇబ్బందికరంగా మారుతోందని చెబుతున్నారు. రాష్ట్రానికి వచ్చే సమయంలో వారి సౌకర్యాల కోసం కేవలం ఒక్కొక్కరిపై రూ. 1700 రూపాయలను మాత్రమే ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. దీనివల్ల కూడా అదనపు సౌకర్యాలు కల్పించలేని పరిస్థితి నెలకొంది.

సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి

ఈ నేపథ్యంలో విదేశీ పర్యాటకులను ఆకర్షించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ఉన్నత స్థాయిలో వసతి సౌకర్యాలు పెంచడం, వారికి అవసరమైన సౌకర్యాలను కల్పించడంపైనే ఎక్కువ చర్యలు తీసుకోవాలని భావిస్తున్నారు. గదుల సంఖ్యను ఐదు వేలకు పెంచడం, కనీసం ఐదు రోజులపాటు వారు పర్యాటక ప్రాంతాల్లోనే ఉండేందుకు సౌకర్యాలు పెంచడం, ఒక్కొక్కరిపై చేసే వ్యయాన్ని కూడా ఐదు వేల రూపాయలకు పెంచడంపై దృష్టి సారించాలని భావిస్తున్నారు. అలాగే జివిఏలో పర్యాటక రంగం 4.6 శాతం నుంచి ఆరు శాతానికి పెరిగేలా చూడాలని యొచిస్తున్నారు. దీంతో ఇప్పుడున్న 16 స్థానాన్ని 10వ స్థానానికి మెరుగుపరచుకోవాలని కూడా ప్రణళికను ప్రభుత్వం సిద్ధం చేస్తోంది.

ముందస్తు బెయిల్ ఇవ్వండి

- సిఐడి అదనపు ఎస్‌పి విజయ్‌పాల్

ప్రజాశక్తి-అమరావతి

టిడిపి ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామ కృష్ణరాజు చేసిన ఫిర్యాదు ఆధారంగా గుంటూరు నగరపాలెం పోలీసులు నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలని సిఐడి అదనపు ఎస్‌పి విజయ్ పాల్ హైకోర్టును ఆశ్రయించారు. దీనిని జస్టిస్ విఆర్ కృపాసాగర్ గురువారం విచారణ జరిపారు. అరెస్టు చేసే అవకాశం ఉన్నందున పిటిషన్‌ను అత్యవసరంగా విచారించాలని న్యాయవాది జివిఎస్ కిషోర్ కుమార్ కోరారు. ఈ కేసులో తమ వాదనలు వినాలని రఘురామ ఇంప్లీడ్ పిటిషన్ వేశారు. వీటిని శుక్రవారం విచారిస్తామని న్యాయమూర్తి ప్రకటించారు.

భద్రత రద్దుపై బాలినేని పిటిషన్

తనకున్న భద్రతను రద్దు చేయడాన్ని ఒంగోలు వైసిపి మాజీ ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి హైకోర్టులో సవాల్ చేస్తూ పిటిషన్ దాఖలు చేశారు. గతంలో ఉన్న 2ప్లస్2 భద్రతను పునరుద్ధరించేలా పోలీసులకు ఉత్తర్వులు ఇవ్వాలనే పిటిషన్‌ను జస్టిస్ బివిఎల్ చక్రవర్తి విచారణ జరిపారు. న్యాయవాది ఆలపాటి వివేకానంద వాదిస్తూ, ఏ విధమైన సమాచారం ఇవ్వకుండానే భద్రత రద్దు చేశారన్నారు. పిటిషనర్‌కు ప్రాణహాని ఉందన్నారు. ప్రభుత్వ ప్లీడర్ కృష్ణారెడ్డి వాదిస్తూ, పిటిషనర్‌కు ప్రాణహాని లేదన్నారు. వాదనల తర్వాత హైకోర్టు, కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఎస్ఆర్‌డిసి నివేదికపై అభ్యంతరం ఉంటే, దానిని సవాల్ చేసుకోవచ్చునని పిటిషనర్‌కు చెప్పింది. విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

వైసిపి నేతల పిటిషన్లపై విచారణ 14కు వాయిదా

టిడిపి కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ వైసిపి నేతలు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ ఈ నెల 14కు వాయిదా పడింది. ఈ మేరకు జస్టిస్ విఆర్ కృపాసాగర్ ప్రకటించారు. ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, తలశిల రఘురాం, మాజీ ఎంపి నందిగం సురేష్, నాయకులు దేవినేని అవినాష్ ఇతరులు వేసిన పిటిషన్లను హైకోర్టు విచారణ జరిపింది. పిటిషన్ల వాదనలు పూర్తయ్యాయి. పోలీసుల తరపున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా, పోసాని వెంకటేశ్వర్లు వాదించనున్నారు.

మద్యం షాపు ఖాళీ కేసులో బెయిల్ ఇవ్వండి : వాసుదేవరెడ్డి

గుడివాడ పోలీసులు పెట్టిన కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ గత ఎండి వాసుదేవరెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. తన మద్యం షాపు నుంచి దౌర్జన్యంగా ఖాళీ చేయించి వేరేవాళ్లకు కేటాయించడం వల్ల రూ.50 లక్షల నష్టం రావడానికి కారణం వాసుదేవరెడ్డి ఇతరులు కారణమంటూ వెంకటేశ్వరరావు అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గుడివాడ పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిని జస్టిస్ విఆర్ కృపాసాగర్ విచారణ జరిపారు. తదుపరి విచారణ వరకు వాసుదేవరెడ్డి పట్ల కఠిన చర్యలు తీసుకోవద్దని పోలీసులను ఆదేశిస్తూ విచారణను సోమవారానికి వాయిదా వేశారు.

ఎమ్మెల్సీపై అనర్హత వేటురద్దు చేయండి : రఘురాజు

పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని వైసిపి విప్ విక్రాంత్ ఫిర్యాదు మేరకు తనపై అనర్హత వేటు వేస్తూ శాసనమండలి ఛైర్మన్ గత మేలో ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ మాజీ ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ వచ్చే వారానికి వాయిదా పడింది. ప్రతివాదులైన శాసన మండలి సెక్రటరీ జనరల్, ట్రిబ్యునల్ ఛైర్మన్ హోదాలో మండలి ఛైర్మన్, విప్ విక్రాంత్, రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యదర్శి, శాసన వ్యవహారాల కార్యదర్శికి జస్టిస్ గుహనాథన్ నరేందర్, జస్టిస్ మండవ కిరణ్మయితో కూడిన ధర్మాసనం నోటీసులిచ్చింది.

గత ఎఎజి భద్రత కొనసాగించండి

గత ఉత్తర్వులకు అనుగుణంగా మాజీ అదనపు అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్ రెడ్డికి తిరిగి ఆదేశించే వరకు 2ప్లస్2 భద్రత కొనసాగించాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. భద్రతా సిబ్బందికి అయ్యే వ్యయాన్ని పిటిషనరే భరించాలంది. ప్రాణహాని లేదంటూ ఎస్ఆర్‌సి నివేదిక ఇచ్చిన నేపథ్యంలో ఆ నివేదికను సవాల్ చేస్తూ పిటిషన్‌లో మార్పులకు అనుమతించింది. విచారణను ఈ నెల 14కు వాయిదా వేస్తున్నట్లు జస్టిస్ బివిఎల్ చక్రవర్తి ఉత్తర్వులు జారీ చేశారు.

ఐలు ఆందోళన

ఇటీవల కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కొత్త క్రిమినల్ చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) ఆందోళన కొనసాగిస్తోంది. ఐలు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యాన గురువారం హైకోర్టు వద్ద ఆందోళన చేపట్టింది.

గాజాలో పాఠశాలలపై దాడులు

- 15 మంది మృతి, 30 మందికి గాయాలు

గాజా : పాలస్తీనాపై ఇజ్రాయిల్ నరమేధం కొనసాగుతూనే ఉంది. గురువారం గాజాలోని రెండు పాఠశాలలపై ఇజ్రాయిల్ చేసిన బాంబుదాడుల్లో 15 మంది మరణించారు. 30 మందికిపైగా గాయపడ్డారు. అల్-జహ్రా పాఠశాల, అబ్దెల్ ఫతాహ్ హమౌద్ పాఠశాలలపై ఈ దాడులు జరిగినట్లు గాజా అధికారులు తెలిపారు. ఈ దాడి గురించి గాజా పౌర రక్షణ శాఖ అధికార ప్రతినిధి మహమౌద్ బసల్ మాట్లాడుతూ మృతులంతా చిన్నారులు, మహిళలే అని చెప్పారు. ఇజ్రాయిల్ సైన్యం ఆరోపిస్తున్నట్లుగా ఒక సాయుధుడు కూడా ఈ దాడుల్లో మరణించలేదని చెప్పారు. గాజాలో ఒక్క సురక్షిత ప్రాంతం కూడా లేదని సందేశం ఇవ్వడమే ఇజ్రాయిల్ లక్ష్యమని విమర్శించారు.

20 వరకూ కేజ్రీవాల్ కస్టడీ పొడిగింపు

న్యూఢిల్లీ : ఢిల్లీ మద్యం పాలసీకు సంబంధించి సిబిఐ అరెస్టు చేసిన కేసులో ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు జ్యుడీషియల్ కస్టడీని ఈ నెల 20 వరకూ రోస్ అవెన్యూ కోర్టు గురువారం పొడిగించింది. తీహార్ జైలులో ఉన్న కేజ్రీవాల్‌ను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టు ముందు ప్రవేశపెట్టారు. ఈ కేసులో సిబిఐ జులై 29న కేజ్రీవాల్‌పై ఛార్జిషీట్ దాఖలు చేసింది. ఈ కేసులో సిబిఐ జూన్ 26న కేజ్రీవాల్‌ను అరెస్టు చేసింది. ఢిల్లీ మద్యం పాలసీకి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఇడి మార్చిలో కేజ్రీవాల్‌ను అరెస్టు చేయగా, జులై 12న సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్ మంజారు చేసింది. సిబిఐ కేసు, అరెస్టు కారణంగా కేజ్రీవాల్ ఇప్పటికీ తీహార్ జైలులో ఉన్నారు.

హిజాబ్‌పై నిషేధంపై నేడు సుప్రీం విచారణ

న్యూఢిల్లీ : కాలేజీ క్యాంపెస్‌లో హిజాబ్‌ను నిషేధించడాన్ని సమర్థిస్తూ బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పుపై శుక్రవారం సుప్రీంకోర్టు విచారించనుంది. డ్రెస్ కోడ్‌పై మార్గదర్శకాల కారణంగా మైనారిటి కమ్యూనిటికి చెందిన విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని పిటీషనర్లు చేసిన వాదనను ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం పరిశీలించింది. త్వరలో టర్మ్ పరీక్షలు ప్రారంభమవుతున్న కారణంగా ఈ పిటీషన్‌ను అత్యవసరంగా విచారించాలనే వాదనను కూడా అంగీకరించింది. శుక్రవారం విచారణ చేస్తున్నట్లు ధర్మాసనం తెలిపింది. కాలేజీ ప్రాంగణంలో హిజాబ్‌ను నిషేధిస్తూ చెంబూర్ ట్రాంబే ఎడ్యుకేషన్ సొసైటీ తీసుకున్న నిర్ణయాన్ని సమర్థిస్తూ జూన్ 26న బాంబే హైకోర్టు తీర్పు ఇచ్చింది. సొసైటీ నిర్ణయంలో జోక్యం చేసుకోవడానికి నిరాకరించింది.

అల్లర్లను నియంత్రణకు చర్యలు : బ్రిటన్ ప్రధాని

సోలిహుల్ : ముస్లింలు, వలసదారులను లక్ష్యంగా చేసుకుని దేశంలో కొన్ని రోజులుగా కొనసాగుతున్న అల్లర్లను నియంత్రించడానికి ఏ అవకాశాన్నీ వదులుకోమని, అల్లర్లను నియంత్రించడానికి అన్ని చర్యలూ తీసుకుంటామని బ్రిటన్ ప్రధానమంత్రి కైర్ స్టార్మర్ స్పష్టం చేశారు. ఇంగ్లండ్‌లోని సోలిహుల్ పట్టణంలోని ఒక మసీదును ప్రధానమంత్రి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాడులకు పాల్పడ్డవారిని ఉపేక్షించబోమని చెప్పారు. జూలై 29న ఇంగ్లండ్‌లోని సౌత్‌పోర్ట్‌లో ఒక కత్తిదాడిలో ముగ్గురు యువతులు మరణించిన తరువాత దేశంలో వరుస అల్లర్లు ప్రారంభమయ్యాయి. దాడికి పాల్పడింది ఒక ముస్లిం యువకుడంటూ ప్రచారమైన తప్పుడు వార్త అల్లర్లకు కారణమైంది. ప్రజలు ఐక్యంగా ఉండి ఈ అల్లర్లను అడ్డుకున్నారని లండన్ మెట్రోపాలిటన్ పోలీస్ కమిషనర్ మార్క్ రౌలీ తెలిపారు. పోలీసు శక్తి, వివిధ కమ్యూనిటీల మధ్య ఐక్యతే అల్లర్లను నిలువరించిందని భావిస్తున్నట్లు రౌలీ చెప్పారు.

ఉపాధ్యాయుడి నుంచి సిఎం వరకూ
బుద్ధదేవ్ ప్రస్థానం



- సాహిత్యంలోనూ విశేష కృషి

ప్రజాశక్తి-కొల్‌కతా

బుద్ధదేవ్ భట్టాచార్య పశ్చిమ బెంగాల్ రాష్ట్ర అభివృద్ధికి, అభ్యుదయ ఉద్యమాలకు ఎన్నో సేవలందించారు. 1944 మార్చి 1వ తేదీన ఉత్తర కోల్‌కతాలోని బెంగాలీ బ్రాహ్మణ కుటుంబంలో బుద్ధదేవ్ జన్మించారు. శైలేంద్ర సర్కార్ విద్యాలయలో విద్యనభ్యసించి, కోల్‌కతా ప్రెసిడెన్సీ కళాశాలలో బెంగాలీ సాహిత్యాన్ని అధ్యయనం చేశారు. బెంగాలీ (ఆనర్స్)లో బిఎ డిగ్రీ పొందారు. డమ్‌డమ్‌లోని ఆదర్శ్ షంకా విద్యామందిర్‌లో కొంతకాలం ఉపాధ్యాయుడిగా చేశారు. అనంతరం 1966లో రాజకీయాలకు పూర్తిగా అంకితమై సిపిఐ (ఎం)లో చేరారు. బుద్ధదేవ్‌లోని నాయకత్వ లక్షణాలను గుర్తించిన నేత ప్రమోద్ దాస్‌గుప్తా. బెంగాల్‌లో బిమన్ బోస్, అనిల్ బిశ్వాస్, సుభాష్ చక్రవర్తి, శ్యామల్ చక్రవర్తి వంటి నేతలతో పాటు బుద్ధదేవ్‌కు కూడా ఆయన రాజకీయ గురువుగా వ్యవహరించారు. 1968 జూన్‌లో డివైఎఫ్ బెంగాల్ రాష్ట్ర కార్యదర్శిగా ఎంపికయ్యారు. 1971లో సిపిఐ (ఎం) రాష్ట్ర కమిటీ సభ్యుడుగా, 1982లో పార్టీ కార్యదర్శివర్గ సభ్యుడిగా పనిచేశారు. 1984లో కేంద్ర కమిటీకి శాశ్వత ఆహ్వానితుడిగా నియమితులయ్యారు. 1985లో కేంద్ర కమిటీ సభ్యుడిగా, 2000వ సంవత్సరంలో పొలిట్‌బ్యూరో సభ్యుడిగా పనిచేశారు.

చట్టసభలో ప్రవేశం

1977లో తొలిసారి కొస్సిపూర్ నియోజకవర్గం నుండి శాసనసభకు ఎన్నికయ్యారు. 33 సంవత్సరాల వయసులో, జ్యోతిబసు నేతృత్వంలో ఏర్పడిన తొలి వామపక్ష ప్రభుత్వంలో సమాచార, ప్రజా సంబంధాల శాఖ మంత్రిగా పనిచేశారు. 1982 ఎన్నికలలో ఓటమి పాలైన బుద్ధదేవ్, 1987లో జాదవ్‌పూర్ నియోజకవర్గం నుండి గెలుపొంది తిరిగి సమాచార, సాంస్కృతిక శాఖ మంత్రిగా రాష్ట్ర క్యాబినెట్‌లో చేరారు. 1993లో మంత్రి పదవికి రాజీనామా చేశారు. 1996లో హోం మంత్రిత్వ శాఖ బాధ్యతలు స్వీకరించారు. ఆ తర్వాత మూడు సంవత్సరాలకే... అంటే 1999లో ఉప ముఖ్యమంత్రి అయ్యారు.

సిఎంగా ఎనలేని సేవలు

2000 నుండి 2011 వరకూ పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి ఏడవ ముఖ్యమంత్రిగా బుద్ధదేవ్ సేవలందించారు. 2000వ సంవత్సరం నవంబరులో జ్యోతిబసు స్థానంలో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 2001 ఎన్నికల్లో లెఫ్ట్‌ఫ్రంట్‌కు నాయకత్వం వహించి ఎన్నికల్లో ఘన విజయం సాధించి పెట్టారు. ఆయన తన హయాంలో రాష్ట్రానికి పెట్టుబడులు రప్పించేందుకు ఎనలేని కృషి చేశారు. 2006 ఎన్నికల్లో వామపక్ష కూటమి విజయం సాధించడంతో మళ్లీ ముఖ్యమంత్రి అయ్యారు. పారిశ్రామికీకరణ కోసం అలుపెరుగని కృషి చేసిన బుద్ధదేవ్‌కు 'బ్రాండ్ బుద్ధ' అనే పేరు వచ్చింది. వయోభారం కారణంగా బుద్ధదేవ్ 2015లో సిపిఐ (ఎం) పొలిట్‌బ్యూరో నుండి, కేంద్ర కమిటీ నుండి తప్పుకున్నారు. ఆ తర్వాత మూడు సంవత్సరాలకు పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యత్వాన్ని వదులుకున్నారు. గత కొంతకాలంగా అనారోగ్యం కారణంగా ఆయన ప్రజల్లోకి రావడం లేదు. దక్షిణ కోల్‌కతాలోని పామ్ అవెన్యూలో రెండు గదుల ప్రభుత్వ ఫ్లాటులోనే కాలం గడిపారు. 2019 లోక్‌సభ ఎన్నికల సమయంలో ఆయన చిట్టచివరిసారిగా ప్రజల ముందుకు వచ్చి అందరినీ ఆశ్చర్యపరిచారు. బ్రిగేడ్ పరేడ్ మైదానంలో జరిగిన లెఫ్ట్ ఫ్రంట్ ర్యాలీకి ఆక్సిజన్ సాయంతో వచ్చి పార్టీ కార్యకర్తలను ఉత్తేజపరిచారు.



ఎకె గోపాలన్ భవన్‌లో బుద్ధదేవ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు

బుద్ధదేవ్ 60వ దశకం చివరలో వియత్నాం సంఘీభావ కమిటీలో ముఖ్య భూమిక పోషించారు. సైగన్ (హోచిమిన్ సిటీ) విముక్తి తర్వాత ప్రసిద్ధి చెందిన లే డక్ తో కవితను 1975లో అనువదించారు. హోచిమిన్ శత జయంతి ఉత్సవాల సందర్భంగా వియత్నాంలో పర్యటించారు. ప్రమోద్ దాస్‌గుప్తాతో పాటు 1982లో చైనాను సందర్శించారు. తన జీవితంలో ఎన్నో విజయాలు, అపజయాలు ఎదురైనప్పటికీ స్థితప్రజ్ఞతతో ముందుకు సాగిన బుద్ధదేవ్ తుదిశ్వాస విడిచే వరకూ ప్రజల బాగోగుల కోసమే తపించారు. బెంగాల్ అభివృద్ధి కోసం ఆయన చేసిన కృషి ఎప్పటికీ గుర్తుండిపోతుంది.

విలువలతో కూడిన రాజకీయాలకు నిలువెత్తు నిదర్శనం
రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

పార్టీలకు అతీతంగా పలువురు నేతలు బుద్ధదేవ్ మృతికి సంతాపం వ్యక్తం చేశారు. బుద్ధదేవ్ విలువలతో కూడిన రాజకీయాలకు నిలువెత్తు నిదర్శనమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కొనియాడారు. బెంగాల్ ప్రజల సంక్షేమం కోసం ఆయన చేసిన కృషి చిరకాలం గుర్తుంటుందని తెలిపారు. బుద్ధదేవ్ రాష్ట్రానికి అంకితభావంతో సేవలు అందించారని ప్రధాని మోడీ కొనియాడారు. రాష్ట్రాభివృద్ధికి సుదీర్ఘకాలం పాటు సేవలందించారని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఎక్స్‌లో పేర్కొన్నారు.

ఎకె గోపాలన్ భవన్‌లో నివాళి

ఢిల్లీలోని సిపిఎం కేంద్ర కార్యాలయం ఎకె గోపాలన్ భవన్‌లో బుద్ధదేవ్ భట్టాచార్య చిత్రపటానికి సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాష్ కరత్, బృందాకరత్, ఎంఎ బేబీ నివాళులర్పించారు. పార్టీ కోసం, ప్రజల కోసం ఆయన అంకితభావంతో కృషి చేశారని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఎక్స్‌లో పేర్కొన్నారు. ఆయనతో అభిప్రాయాలు పంచుకున్నానని, ఆయన ఎంతో సమర్ధవంతంగా బహుముఖ సేవలందించారని గుర్తు చేసుకున్నారు.

ప్రముఖుల సంతాపం

బుద్ధదేవ్ నివాసానికి పలువురు ప్రముఖులు వెళ్లి, ఆయన భౌతికకాయాన్ని సందర్శించి, నివాళులర్పించారు. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, గవర్నర్ సివి ఆనంద్‌బోస్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ సలీం, సీనియర్ నేత బిమన్ బోస్, ప్రతిపక్ష నేత సువేందు అధికారి, కాంగ్రెస్ నాయకులు మల్లికార్జున ఖర్గే, అధిర్ రంజన్ చౌదరి తదితరులు పామ్ అవెన్యూలోని ఆయన నివాసానికి వెళ్లి, నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. బుద్ధదేవ్ మృతి పట్ల పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ విచారం వ్యక్తం చేశారు. ఆయన మరణం తనను దిగ్భ్రాంతికి గురిచేసిందని తెలిపారు. బుద్ధదేవ్ మృతికి సంతాప సూచకంగా గురువారం సెలవు ప్రకటించారు. 'నాకు ఆయన చాలా దశాబ్దాల నుండి తెలుసు. అనారోగ్యంతో బాధపడుతున్నప్పుడు ఇంటికి వెళ్లాను. బుద్ధదేవ్ కుటుంబ సభ్యులకు, సిపిఎం సభ్యులు, మద్దతుదారులు, అనుచరులకు సంతాపం తెలుపుతున్నాను' అని సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. బెంగాల్ గవర్నర్ సివి ఆనంద బోస్ కూడా బుద్ధదేవ్ మృతికి సంతాపం తెలిపారు. బుద్ధదేవ్ మరణవార్త తనను కలచివేసిందని బెంగాల్ ప్రతిపక్ష నేత, బిజెపి ఎమ్మెల్యే సువేందు అధికారి చెప్పారు.

త్రిపుర మాజీ సిఎం మాణిక్ సర్కార్, ఇతర త్రిపుర నేతల సంతాపం

త్రిపుర మాజీ ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. సుదీర్ఘకాలంగా వివిధ రంగాల్లో పలు వేదికలపై ఆయనతో కలిసి పనిచేసిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్ సాహా, త్రిపుర అసెంబ్లీలో ప్రతిపక్ష నేత జితేంద్ర చౌదరి కూడా సంతాపం వ్యక్తం చేశారు. బెంగాల్ చలన చిత్ర పరిశ్రమ సంతాపం ప్రకటించింది. చలన చిత్ర రంగ ప్రముఖులు, వాణిజ్యరంగ ప్రముఖులు సంతాపం తెలిపారు.

రెడ్ శాల్యూట్ కామ్రేడ్
తమిళనాడు సిఎం స్టాలిన్ సంతాపం

'రెడ్ సెల్యూట్ కామ్రేడ్' అంటూ తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ బుద్ధదేవ్ మృతికి సంతాపం తెలిపారు. ఆయన సాధించిన విజయాలు, సాహితీ రంగంలో అందించిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. ఆయన నాయకత్వం, ప్రజల పట్ల ఆయనకు గల నిబద్ధత భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు, పార్టీకి, కార్యకర్తలకు ఈ విషాద సమయంలో సానుభూతి తెలియజేస్తున్నానని అన్నారు.

ఒరిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి, ప్రతిపక్ష బిజెడి నేత నవీన్ పట్నాయక్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. భారత రాజకీయాల్లో ఆయన ముద్ర ఎప్పటికీ గుర్తుండిపోతుందని సిఎం వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు పెట్టారు.

ప్రజా సేవలో తనదైన చెరిగిపోని ముద్ర వేసుకున్న నేత బుద్ధదేవ్ భట్టాచార్య అని అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ కొనియాడారు. ఆయన మృతికి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన నిరాడంబరత, సాహత్య రంగానికి చేసిన ఎనలేని సేవలు, ప్రజా సేవ పట్ల నిబద్ధత ఇవన్నీ ఎప్పటికీ గుర్తుండిపోతాయన్నారు.



బుద్ధదేవ్ భౌతికకాయాన్ని పీస్‌వరల్డ్‌కు తీసుకువెళ్తున్న దృశ్యం (ఇన్‌సెట్‌లో భౌతికకాయం)



బ్రిగేడ్ ర్యాలీలో జ్యోతిబసుతో బుద్ధదేవ్

నిబద్ధత కలిగిన నేత
బుద్ధదేవ్ భట్టాచార్యకు సిపిఎం విప్లవాంజలి

న్యూఢిల్లీ : సిపిఎం నేత, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి కామ్రేడ్ బుద్ధదేవ్ భట్టాచార్య మృతి పట్ల సిపిఎం పొలిట్‌బ్యూరో తీవ్ర విచారాన్ని వ్యక్తం చేసింది. ఆయన వయసు 80సంవత్సరాలు, కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు.

1966లో తన విద్యార్థి దశలోనే బుద్ధదేవ్ పార్టీలో చేరారు. విద్యార్థి, యువజన ఉద్యమాల్లో, వివిధ పోరాటాల్లో ఆయన పాల్గొన్నారు. 1968లో పశ్చిమ బెంగాల్ డెమొక్రటిక్ యూత్ ఫెడరేషన్ (డివైఎఫ్) రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశారు. 1971లో పార్టీ బెంగాల్ రాష్ట్ర కమిటీకి ఎన్నికయ్యారు. 1982లో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడయ్యారు. ఈ కాలంలో బుద్ధదేవ్ చాలా కీలక నేతగా ఆవిర్భవించారు. నిబద్ధత గల కార్యకర్తగా వివిధ బాధ్యతలు చేపట్టారు.

1985లో పార్టీ 12వ మహాసభలో బుద్ధదేవ్ కేంద్ర కమిటీ సభ్యుడయ్యారు. 2000 సంవత్సరంలో పొలిట్‌బ్యూరోకు ఎన్నికై 2015 వరకు కొనసాగారు. పార్టీ విధానాల రూపకల్పనలో ఆయన విశేషమైన, కీలకమైన సేవలందించారు.

వామపక్ష సంఘటన ప్రభుత్వంలో దాదాపు మూడు దశాబ్దాల పాటు మంత్రిగా, ముఖ్యమంత్రిగా బుద్ధదేవ్ విశిష్ట పాత్ర పోషించారు. 2000 నవంబరులో జ్యోతిబసు వారసుడిగా ముఖ్యమంత్రి పదవినధిష్ఠించారు. ఆ తర్వాత కూడా రెండు పదవీకాలాలు ముఖ్యమంత్రిగా చేశారు. ఆ రకంగా వామపక్ష సంఘటన ప్రభుత్వ విధానాల రూపకల్పనలో కీలక పాత్ర పోషించారు.

సాంస్కృతిక సంస్థల అభివృద్ధికి, ప్రగతిశీల సాంస్కృతిక విలువలను కొనసాగించడానికి బుద్ధదేవ్ గణనీయమైన రీతిలో కృషి చేశారు. సాహిత్యం అంటే ఆయనకు వల్లమాలిన అభిమానం. ఆయన స్వయంగా కవి, నాటక రచయిత కూడా. అనేక అంతర్జాతీయ సాహితీ రచనలను బెంగాలీలోకి అనువదించారు. చైనాలో వస్తున్న మార్పులపై ఆయన విస్తృతంగా రాశారు. ఈ అంశంపై ఒక పుస్తకాన్ని కూడా ప్రచురించారు. అంకితభావం కలిగిన కమ్యూనిస్టుగా బుద్ధదేవ్ నిరాడంబరమైన జీవితాన్ని కొనసాగించారు. ముఖ్యమంత్రిగా వున్నప్పుడు, తర్వాత కూడా ఆయన రెండు గదుల అపార్ట్‌మెంట్‌లోనే నివసించారు. ఆయన కన్నుమూతతో పశ్చిమ బెంగాల్ కమ్యూనిస్టు, వామపక్ష ఉద్యమంలో ఒక అధ్యాయం ముగిసిపోయిందని పొలిట్‌బ్యూరో పేర్కొంది. ఆయన స్మృత్యర్థం పొలిట్‌బ్యూరో విప్లవాంజలి ఘటించింది. ఆయన భార్య మీరా, కుమారుడు సుచేతన్‌లకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసింది.

ఐద్వా నివాళులు

బుద్ధదేవ్ భట్టాచార్య మృతికి ఐద్వా తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. బుద్ధదేవ్ భార్య, కుమారులకు ఇతర కుటుంబ సభ్యులకు ఐద్వా తీవ్ర సానుభూతిని తెలియజేసింది. బడుగు, అట్టడుగు వర్గాల ప్రజల కోసం పనిచేసే పంథాను ఎంచుకున్న ఆయన జీవితాంతం ఆ విలువలకే కట్టుబడ్డారని పేర్కొంది.

ఎఐకెఎస్ సంతాపం

ఆరు దశాబ్దాల పాటు పార్టీకి అంకిత భావంతో పనిచేసిన నేత బుద్ధదేవ్ భట్టాచార్య మృతికి అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) అధ్యక్ష కార్యదర్శులు అశోక్ ధావలె, విజూ కృష్ణన్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియచేశారు. ఎఐకెఎస్ అఖిల భారత మహాసభల్లో, ర్యాలీల్లో ముఖ్య వక్తగా ఆయన చేసిన ప్రసంగాలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని వారు పేర్కొన్నారు. లాటిన్ అమెరికా నోబెల్ బహుమతి గ్రహీత గార్సియా మార్క్వెజ్, ప్రముఖ సోవియట్ కవి వ్లాదిమిర్ మయాకొవ్‌స్కీ వంటి ప్రముఖుల ముఖ్యమైన రచననలను బెంగాలీలోకి అనువదించిన ఆయన మంచి రచయిత, అనువాదకుడని పేర్కొన్నారు. బుద్ధదేవ్ భట్టాచార్య మృతికి సిపిఎం జమ్మూ కాశ్మీర్ రాష్ట్ర కమిటీ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేసింది. కార్మికోద్యమంలో ఎల్లప్పుడూ అగ్ర భాగాన నిలిచి పోరాడిన బుద్ధదేవ్ మంచి మేధావి, రచయిత అని నిస్వార్ధమైన రాజకీయ నేత అని కొనియాడింది.

కేరళ సిఎం విజయన్ సంతాపం

బుద్ధదేవ్ మృతికి కేరళ ముఖ్యమంత్రి విజయన్ తీవ్ర విచారాన్ని వ్యక్తం చేశారు. సిపిం కేంద్ర కమిటీలో, పొలిట్‌బ్యూరోలో ఆయనతో కలిసి పనిచేసే అవకాశం తనకు దక్కిందని విజయన్ పేర్కొన్నారు. 1970వ దశకంలో పశ్చిమ బెంగాల్‌లో సెమీ ఫాసిస్ట్, నిరంకుశవాద పాలనకు వ్యతిరేకంగా సాగిన కమ్యూనిస్టుల ప్రతిఘటనలో భట్టాచార్య అగ్ర భాగాన నిలిచారని గుర్తు చేసుకున్నారు.

7.1తీవ్రతతో జపాన్‌లో భూకంపం..

- సునామీ హెచ్చరికలు జారీ

టోక్యో : జపాన్ దక్షిణ తీరంలో గురువారం భూకంపం సంభవించింది. దీంతో సునామీ హెచ్చరికలు జారీ చేసినట్లు జపాన్ వాతావరణ సంస్థ పేర్కొంది. రిక్టర్ స్కేలుపై భూకంప తీవ్రత 7.1గా నమోదు కాగా, జపాన్‌లోని దక్షిణ ప్రధాన ద్వీపం క్యుషు తూర్పు తీరంలో సుమారు 30కి.మీ (18.6మైళ్లు) లోతులో భూకంప కేంద్రం ఉన్నట్లు వాతావరణ కేంద్రం ప్రకటించింది.

క్యుషు దక్షిణ తీరం, సమీపంలోని షికోకు ద్వీపం వెంబడి 1మీ (3.3) అడుగుల ఎత్తుకు అలలు ఎగిసి పడే అవకాశం ఉందని .. దీంతో సునామీ హెచ్చరికలు జారీ చేసినట్లు తెలిపింది. పసిఫిక్ రింగ్ ఆఫ్ ఫైర్‌పై ఉండటంతో జపాన్‌లో భూకంపాలు సర్వసాధారణమని జపాన్ వాతావరణ కేంద్రం తెలిపింది. భూకంపంతో క్యుషు మరియు షికోలులోని అణు ప్లాంట్‌లలో ఏమైనా నష్టం సంభవించిందా లేదా అని పరిశీలిసున్నట్లు నిపుణులు తెలిపారు. జపాన్‌లోని ఉత్తర మధ్య ప్రాంతం నోట్ ఈ ఏడాది ప్రారంభంలో (జనవరి1)న సంభవించిన భూకంపంలో 240 మందికి పైగా మరణించిన సంగతి తెలిసిందే.

సునీతా విలియమ్స్ రాక మరింత ఆలస్యం?

వాషింగ్టన్ : వ్యోమనౌకలో సాంకేతిక లోపం కారణంగా అంతరిక్షంలో చిక్కుకున్న వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్‌మోర్ మరి కొన్ని నెలల పాటు అక్కడే ఉండాల్సి వస్తుందని నాసా తాజాగా వెల్లడించింది. మూడోసారి రోదసిలోకి వెళ్లిన భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్ మరో ఎనిమిది నెలల పాటు అంటే వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు ఆమె అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోనే ఉండనున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు నాసా తాజాగా ఓ ప్రకటన విడుదల చేసింది. 8 రోజుల మిషన్‌లో భాగంగా సునీత, విల్‌మోర్ జూన్ 6న బోయింగ్ స్టార్‌లైనర్ క్యాప్సుల్‌లో అంతరిక్ష కేంద్రానికి వెళ్లారు. వాస్తవానికి జూన్ 14వ తేదీన వీరిద్దరూ భూమికి తిరుగుపయనం కావాల్సి ఉండగా.. వ్యోమనౌకలో హీలియం లీకేజీ కారణంగా సాంకేతిక సమస్యలు ఎదురయ్యాయి. "బోయింగ్ స్టార్‌లైనర్ తిరిగి భూమ్మీద ల్యాండ్ అయ్యేందుకు సురక్షితంగా లేకపోతే.. వ్యోమగాములను తీసుకొచ్చేందుకు ఎంచుకున్న ఆప్షన్లలో ఒకటి 2025 ఫిబ్రవరిలో ఉంది. అది కూడా స్పేస్‌ఎక్స్ క్రూ డ్రాగన్ వ్యోమనౌకతో.." అని నాసా పేర్కొంది.

వినేష్ ఫొగాట్ అనర్హతపై ప్రతిపక్షాలు వాకౌట్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఒలింపిక్స్‌లో వినేష్ ఫొగాట్ అనర్హత అంశాన్ని లేవనెత్తడానికి రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ అనుమతించకపోవడంతో ప్రతిపక్షాలు వాకౌట్ చేశాయి. ప్రతిపక్షాల తీరు సరికాదంటూ ఆయన కూడా వాకౌట్ చేశారు. పారిస్ ఒలింపిక్స్‌లో రెజ్లర్ వినేష్‌ను అనర్హురాలిగా ప్రకటించిన అంశంలో రాజకీయ కుట్ర ఉన్నదని, దానిపై చర్చ చేపట్టాలని గురువారం రాజ్యసభలో ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. జగదీప్ ధనకర్, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో, ఆయన కొంత అసహనానికి గురయ్యారు. ఆయన తన చైర్ నుంచి లేచి.. సభ్యులకు దండం పెట్టి, సభ నుంచి బయటకు వెళ్లిపోయారు. సాధారణంగా ప్రతిపక్షాలు వాకౌట్ చేస్తుంటే, చైర్‌లో కూర్చుండే చైర్మన్ జగదీప్.. గురువారం ప్రతిపక్ష సభ్యులపై తన ఆక్రోశాన్ని చూపించారు. కాంగ్రెస్ ఎంపి జైరాం రమేష్ నవ్వుతున్న తీరును ధన్‌ఖర్ తప్పుపట్టారు. నీ ప్రవర్తన నాకు తెలుసన్నారు. చైర్ పట్ల గౌరవం లేకుండా వ్యవహరిస్తున్నారని అన్నారు. తనను కాదు.. చైర్‌పర్సన్ పోస్టును ఛాలెంజ్ చేస్తున్నారని, చైర్‌లో కూర్చున్న వ్యక్తి సమర్థుడు కాడన్న ఉద్దేశంతో ప్రతిపక్ష సభ్యులు వ్యవహరిస్తున్నట్లు ధన్‌ఖర్ ఆరోపించారు. జైరాం రమేష్ దిక్కుకు చూస్తూ.. ఇప్పుడు తనకు ఆప్షన్ లేదని, ఈరోజు జరుగుతున్న పరిణామాలను గమనిస్తుంటే, ఇక్కడ కూర్చునే పొజిషన్‌లో తాను లేనట్లు అనిపిస్తోందని జగదీప్ తెలిపారు. ఆ తరువాత లేచి నిలబడ్డ ఆయన, చేతులు జోడించి దండం పెట్టి, సభ నుంచి వాకౌట్ చేశారు. మళ్లీ కాసేపయ్యాక వచ్చిన ధన్‌ఖర్.. సభలో వాతావరణం ఆమోదయోగ్యంగా లేదన్నారు. తనకు తాను ఆత్మపరిశీలన చేసుకున్నానని, ఆ తరువాతే ఫ్లోర్ లీడర్ల భేటీకి పిలుపునిచ్చినట్లు చెప్పారు. ఫొగాట్‌పై వేటు పడడానికి కారణం ఏంటో తెలియాలని ప్రతిపక్షనేత మల్లికార్జున్ ఖర్గే డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి జెపి నడ్డా మాట్లాడుతూ "దేశం మొత్తం వినేష్‌కు అండగా నిలుస్తోంది. దురదృష్టవశాత్తు, దీనిని అధికార, ప్రతిపక్షాల మధ్య విభజిస్తున్నారు" అని అన్నారు.



ఉల్లి ధరలు పెరుగుదలపై ఆందోళన చేస్తున్న ప్రతిపక్ష సభ్యులు

ఉల్లి ధరలు పెరుగుదలపై ఆందోళన

దేశంలో ఉల్లి, కూరగాయల ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా పార్లమెంట్ ముఖద్వారం వద్ద ప్రతిపక్షాలు ఆందోళన చేపట్టాయి. ప్రతిపక్ష ఎంపిలు గురువారం పార్లమెంటు వెలుపల నిరసన చేపట్టారు. ఉల్లిపాయల దండలు మెడలో వేసుకుని వినూత్న నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఉల్లిధర తగ్గించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆర్‌జెడి ఎంపి మనోజ్ ఝా మాట్లాడుతూ 'ప్రభుత్వం మద్దతు ధరపై చట్టపరమైన హామీ ఇవ్వడం చాలా పెద్ద సమస్య. మరోవైపు పార్లమెంటులో క్రీడాకారుల(అథ్లెట్లు)పై చేసిన ఖర్చుల లెక్కలు చెప్పేటప్పుడు మాత్రం ప్రభుత్వం సిగ్గుపడదు. ప్రధానమంత్రి, క్యాబినెట్ మంత్రుల కోసం పన్ను చెల్లింపుదారుల డబ్బు ఎంత ఖర్చవుతుందో ప్రభుత్వం వివరించాలి' అని ఆయన అన్నారు. శివసేన (థాకరే) ఎంపి ప్రియాంక చతుర్వేది మాట్లాడుతూ రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. కానీ వారి ఆదాయం సంగతి పక్కనబెడితే, వారు పండించిన పంటకు మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. మహారాష్ట్రలో ఉల్లి రైతులు తమ ఉత్పత్తులను ఎగుమతి చేయడానికి అనుమతించకుండా, గుజరాత్ రైతులకు అనుమతిస్తారు. అందుకే మేము నిరసన తెలుపుతున్నాం' అని అన్నారు.

ప్రజాస్వామ్యం పునరుద్ధరిస్తే
హసీనా తిరిగి వస్తారు : సాజీబ్

ఢాకా : బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్యం పునరుద్ధరించబడితే తన తల్లి హసీనా తిరిగి బంగ్లాదేశ్‌కు వస్తారని ఆమె కుమారుడు సాజీబ్ వజిద్ జోయ్ తెలిపారు. అయితే ఒకవేళ వచ్చినా రాజకీయాల నుండి రిటైరవుతారా?లేక క్రియాశీలంగా పనిచేస్తారా? అనేది ఇంకా నిర్ణయం కాలేదన్నారు. బంగ్లాదేశంలో ప్రస్తుతం సాగుతున్న అనిశ్చితికి పాక్ ఐఎస్ఐ ఆజ్యం పోస్తోందని ఆయన విమర్శించారు. తన తల్లికి రక్షణ కల్పించిన భారత్ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాస్వామ్యం పునరుద్ధరించబడి, తాజాగాఎన్నికలు నిర్వహించినప్పుడు తాత్కాలిక ప్రభుత్వం అందుకు అనుకూలమైన వాతావరణం సృష్టించగలదని ఆశిస్తున్నట్లు చెప్పారు. తన దేశంలో నెలకొన్న పరిస్థితులు చూస్తుంటే హృదయం ద్రవిస్తోందని హసీనా కుమార్తె సైమా వజీద్ వ్యాఖ్యానించారు. ఈ కష్ట కాలంలో అమ్మను ఇలా చూడలేకపోతున్నానని అన్నారు.

అవామీ లీగ్ నేతల నిర్బంధం

అవామీ లీగ్‌కి చెందిన ఇద్దరు నేతలు దేశం విడిచి పారిపోవడానికి ప్రయత్నిస్తుండగా సరిహద్దు బలగాలు అదుపులోకి తీసుకున్నాయి. బుధవారం ఉదయం వీరు భారత్‌లోకి ప్రవేశించేందుకు ప్రయత్నిస్తున్న నేపథ్యంలో బోర్డర్ గార్డ్ బంగ్లాదేశ్ (బిజిబి) బలగాలు పట్టుకున్నాయి.

మూడు రోజుల్లో 232 మంది మృతి

ఈ నెల 5న హసీనా ప్రభుత్వం పతనమైన తర్వాత జరిగిన హింస, అల్లర్లలో 232 మంది మరణించారని మీడియా నివేదిక పేర్కొంది. దీంతో ఇప్పటివరకు బంగ్లాదేశ్‌లో చోటు చేసుకున్న నిరసనలు, ఆందోళనల్లో మరణించిన వారి సంఖ్య 560కి చేరింది. దొంగలు, దోపిడీదారులు రెచ్చిపోతుండడంతో యువత బృందాలుగా ఏర్పడి వీధుల్లో గస్తీ తిరుగుతున్నారు.

బంగ్లా దేశీయులు సరిహద్దు పొడవునా వేచివున్నారు : బిఎస్ఎఫ్

వందలాదిమంది బంగ్లాదేశ్ జాతీయులు భారత్ సరిహద్దు పొడవునా వేచి వున్నారని, వారిలో ఎక్కువమంది హిందువులేనని బిఎస్ఎఫ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ అమిత్ కుమార్ త్యాగి తెలిపారు. అవకాశం లభిస్తే సరిహద్దులు దాటి దేశంలోకి రావాలనుకుంటున్నారని అన్నారు.

సరిహద్దు వాణిజ్య కార్యకలాపాలను ఆపేసిన మేఘాలయ

బంగ్లాదేశ్‌లో నెలకొన్న సంక్షుభిత పరిస్థితుల నేపథ్యంలో ఆ దేశంతో గల అంతర్జాతీయ సరిహద్దు పొడవునా గల ట్రేడింగ్ పోస్ట్‌ల కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపివేసినట్లు మేఘాలయ ప్రభుత్వం తెలిపింది. బంగ్లా జాతీయులు, నిషిద్ధ మిలిటెంట్ గ్రూపులు, స్మగ్లర్లు సరిహద్దులు దాటే అవకాశం వుందని, ఇతర అనధికార కార్యకలాపాలు జరగవచ్చని ఇంటెలిజెన్స్ సమాచారం అందడంతో సరిహద్దు భద్రతా బలగాలు, రాష్ట్ర పోలీసులు గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు.



యూనస్ ప్రమాణాస్వీకారానికి హాజరైన ప్రజలు

సామాజిక కార్యకర్త నుండి ప్రభుత్వ సారథిగా...

సామాజిక కార్యకర్త, బ్యాంకర్, ఆర్థికవేత్త అయిన మహ్మద్ యూనస్ 1940లో చిట్టగాంగ్‌లో జన్మించారు. ఆయన చిట్టగాంగ్ యూనివర్శిటీలో ఎకానమీ ప్రొఫెసర్‌గా పనిచేశారు. మైక్రో ఫైనాన్స్ బ్యాంక్ ద్వారా లక్షలాదిమంది ప్రజలను పేదరికం నుండి బయటపడవేసేందుకు కృషి చేశారు. దీనిపైనే 2006లో ఆయన నోబెల్ శాంతి బహుమతిని, అనేక ప్రతిష్టాత్మక అవార్డులను పొందారు.

దళిత సమస్యలపై పోరు

- రాష్ట్ర అసెంబ్లీ, గవర్నర్ల కార్యాలయాలకు మార్చ్
- సెప్టెంబరు 15 నుంచి 30 వరకు ఆందోళన
- దళిత హక్కుల సమన్వయ కమిటీ పిలుపు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై దేశవ్యాప్త పోరుకు దళిత హక్కుల సమన్వయ కమిటీ సిద్ధమైంది. ఈ మేరకు గురువారం నాడిక్కడ స్థానిక ఎపి, తెలంగాణ భవన్‌లో దళిత హక్కుల సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో దళిత హక్కుల సమన్వయ కమిటీ నేతలు సుభాషిణి అలీ (డిఎస్ఎంఎం), మల్లేపల్లి లక్ష్మయ్య (సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్), బి వెంకట్, విక్రమ్ సింగ్ (ఎఐఎడబ్ల్యుయు), విఎస్ నిర్మల్ (ఎఐడిఆర్ఎం), ధీరేంద్ర ఝా (ఎఐఎఆర్ఎల్ఎ), గుల్జార్ సింగ్ గోరియా (బికెఎంయు) తదితరులు మాట్లాడారు. తొలుత సుభాషిణి అలీ మాట్లాడుతూ.. బడ్జెట్ కేటాయింపుల్లో దళితులకు జరుగుతున్న అన్యాయం, 2014లో బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దళితులపై జరుగుతున్న అకృత్యాలపై చర్చ జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం దళితుల రాజ్యాంగ హక్కులను ఉల్లంఘించడంపై ఆందోళన వ్యక్తం చేసినట్లు తెలిపారు. ఈ సమావేశం కొన్ని ముఖ్యమైన డిమాండ్లను లేవనెత్తిందని, రాజ్యాంగ, దళితుల భద్రత, ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు, జనాభాకు అనుగుణంగా బడ్జెట్ కేటాయింపులు, ప్రమోషన్లలో రిజర్వేషన్లు, అంటరానితనానికి వ్యతిరేకంగా ఉద్యమం చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. దీర్ఘకాలిక సామాజిక ఉద్యమాలతో దళితుల సామాజిక, ఆర్థిక, రాజకీయ హక్కులను పరిరక్షించడమే తమ లక్ష్యమన్నారు. ప్రజాస్వామ్యవాదులు, బ్యూరోక్రాట్లు, ఇతరులతో పాటు ఇలాంటి డిమాండ్ల కోసం పనిచేస్తున్న అన్ని సంఘాలూ ఈ రాజ్యాంగ, ప్రజాస్వామ్య ఉద్యమంలో పాల్గొనాలని కోరారు. సమస్యల పరిష్కారానికి ప్రత్యేక పార్లమెంటు సమావేశాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

సామాజికంగా గుర్తింపు లేని దళితులకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించడమే సబ్‌ప్లాన్ ఉద్దేశమని, అయితే ప్రభుత్వం ఈ నిధులను దళితుల ప్రత్యేక కార్యక్రమాలకు ఖర్చు చేయకుండా, సాధారణ కార్యక్రమాలకు మళ్లిస్తోందని విమర్శించారు. అనేక ఏళ్లుగా వివిధ సంఘాల నిరంతర కృషి కారణంగా కొన్ని రాష్ట్రాలు ఎస్‌సి సబ్‌ప్లాన్ చట్టాన్ని అమలు చేశాయని, కాని కేంద్ర ప్రభుత్వం ఎస్‌సి సబ్‌ప్లాన్ చట్టాన్ని అమలు చేయడానికి, సబ్‌ప్లాన్ నిధులను సరిగ్గా కేటాయించడానికి సిద్ధంగా లేదని విమర్శించారు. కావున పార్లమెంటు సమావేశంలో ఎస్‌సి సబ్‌ప్లాన్ కోసం చట్టం ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. బిజెపి ప్రభుత్వం కోర్టులో రిజర్వేషన్లను సమర్ధవంతంగా సమర్థించడంలో విఫలమైందని, వాటిని అమలు చేయనందుకు తరచూ కోర్టును సాకుగా చూపుతోందని దుయ్యబట్టారు. మల్లేపల్లి లక్ష్మయ్య మాట్లాడుతూ.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 15, 16, 17 దళితులకు అంటరానితనం నుండి నిర్దిష్ట రక్షణలను అందిస్తాయని, కాని స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్లు గడుస్తున్నా.. దళితులు అంటరానివారిగానే కొనసాగుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రభుత్వాలు ప్రైవేటీకరించడం దళితుల ప్రయత్నాలను బలహీనపరుస్తుందని, ప్రభుత్వం ప్రైవేటీకరణను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు ప్రవేశపెట్టాలని, వీలైనంత త్వరగా ఈ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. బి వెంకట్ మాటాడుతూ.. దేశంలో వ్యవసాయోత్పత్తి ఎక్కువగా గ్రామాల్లో వ్యవసాయ కూలీలుగా పనిచేసే దళితులపైనే ఆధారపడి ఉందని, ఏటా 30 కోట్ల మెట్రిక్ టన్నుల వ్యవసాయ ఉత్పత్తులను ఉత్పత్తి చేయడంలో దళితులు, వ్యవసాయ కూలీలు, కౌలు రైతులతో పాటు ప్రధాన స్తంభాలుగా ఉన్నారని తెలిపారు. ఇంత జరిగినా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని అన్నారు. బిజెపి ప్రభుత్వ హయాంలో కుల ఆధారిత దౌర్జన్యాలు పెరిగాయని, వీటిని ఇప్పుడు ప్రభుత్వ స్పాన్సర్డ్‌గా భావిస్తున్నారని విమర్శించారు. దళితులపై నేరాలకు పాల్పడుతున్న వారికి మోడీ ప్రభుత్వం రక్షణ కల్పిస్తోందని, దళితులకు భూ పంపిణీ, రాజ్యాంగ పరిరక్షణ, ఇళ్ల స్థలాలు, ఉపాధి కల్పించాల్సిన ఆవశ్యకతను చర్చించినట్లు తెలిపారు.

నీరజ్‌కు రజతం

- రెండో ప్రయత్నంలో 89.45మీ. విసిరి రెండోస్థానం
- పాకిస్తాన్‌కు 1992 తర్వాత ఒలింపిక్స్‌లో తొలి స్వర్ణం


నదీమ్ అర్షద్


నీరజ్ చోప్రా

పారిస్: ఒలింపిక్స్‌లో నీరజ్ చోప్రా మరోసారి మెరిసాడు. టోక్యోలో స్వర్ణ పతకం నెగ్గిన నీరజ్.. పారిస్ ఒలింపిక్స్‌లో రజత పతకం సాధించాడు. స్వర్ణ పతకం లక్ష్యంగా బరిలోకి దిగిన నీరజ్ ఆశలపై పాకిస్తాన్ త్రోయర్ ఆర్షాద్ నదీమ్ నీళ్లు చల్లాడు. గురువారం జరిగిన జావెలిన్ త్రో ఫైనల్లో నీరజ్ రెండో ప్రయత్నంలో 89.45మీ. విసిరి రెండోస్థానంలో ఒలింపిక్స్‌లో కెరీర్ బెస్ట్ సాధించాడు. నీరజ్ తొలి, మూడు, నాలుగు, ఐదు ప్రయత్నాలు ఫౌల్ అయ్యాయి. చివరి ప్రయత్నంలో 85మీ.లోపే త్రో చేయగలిగాడు. ఇక నదీమ్ ఆర్షాద్ 92.97మీ., రెండో ప్రయత్నంలో విసిరి ప్రథమస్థానంలో నిలిచి స్వర్ణ పతకం కైవసం చేసుకున్నాడు. ఆర్షాద్ చివరి ప్రయత్నంలో 91.76మీ. విసిరినా ప్రయోజనం లేకపోయింది. గ్రెనెడాకు చెందిన పీటర్స్(88.54మీ.) కాంస్య పతకం సాధించాడు. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో నీరజ్ చోప్రా 86.58మీ విసిరి స్వర్ణ పతకం సాధించాడు. ఇక నదీమ్ ఆర్షాద్(పాకిస్తాన్) తొలి ప్రయత్నం ఫౌల్ చేయగా.. రెండో ప్రయత్నంలో ఏకంగా 92.97మీ. విసిరి స్వర్ణ పతకం కైవసం చేసుకున్నాడు. ఈ ఒలింపిక్స్ క్వాలిఫికేషన్ రౌండ్ తొలి ప్రయత్నంలోనే 89.34మీ. విసిరి ఫైనల్‌కు చేరాడు. ఫైనల్‌కు చేరే త్రోయర్‌లు కనీసం 84మీ. విసరాల్సి ఉండగా.. నీరజ్ ఆ ఫీట్‌ను ఒకే ఒక సారి విసిరి అందుకున్నాడు. మొత్తం 12మంది త్రోయర్ల మధ్య జావెలిన్ త్రో పతక పోటీ జరిగింది. బీజింగ్ 2008 ఒలింపిక్స్‌లో 90.57విసరగా.. ఈ ఒలింపిక్స్ ఆ రికార్డును నదీమ్ బ్రేక్ చేశాడు.



హాకీలో అదరహో...

- వరుసగా రెండో ఒలింపిక్స్‌లోనూ కాంస్యం
- శ్రీజేష్ గుడ్‌బై
- ఉత్కంఠపోరులో స్పెయిన్‌పై 2-1గోల్స్‌తో భారత్ గెలుపు

పారిస్: పారిస్ ఒలింపిక్స్‌లో భారత పురుషుల హాకీ జట్టు అదరగొట్టింది. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించి 40ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించిన హాకీజట్టు.. పారిస్ ఒలింపిక్స్‌లోనూ మరోసారి కాంస్య పతకాన్ని ముద్దాడింది. దీంతో 52ఏళ్ల తర్వాత వరుసగా రెండు ఒలింపిక్స్‌లో పతకాలు సాధించింది. అంతకుముందు 1928 నుంచి 1972వరకు ఒలింపిక్స్‌లో భారత్ వరుసగా పతకాలను సాధించగా.. 1976 ఒలింపిక్స్‌లో పతకం దక్కలేదు. ఆ తర్వాత 1980 మాస్కో ఒలింపిక్స్‌లో మరోసారి బంగారు పతకాన్ని ముద్దాడిన భారత్.. ఆ తర్వాత 40ఏళ్లకు వరకు ఒలింపిక్స్‌లో పతకాన్ని సాధించలేకపోయింది. గత ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన భారత్.. తాజాగా పారిస్ ఒలింపిక్స్‌లోనూ కాంస్య పతకంతో సత్తాచాటింది. దీంతో ఈ ఒలింపిక్స్‌లో భారత్‌కు దక్కిన పతకాల సంఖ్య నాలుగు పెరిగింది. ఈసారి గ్రూప్ దశలో భారత్ బెల్జియం చేతిలో ఓడినా.. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఐర్లాండ్‌పై గెలిచి అర్జెంటీనాతో మ్యాచ్‌ను డ్రా చేసుకుంది. క్వార్టర్స్‌లో పెనాల్టీ షూటౌట్‌లో బ్రెజిల్‌పై నెగ్గిన భారత్.. సెమీఫైనల్లో జర్మనీ చేతిలో 2-3గోల్స్‌తో పోరాడి ఓడినా.. కాంస్య పతక పోరులో స్పెయిన్‌పై 2-1గోల్స్‌తో నెగ్గింది. ఇక అత్యధిక గోల్స్ చేసిన రికార్డు భారత జట్టు కెప్టెన్ హర్మన్ ప్రీత్‌కు దక్కింది. అతడు ఏకంగా 10గోల్స్ కొట్టాడు. అలాగే ఉత్తమ గోల్‌కీపర్‌గా శ్రీజేష్ నిలిచాడు.

రెజ్లింగ్‌కు వినేశ్ గుడ్‌బై

- ఫోగాట్ అపీల్ సరైనదేనంటూ 'కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్' ప్రకటన
- పతకంపై చిగురించిన ఆశలు



పారిస్: భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫోగాట్ రెజ్లింగ్‌కు గుడ్‌బై చెప్పింది. పారిస్ ఒలింపిక్స్ రెజ్లింగ్ 50కిలోల విభాగం ఫైనల్ పోటీకి ముందు అదనపు బరువు ఆమె పతక ఆశలను దెబ్బతీసింది. దీంతో మనస్తాపానికి గురైన ఫోగాట్ రెజ్లింగ్‌కు వీడ్కోలు పలుకుతున్నట్లు ఎక్స్(ట్విటర్)లో గురువారం పోస్ట్ చేసింది. 'రెజ్లింగ్ నాపై గెలిచింది. నేను ఓడిపోయాను. నన్ను క్షమించు. నాకు ఇంకా పోరాడే బలం లేదు' అని పేర్కొంది. 'రెజ్లింగ్ 2001-2024 గుడ్‌బై' అంటూ ట్వీట్ చేసింది. పారిస్ ఒలింపిక్స్ 50కిలోల ఫ్రీస్టయిల్ విభాగంలో ఫైనల్ చేరిన వినేశ్.. నిర్దేశిత బరువు కంటే 100 గ్రాములు అధికంగా ఉండటంతో అనర్హతకు గురైంది. దీనిపై సవాల్ చేస్తూ ఫోగాట్ 'కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్'ను ఆశ్రయించింది. తాను రజత పతకానికి అర్హురాలినని ఆ ఫిర్యాదులో పేర్కొంది. తాజాగా వినేశ్ చేసిన అపీల్ సరైనదేనంటూ 'కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్' పేర్కొనడంతో ఆమెకు ఒలింపిక్స్‌లో పతకంపై ఆశలు చిగురించాయి. ఈలోపే ఆమె అనూహ్యంగా వీడ్కోలు ప్రకటించింది. గత రెండు ఒలింపిక్స్‌లతో పోల్చిచూస్తే పారిస్‌లో వినేశ్‌కు చేదు అనుభవమే ఎదురైంది. రియో ఒలింపిక్స్‌లో ఆమె కాలు విరిగితే.. టోక్యో ఒలింపిక్స్‌లో 53కిలోల విభాగంలో క్వార్టర్ ఫైనల్లోనే నిష్క్రమించాల్సి వచ్చింది. ఓవైపు అయితే తనపై వస్తున్న విమర్శలకు దీటుగా సమాధానం చెప్పేందుకు బౌట్‌లో శక్తికి మించి పోరాడిన వినేశ్.. పారిస్‌లో పతకమే లక్ష్యంగా పోటీకి దిగింది. తన రెగ్యులర్ విభాగం 53 కిలోలు కాకుండా ఈసారి 50కిలోల కేటగిరీ ఎంచుకున్న ఫోగాట్‌కు యు సుసాకీ(జపాన్) రూపంలో టాప్‌సీడ్ క్రీడాకారిణి ఎదురైనా వెరువకుండా పోరాడి సంచలన విజయం సాధించింది. అదే జోరులో క్వార్టర్స్, సెమీస్ బౌట్లలో ప్రత్యర్థులను చిత్తుచేసి ఫైనల్ చేరిన తొలి భారత మహిళా రెజ్లర్‌గా నిలిచింది.

నాగచైతన్య - శోభితా ధూళిపాళ్ల నిశ్చితార్థం



హీరో అక్కినేని నాగచైతన్య, హీరోయిన్ శోభితా ధూళిపాళ్ల త్వరలో పెళ్లి పీటలెక్కబోతున్నారు. వివాహబంధం ద్వారా వీరిద్దరూ కొత్త జీవితంలోకి అడుగు పెట్టబోతున్నారని అక్కినేని నాగార్జున తన ఎక్స్‌పేజీలో అధికారికంగా ప్రకటించారు. వీరిద్దరి ఫొటోలను కూడా అభిమానులతో పంచుకున్నారు. నాగచైతన్య నిశ్చితార్థం గురించి ఆయన ఇలా పంచుకున్నారు. 'గురువారం ఉదయం 9.42 గంటలకు మా అబ్బాయి నాగచైతన్య నిశ్చితార్థం శోభిత ధూళిపాళ్లతో జరిగింది. ఈ విషయాన్ని ప్రకటించడం మాకు చాలా ఆనందంగా ఉంది. ఆమెను మా కుటుంబంలోకి స్వాగతిస్తున్నందుకు మేము చాలా సంతోషిస్తున్నాం. సంతోషకరమైన జంటకు అభినందనలు. వారికి జీవితాంతం ప్రేమ, సంతోషం కలగాలని కోరుకుంటున్నాను' అని నాగార్జున వివరించారు. తెనాలికి చెందిన శోభితా ముంబై యూనివర్శిటీ హెచ్‌ఆర్ కళాశాలలో కామర్స్ అండ్ ఎకనామిక్స్ పూర్తిచేశారు. సంప్రదాయ కూచిపూడి, భరత నాట్యంలో ప్రత్యేక శిక్షణ తీసుకున్నారు. 2013లో మిస్ ఇండియా పోటీల్లో రెండోస్థానం సొంతం చేసుకున్నారు. 2016లో అనురాగ్ కశ్యప్ దర్శకత్వం వహించిన రామన్ రాఘవ్ 2.0లో తొలిసారిగా నటించారు. అడివి శేష్ హీరోగా మహేశ్ బాబు నిర్మించిన మేజర్ సినిమాలో కీలకపాత్ర పోషించారు. పొన్నియన్ సెల్వన్, ది నైట్ మేనేజర్ 2, గూఢచారి, మేజర్, కురుప్ వంటి చిత్రాల్లో నటించారు. కల్కి చిత్రంలో దీపికా పదుకొనెకు తెలుగులో డబ్బింగ్ చెప్పారు. కాగా, 2017లో సమంతను ప్రేమించి పెళ్లి చేసుకున్న నాగచైతన్య అనుకోని కారణాలతో 2021లో విడిపోయారు.

100మీ. హర్డిల్స్‌లో జ్యోతి యర్రాజి విఫలం



తెలుగమ్మాయి జ్యోతి యర్రాజి పారిస్ ఒలింపిక్స్‌లో నిరాశపర్చింది. గురువారం జరిగిన 100మీ. మహిళల హర్డిల్స్ రెపిచేజ్ రౌండ్‌లో జ్యోతి 13.17 సెకన్లతో 4వ స్థానంలో నిలిచింది. హీట్స్ (క్వాలిఫైయింగ్ రౌండ్స్)లో అర్హత సాధించలేకపోయినా, మంచి టైమింగ్ నమోదు చేసినవాళ్లను ఎంపిక చేసి, ఫైనల్ చేరేందుకు వారికి మరో అవకాశం కల్పిస్తారు. దాన్నే రెపిచేజ్ రౌండ్ అంటారు. కానీ, జ్యోతి యర్రాజికి రెపిచేజ్ ద్వారా మరో అవకాశం లభించినా సద్వినియోగం చేసుకోలేకపోయింది. భారత్‌లో 100మీ. మహిళల హర్డిల్స్‌లో అత్యుత్తమ టైమింగ్ జ్యోతి యర్రాజిదే. 12.78 సెకన్లతో టైమింగ్‌తో యర్రాజి జాతీయ రికార్డు నెలకొల్పింది. పారిస్ ఒలింపిక్స్‌లో ఆ అంచనాలను అందుకోలేకపోయింది.


ప్రి క్వార్టర్స్‌లో ఓడిన అన్షు

మహిళల 57కిలోల ప్రిక్వార్టర్స్‌లో అన్షు మాలిక్ నిరాశపర్చింది. 2-7 తేడాతో హెలెన్ లూయిస్(అమెరికా) చేతిలో ఓటమి చవిచూసింది. తొలిరౌండ్‌లో అమెరికా రెజ్లర్ రెండు పాయింట్లు సాధించింది. రెండో రౌండ్‌లో అన్షును రెండుసార్లు కిందపడగొట్టి నాలుగు పాయింట్లు సాధించి భారీ ఆధిక్యం సాధించింది. భారత రెజ్లర్ చివర్లో రెండు పాయింట్లు రాబట్టినా ఫలితం లేకపోయింది.

పతకాల పట్టిక(టాప్-10)

దేశం	స్వ	ర	కా	మొ
1. చైనా	28	25	19	72
2. అమెరికా	27	36	34	97
3. ఆస్ట్రేలియా	18	14	11	43
4. ఫ్రాన్స్	14	18	21	53
5. బ్రిటన్	13	17	21	51
6. ద.కొరియా	12	8	7	27
7. జపాన్	12	7	13	32
8. నెదర్లాండ్స్	11	6	7	24
9. ఇటలీ	10	11	9	30
10. జర్మనీ	9	7	5	21
63. ఇండియా	0	1	4	5

గమనిక: స్వ:స్వర్ణం, ర:రజతం; కా:కాంస్యం; మొ:మొత్తం



చాను తృటిలో చేజారిన పతకం

టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన వెయిట్ లిఫ్టర్ మీరాభాయి ఛాను పారిస్ ఒలింపిక్స్‌లో నిరాశపరిచింది. బుధవారం అర్ధరాత్రి జరిగిన 49 కిలోల విభాగంలో 199 కిలోల బరువు ఎత్తి నాలుగో స్థానంలో నిలిచింది. ఆమెకంటే ఒకే ఒక కిలో ఎక్కువ వెయిట్ మోసిన సురోడ్చన ఖంబావో(థాయ్‌లాండ్) కాంస్యాన్ని ఎగరేసుకుపోయింది. దీంతో విశ్వ క్రీడల్లో వరుసగా రెండోసారి పతకం సాధించాలనుకున్న మీరాభాయి కలలు కల్లలయ్యాయి. అయితే.. విశ్వ క్రీడల్లో మెడల్ కోసం ఆమె నెలసరి నొప్పిని భరించింది. పీరియడ్స్ కారణంగా అత్యుత్తమ ప్రదర్శన చేయలేకపోయింది. ఈ విషయాన్ని తాజాగా మీరా వెల్లడించింది. 'వెయిట్‌లిఫ్టింగ్ పోటీల సమయంలో నాకు నెలసరి మూడో రోజు. దాంతో, కొంచెం బలహీనంగా మారాను. పీరియడ్ ప్రభావం నా ప్రదర్శనపై పడింది. అయితే.. పారిస్‌లో నా ఆట పట్ల చాలా సంతోషంగా ఉన్నాను. ఎందుకంటే.. గాయం నుంచి కోలుకుని ఒలింపిక్స్‌లో నా శక్తిమేరకు పోరాడాను' అని మీరాబాయి తెలిపింది.

సెమీస్‌లో ఓడిన రెజ్లర్ అమన్



రెజ్లింగ్ విభాగం సెమీస్‌లో అమన్ సెహ్రావత్ ఓటమిపాలయ్యాడు. గురువారం జరిగిన పురుషుల రెజ్లింగ్ 57కిలోల విభాగం సెమీఫైనల్లో అమన్ 0-10పాయింట్ల తేడాతో జపాన్‌కు చెందిన హిగుచి చేతిలో ఓటమిపాలయ్యాడు. హోరాహోరీగా సాగిన ఈ పోటీలో అమన్ క్వార్టర్స్‌లో చూపిన ప్రదర్శనను కనబర్చలేకపోయాడు. దీంతో నేడు జరిగే కాంస్య పతక పోటీలో క్రజ్(ప్రుటోరియా)తో తలపడనున్నాడు. క్వార్టర్‌ఫైనల్లో అమన్ 12-0 తేడాతో అబాకరోవ్(అల్బేనియా)పై విజయం సాధించాడు. అంతకుముందు ప్రిక్వార్టర్స్‌లో 10-0 తేడాతో వాడ్లిమిర్(నార్త్ మెసడోనియా)పై, తొలి రౌండ్‌లో వాడ్లిమిర్‌ను ఓడించి సెమీస్‌కు చేరాడు.

అంతిమ్‌పై నిషేధం.. ఖండించిన ఐఓఎ

పారిస్ ఒలింపిక్స్‌లో నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించిందంటూ అంతిమ్ పంఘాల్‌పై వస్తున్న వార్తలను భారత ఒలింపిక్ సంఘం(ఐఓఎ) ఖండించింది. అవన్నీ తప్పుడు కథనాలని స్పష్టం చేసింది. ఈ మేరకు ఎక్స్(ట్విటర్)లో పోస్టు పెట్టింది. "రెజ్లర్ అంతిమ్ పంఘాల్‌పై ఐవోఎ నిషేధం విధించినట్లు వచ్చిన వార్తలను ఖండిస్తున్నాం. ఇటువంటి వార్తలు రాసేముందు ఐవోఎ ఉన్నతాధికారులను సంప్రదించాలని విజ్ఞప్తి చేస్తున్నాం" అని పోస్టు పెట్టింది. పారిస్ ఒలింపిక్స్‌లో 53కిలోల విభాగంలో బరిలోకి దిగిన అంతిమ్ నిరాశపర్చింది. ప్రి క్వార్టర్స్‌లో 0-10తో యెట్గిల్(టర్కీ) చేతిలో ఓటమి చవిచూసింది.



గGBG కావు!



బ్రహ్మానందం
నటన Vనోదం
కిలాDతD
వార్త Vచిత్రం

అన్నదానముకు
Eచ్చా Vరాళం
బాగా ఆDన
దక్కును Vజయం

పోస్ట్‌మ్యాన్
అDగాడు Vలాసం
Aప్రిల్ నెలలో
అక్క Vవాహం

బDలో గురువుకు
చూపెద Vనయం
Eతరుల కష్టం
నాకు Vచారం


పుస్తక పఠనం
పెంచు Vజ్ఞానం

ఆకాశంలో
ఎగురు Vహంగం

భూఆక్రమణలు
పెంచు Vవాదం
Vష వాUవు
కలిగించు Vస్ఫోటం

Pప్పరమెంట్లు Bస్కట్లతో
Cరిపురంబులో నౌకా Vహారం
గGBG కావివి Gలేబి లాంటివి
ఎంతో మనకిV పెంచు Vవేకం!

— ఎన్.వి.ఆర్.సత్యనారాయణమూర్తి,
80745 26849



చుక్కలు కలపండి

పిల్లలూ, ఇక్కడ కనిపిస్తున్న అంకెలను వరుసగా కలిపితే అందమైన బొమ్మ వస్తుంది. ట్రై చేయండి.

నేను గీసిన బొమ్మ





మోరు గౌతమ్ కోటేశ్వరరావు,
5వ తరగతి,
కైకలూరు మండలం,
ఏలూరు జిల్లా,

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68